సోమవారం
10•6•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 8 • సంచిక 346
• పేజీలు : 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

కంగారూలను దంచేశారు

జయం మనదే

వరల్డ్‌కప్ టోర్నీలో ఆస్ట్రేలియాపై 36 పరుగుల తేడాతో భారత్ విజయదుందుభి

శతక్కొట్టిన ధవన్.. పాండ్యా, ధోనీ ధనాధన్

విజృంభించిన బుమ్రా, భువీ

వివరాలు ఆటలో

లండన్‌లోని ఓవల్ స్టేడియంలో భారత్ అభిమానుల విజయోత్సాహం

ఆస్ట్రేలియాపై విజయం అనంతరం కెప్టెన్ కోహ్లీ ఆనందహేల

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రధాని మోదీ

ప్రధానిగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రధాని నరేంద్రమోదీ తొలిసారిగా ఆదివారం తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రధానితో పాటు గవర్నర్ నరసింహన్, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి, పలువురు ఏపీ మంత్రులు శ్రీవారిని దర్శించుకున్నారు.

ఏపీ అభివృద్ధికి సంపూర్ణ మద్దతు

ఆంధ్రరాష్ట్ర ప్రజలకు కేంద్రం ఎప్పుడూ తోడుంటుంది

ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందితేనే నవభారత నిర్మాణం సాధ్యం

జగన్‌కు అభినందనలు.. సుపరిపాలన అందించాలని కోరుతున్నా

తిరుపతి సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ

5

బాలుర హవా

ఎంసెట్ - ఇంజినీరింగ్ టాపర్స్

1 కురిశెట్టి రవి శ్రీతేజ, పశ్చిమగోదావరి, ఏపీ
2 డీ చంద్రశేఖర్, రంగారెడ్డి, తెలంగాణ
3 జిలెల్ల ఆకాశ్‌రెడ్డి, రంగారెడ్డి, తెలంగాణ

ఎంసెట్ - అగ్రికల్చర్, ఫార్మసీ టాపర్స్

1 ఎంపతి కుశ్వంత్, భూపాలపల్లి, తెలంగాణ
2 దాసరి కిరణ్‌కుమార్‌రెడ్డి, తూర్పుగోదావరి, ఏపీ
3 అరుణ్ తేజ, తూర్పుగోదావరి, ఏపీ

- అగ్రికల్చర్, ఫార్మసీ టాప్-10లో బాలురు, బాలికలకు సమాన ర్యాంకులు
- 93.01 శాతం ఉత్తీర్ణత నమోదు
- ఈ నెల 20 తర్వాత కౌన్సెలింగ్ ప్రారంభం

ఎంసెట్ ఇంజినీరింగ్‌లో టాప్-10 ర్యాంకుల్లో 9 బాలురకే

తొలి 10 ర్యాంకుల్లో రంగారెడ్డి జిల్లా విద్యార్థులకు 7 ర్యాంకులు.. 82.47 శాతం ఉత్తీర్ణత నమోదు

ఫలితాలను విడుదల చేసిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం మే 3 నుంచి 9 వరకు నిర్వహించిన ఎంసెట్-2019 ఫలితాల్లో తెలంగాణ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలోని టాప్-10 ర్యాంకుల్లో 7 ర్యాంకులు రంగారెడ్డి జిల్లా విద్యార్థులు కైవసం చేసుకోగా.. ఏపీ విద్యార్థులకు 3 ర్యాంకులు దక్కాయి. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలోని టాప్-10 ర్యాంకుల్లో తెలంగాణ విద్యార్థులకు 4, ఏపీ విద్యార్థులకు 5 ర్యాంకులు లభించగా.. మరో ర్యాంకు తమిళనాడు విద్యార్థికి దక్కింది. ఇంజినీరింగ్ టాప్-10 ర్యాంకుల్లో 9 ర్యాంకులను బాలురు కైవసం చేసుకోగా.. మరో ర్యాంకు బాలికకు లభించింది. అగ్రికల్చర్, ఫార్మసీ టాప్-10 ర్యాంకుల్లో బాలురకు 5, బాలికలకు 5 ర్యాంకులు లభించాయి. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఈ ఫలితాలను విడుదల చేశారు. కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంసెట్ కమిటీ చైర్మన్, జేఎన్‌టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ ఏ వేణుగోపాల్‌రెడ్డి, కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్ యాదయ్య పాల్గొన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో 82.47 శాతం, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 93.01 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహించిన ఎంసెట్‌కు ఇంజినీరింగ్ విభాగంలో 1,42,210 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా.. 1,31,209 మంది హాజరయ్యారు. వారిలో 1,08,213 మంది అర్హత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 74,989 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా.. 68,550 మంది హాజరయ్యారు. వారిలో 63,758 మంది విద్యార్థులు అర్హత సాధించారు.

ఇంటర్ బోర్డు విద్యార్థుల్లో 28,257 మంది ఫెయిల్

ఇంజినీరింగ్ విభాగంలో ఇంటర్మీడియట్ బోర్డు నుంచి 1,28,691 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారిలో 28,257 మంది అర్హత సాధించలేదు. అలాగే సీబీఎస్‌ఈ బోర్డు నుంచి హాజరైన 1,900 మందిలో 234 మంది, ఐసీఎస్ ఈ బోర్డు నుంచి హాజరైన 109 మంది విద్యార్థుల్లో 12 మంది అర్హత సాధించలేకపోయారు. ఇంజినీరింగ్ విభాగంలో అర్హత సాధించిన మొత్తం విద్యార్థుల్లో 121-160 మధ్య మార్కులు

మిగతా 8వ పేజీలో

ఆదివారం కేటీఆర్‌ను కలిసిన మంత్రి సీహెచ్ మల్లారెడ్డి, ఎమ్మెల్సీ పీ మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, నూతనంగా ఎన్నికైన రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తదితరులు

ప్రజల సమస్యలను పరిష్కరించాలి

పంచాయతీరాజ్ చట్టాన్ని సమర్థంగా అమలుచేయాలి

నూతన జెడ్పీ చైర్మన్లు, వైస్‌చైర్మన్లతో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన జెడ్పీ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని సమర్థంగా అమలుచేసేవిధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్‌లకు కొత్తగా ఎన్నికైన జెడ్పీ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, కో-ఆప్షన్ సభ్యులతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు ఆదివారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిశారు. పరిషత్ ఎన్నికల్లో టీఆర్ఎస్ ఘన విజయాన్ని సాధించడంలో కీలకభూమిక వహించిన కేటీఆర్‌కు కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు. కొత్తగా ఎన్నికైన

మిగతా 5వ పేజీలో

లేనిభూమికి సాదాబైనామా!

ధర్మగంట

కొత్తపల్లి (హ) రెవెన్యూ అధికారుల మాయ

ఓ తాసిల్దార్ భూమే లేదంటే.. మరో తాసిల్దార్ పట్టాచేస్తారు.. అసలు పట్టాదారులకు మొండిచెయ్యి

ముడుపులిచ్చినవాళ్లకు పాస్‌పుస్తకం.. కోర్టు ఉత్తర్వులను సైతం లెక్కచేయని వైనం

తమ భూమి పత్రాలు చూపుతున్న కరీంనగర్ జిల్లా ఎలగందుల గ్రామ రైతులు

తిమ్మిని బమ్మిని చేయడంలో రెవెన్యూ అధికారులను మించినవారు లేరు.. రికార్డులు సక్రమంగా ఉన్న రైతులను వదిలేసి.. మరొకరి పేర పట్టాదార్ పాస్‌పుస్తకం ఇచ్చేశారు.. భూమిలేకుండానే వారసత్వ పట్టా ఎలాచేస్తారంటూ ఓ తాసిల్దార్ దరఖాస్తును తిరస్కరిస్తే.. ఆ లేని భూమిని సాదాబైనామా ద్వారా పట్టాచేసి.. పాస్‌పుస్తకం ఇచ్చారు మరో తాసిల్దార్.. వాస్తవంగా మొదట్నుంచీ పట్టాలో ఉన్న తమకు కాదని మరొకరికి ఎలా పాస్‌పుస్తకం ఇస్తారంటూ కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఎలగందులకు చెందిన ఎనిమిది మంది రైతులు ధర్మగంటకు మొరపెట్టుకున్నారు.

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కరీంనగర్‌జిల్లా కొత్తపల్లి మండలం ఎలగందుల శివారులోని సర్వే నంబర్ 16లో శ్రీరాములపల్లికి చెందిన శ్రీరాంవీరయ్య, శ్రీరాంలచ్చన్న, శ్రీరాంనాగయ్య, శ్రీరాంమల్లయ్య, శ్రీరాంనర్సయ్య, శ్రీరాంలచ్చయ్య, శ్రీరాం కనకయ్య, మార్కొండ మల్లమ్మకు ఒక్కొక్కరికి 1.04 ఎకరాల చొప్పున.. ఎనిమిది మందికి కలిపి మొత్తం 8.32 ఎకరాల భూమి వారసత్వంగా వచ్చింది. కుటుంబ అవసరాల కోసం ఆ భూమి నుంచి 30 గుంటల చొప్పున మొత్తం 8 మంది 6.00 ఎకరాలను

మిగతా 4వ పేజీలో

వేగంగా కదులుతున్న నైరుతి

వచ్చే 48 గంటల్లో ఓ మోస్తరు వానలు

మళ్లీ పెరిగిన ఎండల తీవ్రత

ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో అత్యధికంగా 44.4 డిగ్రీలు నమోదు

హైదరాబాద్‌లో 38.6 డిగ్రీలు

7

ఫ్రెంచ్ ఓపెన్ విజేత నాదల్

ప్రతిష్ఠాత్మక ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లో మట్టికోట రారాజు, డిఫెండింగ్ చాంపియన్ రఫెల్ నాదల్ విజృంభించాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో నాదల్ (స్పెయిన్) 6-3, 5-7, 6-1, 6-1తో డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా)పై విజయం సాధించి ఎవరికీ అందని రీతిలో 12వసారి టైటిల్ పట్టేశాడు. ఓవరాల్‌గా నాదల్‌కు ఇది 18వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కావడం విశేషం.

వివరాలు ఆటలో

బెంగాల్ హింసపై కేంద్రం సీరియస్

తృణమూల్, బీజేపీ మధ్య మళ్లీ ఘర్షణలు

ఐదుగురు కార్యకర్తల మృతి.. పలువురి ఆచూకీ గల్లంతు

పరిస్థితులు చక్కదిద్దేందుకు చర్యలు తీసుకోవాలి: కేంద్ర హోంశాఖ

నేడు ప్రధానిని కలువనున్న బెంగాల్ గవర్నర్

గవర్నర్ తీరుపై మమత ఆగ్రహం

8



ఆదివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన ఇటీవల కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కూడా ఉన్నారు.

పోచంపల్లిని అభినందించిన
సీఎం కేసీఆర్

ఎదిగినకొద్దీ ఒదగాలని సూచించిన ముఖ్యమంత్రి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నూతనంగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అభినందించారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన పోచంపల్లి ఆదివారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎమ్మెల్సీగా అవకాశమిచ్చినందుకు కేసీఆర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. వరంగల్ జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి దేశంలోనే అత్యధిక మెజార్టీతో శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ పోచంపల్లిని అభినందించారు. ఎదిగిన కొద్దీ ఒదగాలని, ప్రజాసేవకు అంకితం కావాలని కేసీఆర్ సూచించారు.

సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల
కలెక్టర్ల బదిలీ

ఉత్తర్వులు జారీచేసిన సీఎస్ ఎస్కే జోషి

హైదరాబాద్/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు ఐఏఎస్ అధికారులను బదిలీచేసింది. సిద్దిపేట జిల్లా కలెక్టర్ దేవరకొండ కృష్ణభాస్కర్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లాకు, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ పీ వెంకట్రామిరెడ్డిని సిద్దిపేట జిల్లాకు బదిలీచేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికలకు ముందు గత సంవత్సరం ఆగస్టులో ఇద్దరు కలెక్టర్లు బదిలీకాగా, ప్రస్తుతం తిరిగి యథాస్థానాలకు బదిలీ అయ్యారు.

• కార్తె సంబురం

మృగశిర కార్తె సందర్భంగా చేపలకు గిరాకీ పెరుగడంతో నల్లగొండ జిల్లా కొత్తపల్లి చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు

ఫొటో: ఆర్. ఆకాశ్, నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

90,500 మందికి చేప ప్రసాదం

గతేడాది కన్నా 4500 మంది అధికం • సహకరించినవారికి మంత్రి తలసాని కృతజ్ఞతలు

ఎగ్జిబిషన్ మైదానంలో రెండోరోజు చేప ప్రసాదం పంపిణీని పరిశీలిస్తున్న మంత్రి తలసాని

మత్స్యశాఖ ఏర్పాటుచేసిన కొర్రమీను చేపల కౌంటర్ వద్ద పెద్ద సంఖ్యలో బారులుతీరిన ప్రజలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మృగశిర కార్తెను పురస్కరించుకొని బత్తిన మృగశిర ట్రస్ట్ చేప ప్రసాద వితరణ ప్రశాంతంగా ముగిసింది. గత ఏడాది 86 వేల మందికి పంపిణీచేయగా.. ఈసారి 90,500 మందికి చేప ప్రసాదం అందజేశారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన ప్రసాదం పంపిణీ.. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. శుక్రవారం నుంచే జనం రావడంతో ఎగ్జిబిషన్ మైదానం ప్రాంతాలు ఉబ్బసం వ్యాధిగ్రస్థులతో నిండిపోయాయి. రెండురోజులపాటు కొనసాగిన ప్రసాద వితరణలో 90,500 మంది కొర్రమీను చేప ప్రసాదం స్వీకరించినట్టు మత్స్యశాఖ అధికారులు వెల్లడించారు. ఈ సంఖ్య గతేడాది కన్నా 4,500 అదనం. చేప ప్రసాదం పంపిణీ ఏర్పాట్లల్లో అన్నీ తానై వ్యవహరించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం కూడా ఎగ్జిబిషన్ మైదానానికి వచ్చి చేప ప్రసాద వితరణ కొనసాగుతున్న తీరును పర్యవేక్షించారు. ప్రభుత్వ యంత్రాంగాల చొరవతో చేప ప్రసాదం పంపిణీ విజయవంతం కావడంతో.. మంత్రి వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, పాతబస్తీ దూద్‌బౌలిలోని తమ నివాసంతో పాటు, తమ కుటుంబసభ్యులు నివాసించే కవాడిగూడ (కల్పన థియేటర్ సమీపం), వనస్థలిపురం (వాటర్‌ట్యాంక్ సమీపం), కూకట్‌పల్లి (బాలాజీనగర్)లో సోమవారం ఒక్కరోజు చేప ప్రసాదం అందజేయనున్నట్టు బత్తిని హరినాథ్‌గౌడ్ తెలిపారు.

రవిప్రకాశ్ మోసాలకు ఆధారాలు దొరికాయి

- సాక్షులను బెదిరిస్తున్నాడు.. విచారణకు సహకరించలేదు
- కోర్టుకు పూర్తి నివేదిక అందజేస్తాం
- కోర్టు ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు
- సైబర్‌క్రైం ఏసీపీ శ్రీనివాస్

సైబరాబాద్ సైబర్‌క్రైం ఏసీపీ శ్రీనివాస్‌కుమార్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: టీవీ 9 మాజీ సీఈవో రవిప్రకాశ్ చేసిన ఫోర్జరీ, తప్పుడు పత్రాల సృష్టికి సంబంధించిన ఆధారాలు, సాక్ష్యాలు లభించాయని సైబరాబాద్ సైబర్‌క్రైం ఏసీపీ సీహెచ్‌వై శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. సాక్షులను బెదిరించడమే కాకుండా విచారణకు ఏమాత్రం సహకరించలేదన్న విషయాన్ని సోమవారం కోర్టుకు నివేదిస్తామన్నారు. రవిప్రకాశ్‌ను అరెస్టు చేయడంపై కోర్టు ఉత్తర్వుల మేరకు నడుచుకుంటామని చెప్పారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రవిప్రకాశ్‌పై నమోదైన రెండు ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలపై జరిపిన దర్యాప్తులో సాంకేతికపరమైన ఆధారాలతోపాటు కుట్రకు సంబంధించిన పూర్తి వివరాలను సాక్షులు వెల్లడించారని పేర్కొన్నారు. నమోదైన ఫిర్యాదులోని అంశాలపైనే విచారణ సాగిందని, దర్యాప్తులో లభించిన ఆధారాల ప్రకారం రవిప్రకాశ్ నేరం చేసినట్టుగా భావిస్తున్నామని తెలిపారు. హైకోర్టు ఎలాంటి ఉత్తర్వులు ఇచ్చినా వాటికి అనుగుణంగా నడుచుకుంటామని పేర్కొన్నారు. విచారణకు రవిప్రకాశ్ ఏమాత్రం సహకరించలేదని, తామడిగిన పత్రాలు కూడా ఇవ్వలేదన్నారు. మాజీ సీఎఫ్‌వో మూర్తి చెప్పిన విషయాలతో రవిప్రకాశ్ చెప్పినవాటితో పొంతనలేదని, కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసినట్టు భావిస్తున్నామని చెప్పారు. సాక్షులను రవిప్రకాశ్ బెదిరిస్తున్నట్టు సమాచారం ఉన్నదని, మరికొందరు సాక్షులతో రాయబారం జరిపినట్టు సాంకేతిక ఆధారాలు సేకరించామని ఏసీపీ శ్రీనివాస్ చెప్పారు. ఇదే కేసులో నటుడు శివాజీకి రెండ్రోజుల కిందట 41ఏ సీఆర్పీసీ నోటీసు ఇచ్చామని తెలిపారు. అయితే ఆయన అందుబాటులోకి రాకపోవడంతో.. ఆయన భార్య నోటీసు తీసుకొన్నారన్నారు. శివాజీ హైదరాబాద్ రాగానే సమాచారం ఇస్తానని ఆయన భార్య చెప్పారని తెలిపారు.

రవిప్రకాశ్ అరెస్ట్‌పై వీడనున్న ఉత్కంఠ!

నేడు హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ

ఫోర్జరీ చేసినట్టు ఆధారాలు సమర్పించనున్న సైబర్‌క్రైం పోలీసులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నకిలీ పత్రాలు సృష్టించడం, ఫోర్జరీ, డాటా చౌర్యం కేసుల్లో నిందితుడిగా ఉన్న టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్ అరెస్టుపై ఉత్కంఠకు సోమవారం తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముందస్తు బెయిల్ కోసం రవిప్రకాశ్ పెట్టుకొన్న పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరుగనున్నది. అలంద మీడియా ఫిర్యాదు మేరకు రవిప్రకాశ్‌పై మూడు కేసులు నమోదయ్యాయి. విచారణకు హాజరవ్వాలంటూ సీఆర్పీసీ 160తోపాటు సీఆర్పీసీ 41ఏ కింద నోటీసులు జారీచేశారు. దాంతో ముందస్తు బెయిల్ కోసం తొలుత హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించి భంగపాటుకు గురయ్యాడు. అన్నిదారులు మూసుకుపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నెల 4న సైబరాబాద్ సైబర్‌క్రైం పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యాడు. వరుసగా మూడురోజులపాటు సైబర్‌క్రైం పోలీసులు పలు అంశాలపై రవిప్రకాశ్‌ను ప్రశ్నించారు. 41 సీఆర్పీసీ నోటీసుల మేరకు శుక్ర, శనివారాల్లో బంజారాహిల్స్ పీఎస్‌లో విచారణకు హాజరయ్యారు. రెండు విభాగాల్లో కూడా రవిప్రకాశ్ పొంతనలేని సమాధానాలు చెప్పినట్టు సమాచారం. ఫోర్జరీ చేసినట్టు లభించిన ఆధారాలను హైకోర్టుకు సమర్పించేందుకు సైబర్‌క్రైం పోలీసులు సిద్ధమయ్యారు. ఐదు రోజుల విచారణ అంశాల ఆధారంగా రవిప్రకాశ్ అరెస్టుపై హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలుచేయాలని సైబరాబాద్ సైబర్‌క్రైం, బంజారాహిల్స్ పోలీసులు యోచిస్తున్నట్టు తెలిసింది. రవిప్రకాశ్ అరెస్టుపై కొనసాగుతున్న ఉత్కంఠకు మరికొన్ని గంటల్లో తెరపడే అవకాశాలున్నాయి.

ముహూర్తం

సూర్యోదయం: 5.45 గంటలకు

సూర్యాస్తమయం: 6.46 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం అష్టమి రాత్రి 10.25 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: పుబ్బ మధ్యాహ్నం 2.22 వరకు, తదుపరి ఉత్తర, అమృతఘడియలు: ఉదయం 8.21 నుంచి 9.57 వరకు, రాహుకాలం: ఉదయం 7.23 నుంచి 9.00 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.50 నుంచి మధ్యాహ్నం 12.42 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.18 నుంచి సాయంత్రం 4.10 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 2.44 నుంచి సాయంత్రం 4.20 వరకు.

లోకం పోకడ

సార్సార్.. నాకో మంత్రిపదవుంటే సర్దండి సార్.. ప్లీజ్!

భూసారకార్డుల ఆధారంగా
రైతులకు ఎరువులు!

వచ్చే యాసంగి నుంచి ప్రయోగాత్మకంగా అమలు

- గ్రామస్థాయిలో 711 భూసార ప్రాజెక్టుల ఏర్పాటు
- నిరుద్యోగ యువతకు ల్యాబ్‌ల నిర్వహణ బాధ్యత
- రూ.16 కోట్లు విడుదలకు వ్యవసాయశాఖ నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రవ్యాప్తంగా గ్రామస్థాయిలో 711 భూసార పరీక్ష ప్రాజెక్టులు (ల్యాబ్) ఏర్పాటు కానున్నాయి. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే ఎరువుల పంపిణీ చేయనున్నారు. వచ్చే యాసంగి నుంచి ప్రయోగాత్మకంగా అమలుచేయాలని కేంద్ర వ్యవసాయశాఖ భావిస్తున్నది. ఇప్పటికే పలుసార్లు భూసార పరీక్షల ఫలితాల కార్డులు, ఎరువుల పంపిణీపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సూచించింది. ఎరువుల దుకాణాదారులు ఆధార్, భూసార ఫలితాల కార్డుల ఆధారంగానే ఎరువులు విక్రయించేలా చేయనున్నారు. దీనిపై విస్తృత అవగాహన కల్పించేలా ప్రచారంచేయాలని సన్నాహాలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా మొదటిదశలో 10 కోట్ల మందికిపైగా రైతులు భూసార ఫలితాల కార్డులను పొందారని, తెలంగాణ రాష్ట్రం మొదటి దశలో అద్భుతంగా పనిచేసిందని కేంద్రం పేర్కొన్నది. ఎరువులు, ఖనిజ లవణాల వాడకాన్ని నియంత్రించే దిశగా దేశవ్యాప్తంగా 14 కోట్ల మంది రైతులకు సాయిల్ హెల్త్‌కార్డులను అందించే లక్ష్యంతో భూసారకార్డుల పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. ఈ పథకం అమలుకు అవసరమైన నిధులను పూర్తిగా కేంద్రమే అందిస్తున్నది. రాష్ట్ర వ్యవసాయశాఖ పరిధిలో 12, వ్యవసాయ మార్కెటింగ్‌శాఖవి 28, సంచార భూసార కేంద్రాలు 4, మినీ భూసార పరీక్ష కేంద్రాలు 2,050 ఉన్నాయి. వీటిద్వారా రాష్ట్రంలో మొదటిదశలో 2015-16లో 5 లక్షల మట్టి నమూనాలు పరీక్షించి 25.2 లక్షల కార్డులు, 2016-17లో 5.35 మట్టి నమూనాలు పరీక్షించి 30.33 లక్షల కార్డులు పంపిణీ చేసినట్లు వ్యవసాయశాఖ నివేదికలు వెల్లడిస్తున్నాయి. రెండోదశలో 2017-18, 2018-19లో మొత్తం 9.73 లక్షల మట్టి నమూనాలు పరీక్షించి, 55.45 లక్షల భూసారకార్డులు పంపిణీ లక్ష్యంగా నిర్ణయించింది. ఇప్పటికే కొన్ని కార్డులు పంపిణీచేశారు.

పైలట్ ప్రాజెక్టు విజయవంతం

గ్రామస్థాయిలో 711 భూసార ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఇందుకు కేంద్రం అందించిన రూ.16 కోట్లు వినియోగించనుంది. వీటి నిర్వహణ బాధ్యతను నిరుద్యోగ యువతకు అప్పగించనున్నారు. ఇటీవల వ్యవసాయశాఖ భూసార పరీక్షలపై పైలట్ ప్రాజెక్టు చేపట్టి విజయవంతంగా పూర్తిచేసింది. రాష్ట్రంలోని 558 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ఎంచుకొని 1.15 లక్షల మట్టి నమూనాలు సేకరించి, పరీక్షలు నిర్వహించి భూసారకార్డులను రైతులకు అందజేస్తున్నారు. గతంలో 10 హెక్టార్లకు ఒక మట్టి నమూనా సేకరించగా, మెరుగైన ఫలితాలకు ఈ సీజన్‌లో గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని నేల స్వభావాలకు అనుగుణంగా మట్టి పరీక్షలు నిర్వహించారు.

రాష్ట్రంలో శిశుమరణాలు
తగ్గుముఖం

- ప్రభుత్వ చర్యలతో భవిష్యత్‌లో మరింత మెరుగు
- నేషనల్ శాంపిల్ సర్వేలో వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

సర్కారు వైద్యరంగంలో వినూత్న మార్పులు తీసుకురావడమే కాకుండా శిశు మరణాల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. సర్కారు వైద్య విభాగాలు చేపడుతున్న చర్యలతో మాతాశిశు మరణాలు రేటు తగ్గుతున్నది. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్) ఆఫీస్ పరిధిలో చేపట్టిన సర్వేలో వెల్లడైన అంశాల ప్రకారం తెలంగాణలో ఏటా శిశు మరణాల రేటు తగ్గుతున్నది. దేశవ్యాప్తంగా 2014లో 40శాతం, 2015లో 39శాతం, 2016లో 36శాతంగా నమోదవగా.. తెలంగాణలో 2014లో 35 శాతం, 2015లో 34, 2016లో 30శాతం ఉన్నట్టు గుర్తించారు. ఆతర్వాత రెండేండ్లలో ఇది మరింత తగ్గిందని వైద్య నిపుణులు చెప్తున్నారు. చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని 22 ఎస్ఎన్‌సీయూలు, 61ఎన్‌బీఎస్‌యూ, 562 ఎన్‌బీసీసీలను వైద్య, ఆరోగ్యశాఖ ఏర్పాటుచేసింది. ఎస్ఎన్‌సీయూల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఎఫ్‌బీఎన్‌సీ శిక్షణ అందించి అంతర్జాతీయ ప్రమాణాలతో చిన్నారులకు వైద్య, వైద్యశాలల్లో వసతులు కల్పించారు. ప్రసవ మరణాలు తగ్గించడంతోపాటు తల్లీబిడ్డలకు ఆరోగ్య క్రమశిక్షణ, ఎప్పటికప్పుడు టీకాలు, మందులు అందించి ఆరోగ్యంగా ఉండేందుకు వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. తల్లీబిడ్డలకు మంచి ఆరోగ్య అలవాట్లను అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ కిట్ల పథకాన్ని అమలు చేస్తున్నది.

9 దవాఖానల్లో మాతాశిశు సంరక్షణ కేంద్రాలు

నవజాత శిశువులను కాపాడేందుకు మాతాశిశు సంరక్షణ ప్రత్యేక విభాగాల ఏర్పాటుపై వైద్య, ఆరోగ్యశాఖ దృష్టి సారించింది. 8 జిల్లాస్థాయి దవాఖానలు, జనగామ ఏరియా దవాఖానలో మాతాశిశు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటికి ప్రభుత్వం ఏటా రూ.93.15 లక్షలు ఖర్చు చేస్తున్నది. అలాగే 50 పడకల స్థాయిలో 10 మాతాశిశు కేంద్రాలను నెలకొల్పి నవజాత శిశువులకు వైద్యసేవలు అందిస్తున్నారు.

ఏటేటా మెరుగుపడుతున్నాం

వైద్యరంగాన్ని పటిష్ఠపరచడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. కేసీఆర్ కిట్ల పథకం, ఇతర కార్యక్రమాల కారణంగా మన దగ్గర మాతాశిశు మరణాల రేటు తగ్గుతున్నది. మన రాష్ట్రంలో వైద్యరంగం ఏటేటా మెరుగవుతున్నది. కేరళ, తమిళనాడు రాష్ట్రాల తర్వాత ప్రభుత్వ వైద్యసేవల్లో మనం మూడో స్థానంలో ఉన్నాం. మాతాశిశు మరణాల నియంత్రణకు సర్కారు దవాఖానల్లో మిడ్‌వైఫరీ నర్సుల ద్వారా ప్రత్యేక సేవలు అందిస్తున్నాం. తద్వారా సహజ ప్రసవాలు జరుగడమే కాకుండా ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వగలుగుతారు.

– ఈటల రాజేందర్, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి

దక్కనీ జాతి గొర్రెలకు ప్రాధాన్యం

రాష్ట్రంలో 10 వేల యూనిట్ల పంపిణీకి చర్యలు

గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ వీ లక్ష్మారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దక్కనీ జాతి గొర్రెల సంతతి పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. గొల్లకురుమలకు దక్కనీ జాతి గొర్రెలను రాయితీపై పంపిణీచేయాలని నిర్ణయించింది. ప్రభుత్వం సబ్సిడీపై ఇప్పటివరకు 3.65 లక్షల మందికి 76 లక్షల గొర్రెలు అందించగా, వేసవి నేపథ్యంలో తాత్కాలికంగా పంపిణీని నిలిపివేశారు. వర్షాలు మొదలుకాగానే నెల్లూరు జాతితోపాటు పదివేల యూనిట్ల దక్కనీ జాతి గొర్రెలను పంపిణీచేయనున్నట్టు గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ వీ లక్ష్మారెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్, సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లోని గొల్లకురుమల సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తిమేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. మహారాష్ట్రలోని సతారా, సాంగ్లీ, షోలాపూర్, నాందేడ్, కర్ణాటకలోని బళ్లారి, చిత్రదుర్గ, దావణగిరి, బీదర్, గుల్బర్గా ప్రాంతాల నుంచి దక్కనీ జాతి గొర్రెలను సేకరించనున్నారు. రవాణా, దాణా, మందులు ఇలా అన్ని ఖర్చులు కలిపి ఒక్కో యూనిట్‌ను రూ.1.25 లక్షలకు కొనుగోలు చేయనున్నారు. ఆయా రాష్ట్రాల్లో లభ్యత, తెలంగాణలో ఉన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని 10 వేల యూనిట్ల (యూనిట్‌కు 20 గొర్రెలు , ఒక పొటేలు) కొనుగోలుకు సిద్ధమవుతున్నారు. ఈ జాతి గొర్రెలో రోగ నిరోధకశక్తి ఎక్కువగా ఉంటుందని, కరువు పరిస్థితుల్లో తక్కువ మేత తీసుకొని బతకగలవని పశుసంవర్ధకశాఖ అధికారులు చెప్తున్నారు. మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ, సిద్దిపేట ప్రాంతాల్లో దక్కనీ జాతి గొర్రెలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ జాతిగా పేరున్న దక్కనీ గొర్రెలను కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదని లక్ష్మారెడ్డి అన్నారు. ఇప్పటికే పంపిణీచేసిన వాటిలోనూ కొన్ని దక్కనీ జాతి గొర్రెలు ఉన్నాయని తెలిపారు. వేసవి ముగియగానే 10 వేల యూనిట్ల పంపిణీకి చర్యలు తీసుకుంటామని వీ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

దళిత యువతకు ఆర్థిక దన్ను

అత్యవసర సమయాల్లో ఆదుకొనేందుకు ప్రత్యేక నిధి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దళిత విద్యార్థులు, యువతకు ఆర్థికంగా చేయూతనందించేందుకు రాష్ట్ర సర్కారు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రత్యేక నిధి ద్వారా అత్యవసర సందర్భాల్లో ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్నది. ఈ నిధికి 2018-19 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.62 కోట్లు మంజూరుచేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రత్యేక నిధి కోసం ఎస్సీ అభివృద్ధిశాఖ రూ.40 కోట్లు ప్రతిపాదించింది. ఎంఫిల్, పీహెచ్‌డీ సాల్కర్స్ అయిన దళిత విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి సెమినార్లలో పాల్గొనేందుకు, సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలు, జాతీయ, అంతర్జాతీయ ఫెలోషిప్ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు, జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనడానికి వెళ్లేందుకు, బసచేయడానికి వీలుగా విద్యార్థులకు సాయం అందజేస్తారు. ఎస్సీ హాస్టళ్లలోని విద్యార్థులు పాము, కుక్కకాటుకు గురైతే, ఇతర ప్రమాదాలబారిన పడితే కూడా ఈ నిధి నుంచి ఆదుకుంటారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న దళిత విద్యార్థులు, యువత ఈ సాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక వ్యక్తి ఒకేసారి ఈ సాయం పొందేందుకు అర్హులు. ఎస్సీలకు అత్యవసర సమయంలో అందించే ఈ ఆర్థికసాయాన్ని రూ.2 లక్షలలోపు జిల్లా కలెక్టరు మంజూరుచేస్తారు. రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్టర్, రూ.5 లక్షలకుపైన అయితే ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యదర్శి మంజూరుచేస్తారు.

టాంజానియా టీఆర్ఎస్ ఎన్నారైశాఖ కమిటీ నియామకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర సమితి టాంజానియా ఎన్నారైశాఖకు కమిటీని ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల ప్రకటించారు. అధ్యక్షుడిగా నరసింహారెడ్డి వంగ, ఉపాధ్యక్షుడిగా కిశోర్ బొల్లకపల్లి, ప్రధాన కార్యదర్శిగా కుశాల్‌రెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్‌రెడ్డి, కోశాధికారికిగా శ్రీనివాస్ సిరిపురం, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్‌రెడ్డి రావుల, ప్రవీణ్ చంద్ర మాకలా, సంతోష్‌రెడ్డి కోత, సైదులు కొల్లోజి, మహేశ్‌రెడ్డి, ఐటీ కార్యదర్శిగా శ్రవణ్‌కుమార్, మీడియా ఇంచార్జిగా నాగరాజు జల్లా, చారిటీ ఇంచార్జిగా దయాకర్‌చారి, ఈవెంట్ ఇంచార్జిగా అనిల్‌రెడ్డితోపాటు కల్చరల్ మెంబర్‌షిప్ ఇంచార్జి, సోషల్ మీడియా ఇంచార్జిలను కూడా నియమించారు.

ఎంసెట్ ఫలితాలన్నీ నారాయణ పక్షం!

తెలంగాణలో నారాయణ ఆధిపత్యం సుస్పష్టం !!

TS ఎంసెట్ కేటగిరీల వారీగా స్టేట్ టాపర్లుగా నిలిచిన నారాయణ విద్యార్థులు

1st D AKASH CHERUKURI HT No.1922C03255
1st MD JAWAHAR NAUSHEEN HT No. 1921E08033
1st MONISHA PRIYA HT No.1912E05072
1st BURRA SHIVANI SRI VASTAVA HT No.1911E09262
2 GATTU KARTHIK HT No.1921C01149
2 KOPURI MANISHA HT No.1921C01893

1st RANK — NARAYANA SCHOOL STUDENT — SUNKARA SAI SWATHI HT No.9258220866

1st RANK — NARAYANA SCHOOL STUDENT — MADHURI REDDY GANGADASARI HT No.420127327

TS ఎంసెట్ కేటగిరీల వారీగా స్టేట్ టాపర్లుగా నిలిచిన నారాయణ విద్యార్థులు

2 PARIGE TIRZAH AMULYA HT No.1912K01211
2 GONGATI KRISHNA VAMSI HT No. 1912R01366
3 THIKALA JASON JONES HT No.1921B08299
3 PERUGU RISHIK HT No.1923C03159
3 KANNIDI HARI KIRAN HT No.1925B05008
3 ASRA QURESHI HT No.1912E08030
3 ANDRAJU MANOJ VARMA HT No.1924C01411

ఎంసెట్-2019లో తెలుగు విద్యార్థులతో నారాయణ సాధింపజేసిన టాప్ 10లోపు ర్యాంకులు

2 P VEDA PRANAV H.T. No. 5595210652
2 D CHANDRASEKHAR HT No.1924C10186
3 GILLELLA AKASH REDDY HT No.1925C10176
4 B CHANDRASEKHARA H.T. No. 2062103039
4 BATTEPATI KARTHIKEYA HT No.1921C04102
4 SUNKARA SAI SWATHI HT No.1911R01567
5 BATTEPATI KARTHIKEYA H.T. No. 5605210114
5 MADHURI REDDY GANGADASARI H.T. No. 9194220517
6 RISHI SARRAF H.T. No. 5793210751
6 KRISHNA VAMSI H.T. No. 9163219148
6 B SAI VAMSHI HT No.1922C10058
6 MONISHA PRIYA HT No.1912E05072
7 K JAYASREE VAISHNAVI H.T. No. 6356230075
7 SURAPANENI SAI VIGNA HT No.1923C10074
7 B SHIVANI SRI VASTAVA HT No.1911E09262
8 A ABHIJITH REDDY H.T. No. 5495210059
9 ARYAN LADDHA H.T. No. 5605210065
9 P VEDA PRANAV HT No.1924C10003
10 APPAKONDA ABHIJITH REDDY HT No.1923C10062

TS EAMCET ఇంజినీరింగ్‌లో 100లోపు ర్యాంకులు

11 M JAWAHAR NAUSHEEN HT No.1921E08033
16 THIVESH CHANDRA M HT No.1924C10064
18 RISHI SARRAF HT No.1925C12073
21 AKASH CHERUKURI HT No.1922C03255
22 SAYYASACH REDDY E HT No.1925C10211
25 P CHERRITH REDDY HT No.1922C10260
26 M DILEEP KUMAR RE HT No.1924C09293
29 SRIRAM GOUTAM P HT No.1923C09268
32 ARYAN SANTOSH SAHOO HT No.1924C09068
34 PUNNA HITESH KUMAR HT No.1925C08068
35 VISHWANTH K HT No.1924C10261
37 PERUGU RISHIK HT No.1923C03159
38 A.BHANU TEJA HT No.1925B06128
39 SATWIK M HT No.1922C09004
40 B SATHVICK REDDY HT No.1925C10174
41 SAI GOKUL V HT No.1924C09283
42 K KARTHIKEYA REDDY HT No.1925C10118
43 K SAMARSHEEL YADAV HT No.1923P04149
44 ARYAN LADDHA HT No.1922C10250
48 MEGHANA DEWAJI HT No.1924A02508
49 P RAHUL KUMAR HT No.1923S05109
50 K AAKASH REDDY HT No.1923C09032
52 J MUKESH REDDY HT No.1922C10221
53 B V N S ADITYA HT No.1922S02129
56 GATTU KARTHIK HT No.1921C01149
58 MOURILA SREEVATSAV HT No.1922C03019
60 GOLLAMUDI SRI HARSHITHA HT No.1923D12805
62 YEREELA KARTHIK REDDY HT No.1923E07195
64 M SURYA PRAKASH RED HT No.1921C08228
65 SUNKAPI PRANAY BANNA HT No.1924C05089
69 NIMMATURI KOUSHIK SAI HT No.1923D04080
70 B VAJREESH GOWTHAM HT No.1925C10156
72 C SAI SHASHANK REDDY HT No.1924C08049
73 DULAM KARTHIK HT No.1925C02548
78 NITIN CHANDAR HT No.1922C10005
81 P SHETTY HEMANGINI HT No.1923C05086
82 P SAI PRAFUL REDDY HT No.1924C08065
83 PATAN NADIR KHAN HT No.1923K07778
84 R AMRITH VARMA HT No.1922C08138
86 ANDRAJU MANOJ VARMA HT No.1924C01411
87 H CHAITANYA DHANSAY HT No.1923K06064
90 H PAVAN KUMAR HT No.1923B02370
92 A K CHANDRA REDDY HT No.1923C13004
97 PEDDI HASA HARI TEJA HT No.1921C04254
99 DIL ROHIT HT No.1925B02008

TS EAMCET మెడికల్‌లో 100లోపు ర్యాంకులు

13 G MADHURI REDDY HT No.1913B08124
19 G KRISHNA VAMSI HT No.1912R01366
24 SANJANA SONTHOSHI HT No.1913K03911
30 CHENCHU AKSHAYA HT No.1912E08041
35 SANAVEDAM SRAVYA HT No.1912T02156
40 T SESHA SAI LAHARI HT No.1911S02043
41 VELURI LAKSHMI VENEELA HT No.1912S03022
45 BACHU TEJASWINI HT No.1912K03175
47 K J VAISHNAVI VARNI HT No.1912K01081
53 CHINNALA SAI AREYA HT No.1911D07369
54 MANGAPURAM DHANUSH HT No.1911R01563
60 D ROHIT SAI HT No.1912S02088
64 QURESHI ASRA HT No.1912E08030
71 YENNI SUPRIYA HT No.1911T02236
74 LADI KEERTHIKA HT No.1913T02169
75 THIRUMURU HARSHITHA HT No.1913K03477
78 MULLAPUDI JITESH HT No.1911S02129
81 VADADA RAM SAI HT No.1912T02338
83 G CHARAN AADITYA REDDY HT No.1911E06022
89 KAJA VARUN HT No.1911S02274
92 SUGGALA VISHAL HT No.1912S02112
94 A. GIREESH CHANDRA HT No.1912E06343
95 MANTINA ROHITH HT No.1912T02619
100 S AISHWARYA HT No.1913T01400

గత 15 సంవత్సరాలలో వివిధ పోటీ పరీక్షలలో 26 సార్లు ఫస్ట్ ర్యాంకు సాధించిన ఏకైక విద్యాసంస్థ నారాయణ. ఈ రికార్డు ఏ విద్యాసంస్థ సాధించలేదు.

1 Rank 2005 | 1 Rank 2006 | 1 Rank 2007 | 1 Rank 2007 | 1 Rank 2008 | 1 Rank 2009 | 1 Rank 2009 | 1 Rank 2009 | 1 Rank 2010 | 1 Rank 2010 | 1 Rank 2010 | 1 Rank 2011 | 1 Rank 2011 | 1 Rank 2012 | 1 Rank 2014 | 1 Rank 2014 | 1 Rank 2015 | 1 Rank 2015 | 1 Rank 2015 | 1 Rank 2016 | 1 Rank 2016 | 1 Rank 2017 | 1 Rank 2018 | 1 Rank 2018 | 1 Rank 2018 | 1 Rank 2019

మొత్తం తెలంగాణ ఎంసెట్ సెలక్షన్స్ **27,234**

లాంగ్‌టర్మ్ నీట్ బ్యాచ్ కోచింగ్ వివరాలు

NEET LONG TERM 2019-20 CONCESSIONS		NEET LONG TERM 2019-20 CONCESSIONS	
NEET-19 MARKS	CONCESSION %	NEET-19 MARKS	CONCESSION %
> 465	90%	> 420-434	50%
> 450-464	75%	> 410-419	40%
> 435-469	60%	> 400-409	30%

Classes Commence From : 19-06-2019

FOR LT NEET 2019-20 CONTACT

MADHAPUR (Hostel)	94909758840/ 8333826777/8886837153
PRAGATHINAGAR (Hostel)	7981935250/9912348354/4009
DILSUKHNAGAR (Hostel)	8179880537/9912343880
DILSUKHNAGAR (Day)	9912345333/9912341942
KUKATPALLY (Day)	9247446786
S.R. NAGAR (Day)	8179880514
NARAYANAGUDA (Day)	8179880486

SRAMAYEVA JAYATHE

నారాయణ విద్యాసంస్థలు

ఈ ప్రకటనలో ఏవైనా ముద్రణాదోషాలుంటే సవ్యాదయంతో మార్చుకోగలరు శ్రీ అర్హతి ఎడ్యుకేషనల్ సొసైటీ వారి సౌజన్యంతో

ఇంజినీరింగ్‌లోనైనా.. మెడికల్‌లోనైనా.. ఇలాంటి ఫలితాలు సాధించే దమ్ము

ఒక్క శ్రీచైతన్యకు తప్ప మరెవ్వరికీ లేదు !

TS EAMCET 2019 Results

ఇంజినీరింగ్‌లో టాప్ 10 లోపు 10 ర్యాంకులు శ్రీచైతన్యవే!

1 STATE ENGINEERING RANK — KURISETI RAVI SRI TEJA, H.T.No.1922S02265

2 STATE RANK — D C S S HETHAHAVYA H.T.No. 1924C10186
3 STATE RANK — GILLELLA AKASH REDDY H.T.No. 1925C10176
4 STATE RANK — BATTEPATI KARTHIKEYA H.T.No. 1921C04102
5 STATE RANK — GORTHI BHANU DATTA H.T.No. 1925S03677
6 STATE RANK — B SAI VAMSHI H.T.No. 1922C10058
7 STATE RANK — SURAPANENI SAI VIGNA H.T.No. 1923C10074
8 STATE RANK — G HITHENDRA KASYAP H.T.No. 1923S03709
9 STATE RANK — P VEDA PRANAV H.T.No. 1924C10003
10 STATE RANK — APPAKONDA ABHIJITH REDDY H.T.No. 1923C10062

అగ్రి /మెడికల్‌లో టాప్ 10 లోపు 6 ర్యాంకులు శ్రీచైతన్యవే !

1 STATE AGRI / MEDICAL RANK — EMPATI KUSHWANTH, H.T.No. 1913E02192

3 STATE RANK — M V SAI ARUN TEJA H.T.No. 1913S02269
5 STATE RANK — ARE AKSHAY H.T.No. 1912E09145
8 STATE RANK — B SIDDARTH BHARADWAJ H.T.No. 1911T02368
9 STATE RANK — V POOJA H.T.No. 1911S01167
10 STATE RANK — TIPPARAJU HASITHA H.T.No. 1913E07194

ఇంజినీరింగ్‌లో టాప్ 100 లోపు 76 ర్యాంకులూ ఒక్క శ్రీచైతన్యవే

12 B CHETAN 1925S02116	13 A ABHINAV 1922S06072	14 G SURYA LIKHITH 1921S06134	15 K B PRAKASH 1922S01286	16 T CHANDRA 1924C10064	17 AMIT R 1923B07019	19 C SURYA 1923S03670	20 G GAGAN DEEP 1921D01498	21 AKASH C 1922C03255	22 SAVYASACH 1925C10211	23 P R KRISHNA 1921S01388	24 AKSHITH S E 1923S02240	25 P CHERRITH 1922C10260
26 M DILEEP 1924C09293	28 SHREYAS P 1921E06128	29 GOUTAM P 1923C09268	30 KSHITIJ RAJ 1923S01262	31 C PAVAN SAI 1923C10035	32 A SANTOSH 1924C09008	33 M VAMSI 1922S02444	34 P HITESH 1925C08068	35 VISHWANTH K 1924C10261	36 SANTOSH G 1925C10251	37 P RISHIK 1923C03159	39 SATWIK M 1922C08004	40 B SATHVICK 1925C10174
41 SAI GOKUL V 1924C09283	42 K KARTHIKEYA 1925C10118	43 B KARTHEEK 1923N02056	44 ARYAN L 1922C10250	46 P PREETHAM 1923S05089	48 MEGHANA D 1924A02508	50 K AAKASH 1923C09032	51 KONDA RENU 1925S02335	52 J MUKESH 1922C10221	54 MD SAYEED 1921S01076	55 S RITEESH 1925S02199	56 G KARTHIK 1921C01149	57 K GOWTHAM 1923S03319
59 M SREEHITH 1922S01233	61 D SARAT 1925S03424	63 N KAILASH 1923N02072	64 M PRAKASH 1921C08228	65 S PRANAY 1924C05089	66 P BHARANI 1924S01109	67 K SATHVIKA 1921A01096	68 K SREEMAN 1923S05138	70 B GOWTHAM 1925C10166	71 G YASWANTH 1925S02099	74 A MAHIDHAR 1922D03822	75 ABHINAV O 1923D10110	77 CHANDRAHAAS 1925S02385
79 S BHAGAVAN 1923N02037	80 N KARTHEEK 1924S02160	84 R AMITH 1922C08130	85 ALLADI AJAY 1924S03140	86 A MANOJ 1924C01411	88 S PARTHIV 1922C10164	89 P NIHANTH 1924S05176	92 A KRANTHI 1922C10054	93 M RAKESH 1921S02059	95 RAGHUNANDAN 1921S02419	96 I KESAV 1923T01606	97 P HARI TEJA 1921C04254	98 T SHASHANK 1923S02293	100 S AKHIL 1924D08079

అగ్రి / మెడికల్ లో టాప్ 100 లోపు 60 ర్యాంకులూ ఒక్క శ్రీచైతన్యవే

12 S.H. SADAF 1911B04032	14 J PADMAJA 1911S01188	17 KRUTI JAIN 1911B01271	18 V.SRINIJA 1911S01363	20 P. KAUSHIK 1912S02085	21 G. ASRITHA 1911S01113	22 D. ANNIKA 1913S02084	23 A.SHARATH 1913S01122	25 NAGASRAVYA 1913S01102	26 N.GAGAN 1913E09201	27 M.GOUTHAM 1913S02285	28 S. CHANDANA 1912S01236	31 N. VAMSHI 1913E09253	33 CHIDVILAS 1912S01309
36 GHANANATH 1913S01367	37 S.TEJASWI 1913S01173	39 M.SHIVANI 1911D01296	43 N. SANJANA 1912S01047	44 S.SRIDHAR 1912E09066	46 K.DHEERAJ 1911S03871	48 G.HEMNATH 1913E09062	49 M. ADEEB 1912S01165	51 M PRATEEK 1911S01325	52 G. RANI 1913S01479	55 AISHWARYA 1913E09170	56 A.SRIHITHA 1913E08068	57 G. ADITYA 1911C06088	58 I. NAVEEN 1911S02183
59 V. PRANAY 1912R01747	61 P.KRUSHITHA 1911E07065	62 Y.SRIRAJ 1913D12109	63 D.KARTHIK 1911D07388	65 G.SAI ANEELA 1912S03239	66 Y.PRAHARIKA 1912S01405	67 G. SUSMITHA 1913S03374	68 SUBRAMANYAM 1913T02099	69 T.SAMHITHA 1913S03249	70 K. LASYA 1913S03114	73 P. KABEER 1912E09099	77 T.AVINASH 1912E09198	79 A.TULASI 1911D03007	80 VINUTHNA 1913S01334
82 MD HAMED 1912E01057	84 B. SREEVIDYA 1912S01086	85 Y.ANIRUDH 1913E09063	87 B.PRATHISTA 1913S03691	88 JAYALAKSHMI 1913E09346	90 UDAYA SREE 1911S03172	91 M.PUJITHA 1912S02308	93 M.NANDANA 1911S03198	96 FATIMA 1913A02354	97 A.SWETHA 1912E05223	98 SARVAGNYA 1911E03149	99 B.AVYAKTH 1911E09239		

తల్లిదండ్రులకు గమనిక: ఫలితాలు లేనివారు ఎంసెట్‌లో లేని కేటగిరీ ర్యాంకులను ప్రకటించి ప్రలోభపెడతారు! గమనించగలరు. శ్రీచైతన్య నిజాయితీ ఫలితాలను విద్యార్థుల హాల్‌టికెట్ నెంబర్లను వెబ్‌సైట్ ద్వారా చెక్‌చేసుకుని గుర్తించగలరు.

500 లోపు ఇంజినీరింగ్ ర్యాంకులు **282**

1000 లోపు ఇంజినీరింగ్ ర్యాంకులు **478**

అర్హత సాధించిన విద్యార్థులు **21,980**

500 లోపు MEDICAL ర్యాంకులు **249**

1000 లోపు MEDICAL ర్యాంకులు **436**

Sri Chaitanya School Students

ఇంజినీరింగ్‌లో 100 లోపు **30** ర్యాంకులు

మెడికల్‌లో 100 లోపు **23** ర్యాంకులు

శ్రీచైతన్య విద్యాసంస్థలు

www.srichaitanya.net

ఈ ప్రకటనలో ఏవైనా ముద్రణాదోషాలుంటే సవ్యాదయంతో మార్చుకోగలరు. శ్రీశారదాణి ఎడ్యుకేషనల్ సొసైటీ వారి సౌజన్యంతో

నమస్తే తెలంగాణ
ధర్మగంట
మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు
ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.
Whatsapp No.
9346979997
dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.
స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.
/NTDAILYONLINE

వేధించుకు తింటున్నారు!

ఇష్టానుసారం రికార్డుల్లో మార్పులు.. కాళ్లరిగేలా తిరిగినా కనికరించరు

ఒకరి భూమి.. మరొకరి పేరిట నమోదు.. బాధితులపై కామారెడ్డి అధికారుల నిర్లక్ష్యం

కామారెడ్డి రూరల్: భూమినే నమ్ముకుని బతుకుతున్న రైతులకు రెవెన్యూ అధికారులు నరకం చూపిస్తున్నారు. తమ వక్రబుద్ధితో, నిర్లక్ష్యంతో రికార్డుల్లో ఇష్టానుసారం మార్పులుచేసి భూముల యజమానులను మానసిక వేధింపులకు గురిచేస్తున్నారు. తప్పుచేయడమే తమ విధి.. సరిచేసే బాధ్యత మాది కాదన్నట్టు వ్యవహరిస్తున్నారు. రోజులు, నెలలు కాదు ఏండ్లుగా కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారు. విదేశాల్లో ఉన్నవారు కూడా భూమి మీద ఉన్న ప్రేమతో వచ్చి అధికారుల చుట్టూ తిరుగుతున్నా వారి చివికెక్కడం లేదు. చిన్నచిన్న పొరపాట్లు గ్రహపాట్లుగా మారాయి. భూమి పత్రాలు సరిచేయాలని వేడుకుంటున్నా పెడచెవిన పెడుతున్నారు. సాగును సైతం వదిలి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగాల్సి వస్తున్నది. తాతల ఆస్తి వారసత్వంగా వస్తున్న భూమికి యజమానులైనా రికార్డుల్లో మరొకరి పేరున ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. నిత్యం పొలాల్లో ఉండాల్సిన రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తున్నది. కామారెడ్డి మండలంలోని లింగాపూర్‌లో పలువురు రైతులను స్థానిక వీఆర్వోలు నరకయాతనకు గురిచేస్తున్నారు. వారి తప్పిదంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు.

భూమి తగ్గించారు

లింగాపూర్‌లోని అవుసుల బ్రహ్మంకు సర్వేనంబర్ 57/5లో 3 గుంటలు, 59/5లో ఒక గుంట మొత్తం 4 గుంటల భూమి ఉన్నా, పాత పాస్‌పుస్తకంలో నమోదుచేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సర్వే నంబర్ 57/3తో కొత్త పాస్‌పుస్తకం ఇచ్చినా కేవలం ఒక గుంట మాత్రమే నమోదు చేశారు. తన భూమిని రికార్డుల్లో సరిగా నమోదు చేసి, కొత్త పాస్‌పుస్తకం సరిచేసి ఇవ్వాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బాధిత రైతు బ్రహ్మం తెలిపారు.

ఎన్నిసార్లు వెళ్లినా రేపుమాపంటారు

లింగాపూర్‌లో నా పేరు మీద నాలుగు గుంటల భూమి ఉంది. కొత్త పాస్‌పుస్తకంలో నా భూమి సర్వే నంబర్‌కు బదులు వేరే వారి సర్వే నంబర్ వేశారు. నాలుగు గుంటల భూమికి కేవలం ఒక గుంట భూమి మాత్రమే నా పేరు మీద నమోదు చేశారు. ఎన్నిసార్లు వెళ్లినా రేపుమాపని పట్టించుకోవడం లేదు.

- అవుసుల బ్రహ్మం, లింగాపూర్

ఏడాదిగా తిరుగుతూనే ఉన్న!

లింగాపూర్ గ్రామంలోని రెడ్డిపేట్ భూమయ్య బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం వెళ్లారు. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం అనంతరం రైతులందరికీ కొత్త పాస్‌పుస్తకాలు అందజేసినా, భూమయ్యకు పాస్‌పుస్తకం రాకపోవడంతో గల్ఫ్ నుంచి వచ్చి ఏడాదిగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ, వీఆర్వో చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. లింగాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 307లో తనకున్న 36 గుంటల భూమి ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని, తన తండ్రి పేరుమీది నుంచి వచ్చిన సర్వే నంబర్ 306లోని 33 గుంటల భూమి ఆన్‌లైన్‌లో చూపుతున్నా, కొత్త పాస్‌పుస్తకం ఇప్పటికీ మంజూరు చేయలేదని, ఎన్నిసార్లు రెవెన్యూ కార్యాలయం చుట్టూ, వీఆర్వోల చుట్టూ తిరిగినా కనీసం ఎప్పుడు చేస్తారో కూడా చెప్పకుండా తిప్పుకొంటున్నారని వాపోయారు. చూస్తాం చేస్తాం అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పనికాలేదని బాధితుడు భూమయ్య వాపోయారు.

దుబాయ్ నుంచి వచ్చిన

బతుకుదెరువు కోసం దుబాయ్ పోయిన. కొత్త పాస్‌పుస్తకాలు అందరికీ వచ్చాయి, మనకు మాత్రమే రాలేదని ఇంట్లోవారు చెప్పడంతో తిరిగి వచ్చి ఏడాదికాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్న. నా సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు. కొత్త పాస్‌పుస్తకాలు రాకపోవడంతో రైతుబంధు, రైతుబీమా పథకాలు అందకుండాపోయాయి.

- రెడ్డిపేట్ భూమయ్య, లింగాపూర్

స్వాతంత్ర్య సమరయోధుడి భూమి కబ్జాకు యత్నం

- రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం పల్గుట్టవాసి మణెమ్మ వాదన తప్పు
- సమరయోధుడు పీవీ నరసింహరెడ్డి కుమారుడు వివేకానందరెడ్డి
- మణెమ్మ పేరిట ఉన్న నకిలీ పట్టాను రద్దుచేయాలని డిమాండ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 8న 'నమస్తే తెలంగాణ'లో 'పట్టాలున్నా కబ్జా చేస్తున్నారు' శీర్షికన ప్రచురితమైన కథనంపై స్వాతంత్ర్య సమరయోధుడు పీవీ నరసింహరెడ్డి కుమారుడు వివేకానందరెడ్డి స్పందించారు. స్వాతంత్ర్య సమరయోధుడైన తన తండ్రి పీవీ నరసింహరెడ్డికి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం పల్గుట్ట పరిధిలోని కందవాడలో కేటాయించిన పదెకరాల భూమిలో మూడెకరాలు కబ్జాచేసేందుకు మణెమ్మ, ఆమె కుమారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వివేకానందరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలం కందవాడలో స్వాతంత్ర్య సమరయోధుడైన పీవీ నరసింహరెడ్డికి 1995లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివిజన్ బెంచ్ ఆదేశాల ప్రకారం సర్వే నంబర్ 212/ఆ/5లో, 212/ఆ/6లో పదెకరాల భూమి కేటాయించారు. అయితే 67 ఎకరాల విస్తీర్ణం గల 212 సర్వే నంబర్‌లో మూడెకరాలు తమకు ఉన్నదంటూ పల్గుట్టకు చెందిన రైతు మణెమ్మతోపాటు ఆమె కుమారులు జంగయ్య, శ్రీనివాస్ నంబర్ లేని నకిలీ పట్టా సృష్టించారని చెప్పారు. ఆ భూమికి ఎలాంటి పంచనామా, డిమార్కేషన్ లేకున్నా అక్రమంగా చొరబడి కడీలు విరగొట్టి నానా బీభత్సం సృష్టించి.. హద్దు రాళ్లు, ఫెన్సింగ్ కూల్చివేశారని పేర్కొన్నారు. తనపై దాడికి ప్రయత్నించారని, అక్కడ నిర్మించిన ఇల్లును నేలమట్టం చేశారని వివేకానందరెడ్డి తెలిపారు. తన ఫిర్యాదుతో వారిపై చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైందని వివరించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల అండతో ఆర్డీవో, ఏసీపీకి తప్పుడు ఫిర్యాదుచేస్తూ తనను రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్‌చేశారని చెప్పారు. డబ్బులు ఇవ్వకుంటే అంతు చూస్తామని బెదిరిస్తున్నారని, తన ప్రాణాలకు, ఆస్తికి రక్షణ కల్పించాలని కోరడంతో పోలీసులు రక్షణ కల్పించారన్నారు. అయితే, వారు రెవెన్యూ, పోలీస్ అధికారులపై కూడా తప్పుడు ఫిర్యాదులుచేయడం మొదలుపెట్టారని తెలిపారు. వీరి అక్రమాలను, తప్పుడు ఫిర్యాదులను తక్షణమే కట్టడిచేస్తూ నకిలీ పట్టాను రద్దుచేయాలని కోరారు.

మా భూమిని మాకు ఇప్పించాలి

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం పెద్దపులి నాగారం గ్రామ శివారు సర్వే నంబర్ 195 పరిధిలోని మూడెకరాల భూమిని ఇతరులు ఆక్రమించుకొని వ్యవసాయం చేస్తున్నారు. ఆ భూమిని మాకు ఇప్పించి రెవెన్యూ అధికారులు న్యాయం చేయాలి. 1990లో మేం బతకడానికి హైదరాబాద్ వెళ్లాం. మా తండ్రి సయ్యద్ యూసుఫ్ పేరుమీద ఉన్న భూమిని ఆయన చనిపోయిన తర్వాత మా అమ్మ లాల్‌బీ పేరుమీదికి మార్చినం. భూమిని వేరే వ్యక్తి ఆక్రమించుకున్నారు. రెవెన్యూశాఖ అధికారులు న్యాయబద్ధంగా మా భూమిని మాకు ఇప్పించాలి.

- సయ్యద్ అక్బర్, మహేశ్వరం మండలం

మా మాట!

సీఎం కేసీఆర్ నిర్ణయం అభినందనీయం

రెవెన్యూశాఖను ప్రక్షాళనచేస్తేనే త్వరితగతిన రైతుల సమస్యలు పరిష్కారమవుతాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ రెవెన్యూశాఖను ప్రక్షాళన చేస్తామనడం అభినందనీయం. 'నమస్తే తెలంగాణ' చేపట్టిన ధర్మగంట ద్వారా రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుండటం హర్షణీయం. ఇన్నాళ్లు తమ భూసమస్యలు పరిష్కారంకాక ఎన్నో ఇబ్బందులు పడిన రైతులు ఇప్పుడు ఎంతో ఆనందంగా ఉన్నారు. రైతుల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న 'నమస్తే తెలంగాణ'కు రుణపడి ఉంటారు.

- తెడ్డు కృష్ణారావు, గొట్టిపర్తి ఎంపీటీసీ, తుంగతుర్తి మండలం, సూర్యాపేట జిల్లా

ప్రక్షాళన అవసరం

రెవెన్యూశాఖ ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రెవెన్యూశాఖలో సమస్యలపై 'నమస్తే తెలంగాణ' చేపట్టిన 'ధర్మగంట' ఎంతో బాగున్నది. భూరికార్డుల ప్రక్షాళన ద్వారా కొన్ని సమస్యలు పరిష్కరించే వీలున్నప్పటికీ, ఉద్యోగులు పూర్తిస్థాయిలో పరిష్కరించలేదు. దీంతో సామాన్యులు ఇబ్బందులెదుర్కొంటున్నారు. కొత్త సమస్యలు కూడా ఉత్పన్నమయ్యాయి.

- వైకుంఠాచారి, మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా

తాత భూమిని తన్నుకుపోయారు

- సిద్దిపేట జిల్లా వెంకట్రావుపేట రైతు ఆంజనేయులు ఆవేదన
- వారసత్వ భూమిని ఇప్పించాలని వేడుకోలు

బధితుడు ఆంజనేయులు

రాయపోలు: వారసత్వంగా వచ్చిన భూమి.. రెవెన్యూ అధికారుల కక్కుర్తి వల్ల దక్కకుండాపోయిందని సిద్దిపేట జిల్లా వెంకట్రావుపేట గ్రామానికి చెందిన సిరిసిల్ల ఆంజనేయులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నాటి తాసిల్దార్, వీఆర్వో దొంగ సాదాబైనామాలు తయారుచేసి తమ తాత పేరున ఉన్న భూమిని వేరొకరి పేరుపైకి ఎక్కించారని ఆరోపించారు. ఏండ్లుగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని తమ భూమి తమకు ఇప్పించాలని ధర్మగంటకు విన్నవించారు. 'మాది సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామం. రాయపోల్ మండల పరిధిలోని మంతూర్ గ్రామంలో మా తాతల పేరుపై భూమి ఉన్నది. 33/ఆ సర్వేనంబర్‌లో ఎకరం 15 గుంటల వ్యవసాయ భూమి నాకు వారసత్వంగా రావాలి. నేను కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌లో కూలీ పనిచేస్తూ బతుకుతున్నా. 27-1-2016వ తేదీ వరకు ఎకరం 15 గుంటల భూమి మా తాత సిరిసిల్ల నర్సయ్య పేరున పట్టా ఉన్నది. 33/ఆ సర్వే నంబరులోని ఎకరం 15 గుంటల భూమి 13-6-2016వ తేదీన మంతూర్ గ్రామానికి చెందిన చాకలి పెద్ద నర్సయ్య పేరుపై పట్టా వచ్చింది. మా తాత సిరిసిల్ల నర్సయ్య పేరుపై ఉన్న భూమి మా అనుమతి లేకుండా చాకలి పెద్ద నర్సయ్య పేరుపైకి ఎక్కిందని అదే ఏడాది జూలై 22న ఉమ్మడి దౌల్తాబాద్ తాసిల్దార్‌కు ఫిర్యాదు చేశా. సరిచేసి తాత పేరున ఉన్న భూమిని మా పేర పట్టా పాస్‌బుక్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరా. రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదు. దౌల్తాబాద్ మండలంలో మా భూమి చాకలి నర్సయ్య పేరుపైకి ఎలా పట్టా వచ్చిందని సమాచారం హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేయగా, 33/ఆ సర్వేనంబర్‌లో గల భూమికి సంబంధించిన రికార్డులు తాసిల్దార్ కార్యాలయంలో లేవని రెవెన్యూ అధికారులు సమాధానం ఇచ్చారు. ఉమ్మడి దౌల్తాబాద్ మండలం విభజన కావడంతో మంతూర్ గ్రామం రాయపోల్ మండలం కిందికి వచ్చింది. దీంతో 26-5-2018న మరోసారి రాయపోల్ తాసిల్దార్‌కు ఫిర్యాదుచేశా. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికై బాధ్యులపై చర్యలు తీసుకొని, నా భూమి నాకు ఇప్పించండి' అని సిరిసిల్ల ఆంజనేయులు కోరుతున్నారు.

విచారణ జరిపిస్తాం

మంతూర్‌లోని సర్వేనంబర్ 33/ఆలో ఎకరం 15 గుంటల భూమి సిరిసిల్ల నర్సయ్య నుంచి అదే గ్రామానికి చెందిన నర్సయ్యకు ఉమ్మడి దౌల్తాబాద్ మండలంలోనే మార్పు జరిగింది. ప్రస్తుతం అతని వద్ద ప్రొసీడింగ్ ఉన్నది. దానికి సంబంధించిన కార్యాలయ రికార్డులు లేవు. భూమి యజమానులు ఆర్డీవోకు అప్పీలు చేసుకోవాలని సూచించా. దీనిపై పూర్తి విచారణ జరిపిస్తాం.

- వాణిరెడ్డి, రాయపోలు తాసిల్దార్

మా భూమి పట్టాలో తగ్గింది

- ఇతరులకు కాస్తులో భూమి తక్కువ.. పట్టాలో మాత్రం ఎక్కువ
- సర్వేచేసి నోటీసు ఇవ్వడంపై బాధిత రైతు ఆందోళన
- భూమి పరిశీలించి పట్టాలో నమోదుచేయాలి
- యాదాద్రి భువనగిరి జిల్లా ఎదుల్లగూడెం రైతు నర్సిరెడ్డి విన్నపం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎనిమిది ఎకరాల భూమి ఉండగా పట్టాదారు పాస్‌పుస్తకంలో మాత్రం మూడు ఎకరాలనే ఉన్నది. మిగతా ఐదు ఎకరాలకు పట్టాలేదు. ఎనిమిది ఎకరాలని నమోదుచేసి రైతుబంధు అమలుచేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలం ఎదుల్లగూడెం (ప్రొద్దుటూరు) గ్రామానికి చెందిన మల్లారెడ్డి కుమారుడు గుమ్మడి నర్సిరెడ్డి 'ధర్మగంట'ను ఆశ్రయించారు. తాసిల్దార్ సర్వేచేసి నోటీసు ఇవ్వడంతో ఆందోళన చెందుతున్న రైతు తన గోడు వెళ్లబోసుకున్నారు.

నా పేరు గుమ్మడి నర్సిరెడ్డి. వలిగొండ మండలం ఎదుల్లగూడెం గ్రామంలోని 994, 995, 996, 998, 999, 1000, 1001 **సర్వే నంబర్ల**లో మాకు ఎనిమిది ఎకరాల భూమి ఉన్నది. కుటుంబసభ్యుల పేరుమీద మూడు ఎకరాలకు మాత్రమే పట్టా ఉన్నది. మిగతా ఐదు ఎకరాలకు పట్టాలేదు. జాయింట్ సర్వే నంబర్లలో గుమ్మడివారు, ఏనుగువారు, కొలనువారికి భూములున్నాయి. వీరిలో కొందరి ఆధీనంలో ఉన్న భూమికన్నా పట్టాలో ఎక్కువగా నమోదుచేశారు. మా భూమిని సర్వేచేసిన తాసిల్దార్ నోటీసు ఇచ్చారు. మా ఆధీనంలోని భూమిపైన ఇతరులకు రైతుబంధు చెల్లించకుండా నిలిపివేయాలి. నోటీసులో పేర్కొన్న సర్వే నంబర్లలోని రైతులకు భూమి తక్కువగా ఉన్నా, పట్టాలో ఎక్కువ నమోదైనందున రైతుబంధు ఎక్కువ చెల్లిస్తున్నారు. ఆ మొత్తాన్ని నిలిపివేయాలి. మా భూమిని ఎవరికీ అమ్మలేదు. తాసిల్దార్ ప్రత్యక్షంగా వచ్చి మా భూములను పరిశీలించాలి. మూడు ఎకరాలని నమోదుచేసిన పట్టాలో, మిగతా ఐదు ఎకరాలు చేర్చి, ఎనిమిది ఎకరాలకు పాస్‌పుస్తకం ఇవ్వాలి. రైతుబంధు అందించి నాకు న్యాయం చేయాలి.

లేనిభూమికి సాదాబైనామా!

మొదటిపేజీ తరువాయి...

1973లో ఎలగందులకు చెందిన గాలి నారాయణకు విక్రయించారు. రికార్డుల ప్రకారం వారిలో ఒక్కొక్కరి పేరిట ఇంకా 14 గుంటల చొప్పున మొత్తం 2.32 ఎకరాల భూమి ఉన్నది. దీనిని ఈ రైతు కుటుంబాలు సాగుచేసుకుంటూ వస్తున్నాయి. రెవెన్యూ పహాణీలో, రిజిస్ట్రేషన్ ఈసీలో కూడా 2018 మార్చి వరకు సదరు రైతుల పేర్లే వచ్చాయి. గాలి నారాయణ కొనుగోలుచేసిన ఆరెకరాల భూమిని 2013లో ఇదే గ్రామానికి చెందిన దొగ్గలి స్వామికి విక్రయించగా.. ఆయన కుమారులైన దొగ్గలి అశోక్, దొగ్గలి ఆంజనేయులు, దొగ్గలి అనిల్ పేర్లమీద తలా రెండెకరాల చొప్పున మొత్తం ఆరెకరాల భూమిని గంగాధర రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పట్టాచేయించారు.

మాయచేసిన అధికారులు

ఎలగందుల శివారులోని సర్వే నంబర్ 16లో తన తండ్రి గాలి నారాయణ పేరిట 3.32 ఎకరాల భూమి ఉన్నదని.. దీనిని విరాసత్ చేయాలంటూ అతని కుమారుడు గాలి వేణుగోపాల్ 2016 జూన్ 21న దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తును పరిశీలించిన అప్పటి తాసిల్దార్ సర్వే నంబర్‌లో గాలి నారాయణకు ఉన్న ఆరెరాల భూమి ఇతరులకు విక్రయించారని.. 16 సర్వేనంబర్‌లో ఆయన పేరిట ఎలాంటి భూమిలేదని గుర్తించి.. విరాసత్ కోసం పెట్టుకున్న దరఖాస్తును తిరస్కరిస్తూ వివరణ ఇచ్చారు. ఈ తరుణంలోనే సాదాబైనామా పేరుతో దొగ్గలి స్వామి తెరపైకి వచ్చారు. 2013 అక్టోబర్ 29న గాలి నారాయణ భార్య గాలి లక్ష్మి, కుమారులు గాలి భుజంగ శయనం, గాలి వేణుగోపాల్, మనుమడు గాలి శంకర్ (గాలి రాజమౌళి కుమారుడు) దొగ్గలి స్వామికి సాదాబైనామా ద్వారా సర్వేనంబర్ 16లోని 2.32 ఎకరాల భూమిని విక్రయించారని.. దాని ఆధారంగా తనకు మ్యుటేషన్ చేయాలని కోరుతూ 2017 నవంబర్ 21న దొగ్గలి స్వామి తాసిల్దార్‌కు దరఖాస్తుచేసుకున్నారు. గాలి నారాయణ పేరిట భూమి లేదని పేర్కొంటూ ఆయన కుమారుడు చేసుకున్న విరాసత్ దరఖాస్తును గతంలో తాసిల్దార్ తిరస్కరించిన విషయాన్ని పక్కకుపెట్టి.. కనీసం రికార్డులు విచారించకుండానే తాసిల్దార్ వినోద్‌రావు 2018 మార్చిలో దొగ్గలి స్వామి పేరిట పట్టాదారు పాస్‌పుస్తకం జారీచేశారు. గాలి నారాయణకు తాము విక్రయించిన ఆరెకరాల భూమిని ఇతరులకు విక్రయించుకున్నారని, ఆ తర్వాత 16 సర్వే నంబర్‌లో ఒకగుంట భూమి కూడా లేదని, ఏ రికార్డు చూసినా అందులో వివరాలు ఉంటాయని బాధిత రైతు కుటుంబాలు పేర్కొంటున్నాయి. నిజానికి ఈ భూమి వివాదం జిల్లా సెషన్ కోర్టులో విచారణ జరుగుతున్నది. కోర్టు జారీచేసిన ఇంజక్షన్ ఆర్డర్‌ను 2017 డిసెంబర్ 18న కొత్తపల్లి తాసిల్ కార్యాలయంలో అందించారు. ఇవేవీ లెక్కచేయకుండా 2018 మార్చిలో అధికారులు దొగ్గలి స్వామికి పట్టాదారు పాస్‌పుస్తకం అందించడం వెనుక పెద్ద తతంగమే జరిగిందని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ పలుమార్లు దరఖాస్తుచేసుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వారసత్వ భూమికి దొంగ పట్టా

పత్రాలులేకున్నా రికార్డుల్లో పేరుమార్పు ■ ఆక్రమణదారుడితో అధికారుల మిలాఖత్

పదేండ్లుగా మొర ఆలకించని అధికారులు ■ కోర్టు కేసు పేరుతో బాధితులపై నిర్లక్ష్యం

వరంగల్ అర్బన్, కాజీపేట: వారసత్వంగా వచ్చిన భూమిని దళారులు ఆక్రమించారు. అధికారుల మిలాఖత్‌తో దొంగతనంగా పట్టాచేసుకున్నారు. రెవెన్యూ అధికారులు పత్రాలు పరిశీలించి భూమి ఇప్పించాలని బాధితులు ఏండ్లుగా కోరుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట మండలం సాయిపేటకు చెందిన గాదె కొమురయ్య, రాధమ్మ దంపతులు. గాదె కొమురయ్యకు తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమి గ్రామ శివారులో సర్వే నంబర్ 321/డి/1/1లో 20.10 ఎకరాలు ఉండేది. వీరికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కుమారుల్లో గాదె చక్రపాణి, గాదె మోహన్, గాదె దేవేందర్, గాదె భూపాల్‌కు 15 ఎకరాల భూమిని 20 ఏండ్ల క్రితం పంచారు. మిగిలిన 5.10 ఎకరాల్లో కుమార్తెలకు నాలుగు ఎకరాల భూమిని పంపిణీ చేయగా వారు సాగుచేసుకుంటున్నారు. మిగిలిన 1.10 ఎకరాలను కొన్నేండ్లు సాగు చేసుకున్న కొమురయ్య ఆర్థిక సమస్యలతో అమ్ముకొన్నారు. అనంతరం కొమురయ్య అనారోగ్యంతో మృతి చెందారు. మూడో కుమారుడు గాదె దేవేందర్ తనకున్న 3 ఎకరాల భూమిలో ఇదే గ్రామానికి చెందిన ఆదె కుమారస్వామి, వేల్పుల లక్ష్మీనారాయణకు ఎకరం 27 గుంటల భూమిని అమ్ముకున్నారు. మిగతా ఎకరం 13 గుంటల భూమిని 2002లో హన్మకొండ తాసిల్దార్ నుంచి పట్టాదారు పాస్‌పుస్తకం పొందారు. గాదె దేవేందర్ 2004లో ఇంటి నుంచి కనిపించకుండా పోయారు. అతని కోసం వెతికి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినా ఫలితం లేకపోయింది. దేవేందర్‌కు చెందిన భూమిని అతని సోదరులు గాదె చక్రపాణి, మోహన్ రావు సేద్యం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సాయిపేటకు చెందిన మామిండ్ల రాజు ఈ భూమిని ఆక్రమించుకుని సాదా కాగితంపై ఫోర్జరీ సంతకంతో అధికారుల అండదండలతో మామునూరు గ్రామానికి చెందిన బరిగెల పద్మ భర్త బెంజిమన్, పేరు మీదికి 2009లో మార్పిడి చేయించారు. అనంతరం భూమిని అధికారికంగా మామిండ్ల రాజు తన పేరుపైనే పట్టా చేయించుకున్నారని దేవేందర్ తల్లి రాధమ్మ తెలిపారు. తన కుమారుడు గాదె దేవేందర్ ఇంటి నుంచి కనిపించకుండా పోయినప్పటి నుంచి భూమిని తన కుమారులు చక్రపాణి, మోహన్‌రావు సేద్యం చేసుకుంటున్నప్పటికీ అధికారుల అండదండలతో మామిండ్ల రాజు ఆక్రమించుకుని, తనపేరున పట్టా చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పదేండ్లుగా తిరుగుతున్న

నా కుమారునికి చెందిన ఎకరం 13 గుంటల భూమిని ఇప్పించాలని పదేండ్లుగా తాసిల్దార్ చుట్టూ తిరుగుతన్నా అధికారులు పట్టించుకోవడంలేదు. పత్రాలు లేకున్నా మా భూమిని అక్రమంగా పట్టాచేసుకున్న మామిండ్ల రాజును ప్రశ్నిస్తే కోర్టు నోటీస్ పంపడంతో మేము కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించాం. అక్రమంగా పట్టాచేసుకున్న విషయం తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరుగలేదు. అన్ని పత్రాలు పరిశీలించి మా భూమిని మాకు ఇప్పించి న్యాయం చేయాలి.

-రాధమ్మ, బాధితుడి తల్లి

తీర్పు వచ్చాక చర్యలు

పాత పట్టాదారు పాస్‌పుస్తకం ప్రకారం మామిండ్ల రాజుకు కొత్త పాస్‌పుస్తకం ఇచ్చాం. భూమి ఆక్రమణపై రాధమ్మ ఫిర్యాదుచేశారు. ఇద్దరి ఫిర్యాదులు ప్రస్తుతం కోర్టు పరిశీలనలో ఉన్నాయి. కోర్టు తీర్పు ఎవరికి అనుకూలంగా వస్తే వారినే భూమి యజమానిగా పరిగణించి రికార్డుల్లో నమోదుచేసి కొత్త పాస్‌పుస్తకం ఇస్తాం.

-బండి నాగేశ్వర్‌రావు, కాజీపేట తాసిల్దార్

పహాణీలో ఇతరుల పేర్లు

- పాస్‌పుస్తకాల్లోకి ఎక్కని ఐదెకరాలు
- రెండు పాస్‌బుక్‌ల నుంచి ఎకరం చొప్పున తొలిగింపు
- యాదాద్రి భువనగిరి జిల్లా చాడ గ్రామ దంపతులు ధనలక్ష్మి, రాజిరెడ్డి ఆవేదన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తప్పుడు పత్రాలు సృష్టించి తమ భూమిని ఇతరుల పహాణీలో నమోదుచేశారని యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని చాడ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు అనంతుల ధనలక్ష్మి, రాజిరెడ్డి వాపోతున్నారు. తమకు చెందిన 7.16 ఎకరాల భూమిని ఇతరుల పేరు మీదకు మార్చారని.. పాస్‌పుస్తకాలు, 1-బీ పత్రాలు ఉన్నా భూమి తమకు దక్కడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చాడ గ్రామానికే చెందిన సలేంద్ర భద్రయ్య, సలేంద్ర మల్లేశం, సలేంద్ర సిద్దులు, సలేంద్ర రాములు, సలేంద్ర నాగరాజు, భూషనమైన కిష్టయ్య ఆక్రమించుకున్నారు. దీనిపై అనేకసార్లు కలెక్టర్ సహా ఆర్డీవో, తాసిల్దార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. భూ ప్రక్షాళనలో భాగంగా 2017 నవంబర్ 25న ఈ భూములు అనంతుల ధనలక్ష్మి, ఆమె కుటుంబసభ్యుల పేరు మీద ఉన్నట్టు రెవెన్యూ అధికారులు 1-బీ పత్రాలు ఇచ్చారు. 2018 ఏప్రిల్ 25న, 2018 ఆగస్టు 14న వీరిపేరుమీద కొత్త పాస్‌పుస్తకాలు కూడా జారీచేశారు. అయితే, ధనలక్ష్మి కుమారులు అనంతుల సునీల్‌రెడ్డి, వెంకటరెడ్డి పేరుమీద వచ్చిన పాస్‌పుస్తకంలో నుంచి ఎకరం చొప్పున తొలిగిస్తూ కొత్త పాస్‌పుస్తకాలు ఇచ్చారు. మరోవైపు ధనలక్ష్మి పేరుమీద ఉన్న 100 సర్వే నంబర్‌లో ఐదు ఎకరాలు, 98/3 సర్వే నంబర్‌లో 16 గుంటలకు సంబంధించి కొత్త పాస్‌పుస్తకం జారీకాలేదు. మొత్తం 7.16 ఎకరాలకు రైతుబంధు కోల్పోతున్నామని చెప్తున్నారు.

బాధితులు రాజిరెడ్డి, ధనలక్ష్మి

డబుల్ రిజిస్ట్రేషన్ జరిగింది

సర్వేనంబర్ 100లోని భూమి కబ్జాకు గురైందనే ఫిర్యాదు నేపథ్యంలో ఆ వివాదాన్ని సివిల్ కోర్టులో పరిష్కరించుకోవాల్సిందిగా కలెక్టర్ గతంలోనే ఆదేశాలు ఇచ్చారు. 111/7, 111/8 సర్వేనంబర్లలోని భూమిని ధనలక్ష్మి భర్త రాజిరెడ్డి గతంలో మరొకరికి రిజిస్ట్రేషన్ చేసి.. కొద్ది కాలానికి వారి కొడుకుల పేరుమీదచేశారు. దీంతో డబుల్ రిజిస్ట్రేషన్ జరిగింది.

- బాలకృష్ణ, వీఆర్వో, చాడ

14 నుంచి ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

17 కేంద్రాల్లో ఏర్పాట్లుచేసిన అధికారులు

తేదీలు, వేదికలను ప్రకటించిన టీఎస్ఎల్పీఆర్బీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 14 నుంచి 22 వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తున్నట్టు తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్పీఆర్బీ) చైర్మన్ వీవీ శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 17 కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులకు కేటాయించిన లాగిన్ ఐడీల్లో ఇంటిమేషన్ లెటర్లు ఈ నెల 12న ఉదయం 8 గంటల నుంచి మరుసటిరోజు రాత్రి 8 గంటల వరకు www.tslprb.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చేటప్పుడు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు.

జిల్లాలవారీగా ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాలు

ప్రాంతం	వేదిక	అభ్యర్థుల సంఖ్య
ఆదిలాబాద్	ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ గ్రౌండ్, ఎస్పీ కార్యాలయం ఎదుట	4,962
సైబరాబాద్	సీపీ కార్యాలయం, గచ్చిబౌలి	3,664
హైదరాబాద్	మెట్రోబరాక్స్, బేగంపేట మెట్రోస్టేషన్ పక్కన	5,685
కరీంనగర్	సీపీ కార్యాలయం, కరీంనగర్	5,726
ఖమ్మం	సీపీ కార్యాలయం, ఖమ్మం	8,274
కొత్తగూడెం	సీఈఆర్ క్లబ్, ప్రకాశం స్టేడియం ఎదురు, పోస్టాఫీస్ దగ్గర	6,360
మహబూబాబాద్	ఎస్పీ కార్యాలయం, మహబూబాబాద్	3,984
మహబూబ్‌నగర్	ఎస్పీ కార్యాలయం, మహబూబ్‌నగర్	6,257
నాగర్‌కర్నూల్	ముస్లిం మైనార్టీ కాలేజ్, ఈద్గా దగ్గర, శ్రీపురం రోడ్	5,089
నల్లగొండ	ఎస్పీ కార్యాలయం, నల్లగొండ	8,333
నిజామాబాద్	సీపీ కార్యాలయం, నిజామాబాద్	5,460
రాచకొండ	సీపీ క్యాంప్ కార్యాలయం, ఎల్బీనగర్ ట్రాఫిక్ పీఎస్	5,264
రామగుండం	సీసీ కార్యాలయం, రామగుండం	5,520
సంగారెడ్డి	ఎస్పీ కార్యాలయం, సంగారెడ్డి	5,407
సిద్దిపేట	టీటీసీ బిల్డింగ్, ట్రాఫిక్ పీఎస్ ఎదురుగా, బైపాస్ రోడ్డు	6,449
సూర్యాపేట	ఎస్పీ కార్యాలయం, సూర్యాపేట	6,619
వరంగల్	సీపీ కార్యాలయం, వరంగల్	8,123

లక్షమంది నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

- స్వర్ణ తెలంగాణ స్వయం ఉపాధి పథకం కింద ఫీజులో 80 శాతం రాయితీ
- టీ-సేవ కంప్యూటర్ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: లక్ష మంది నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించేందుకు టీ-సేవ కంప్యూటర్ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు టీ-సేవ సంస్థ డైరెక్టర్ అడప వెంకట్‌రెడ్డి ఆదివారం మీడియాకు తెలిపారు. స్వర్ణ తెలంగాణ స్వయం ఉపాధి పథకం కింద పెస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సహకారంతో నిరుద్యోగుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 180 కేంద్రాలు ఏర్పాటుచేసి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించనున్నట్టు పేర్కొన్నారు. ఈ రంగంలో 25 ఏండ్ల అనుభవం గల పెస్ కంప్యూటర్ సహకారంతో ఏటా లక్ష మందికిపైగా నిరుద్యోగులకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 80 శాతం ఫీజులో రాయితీ ఇస్తూ, జిల్లా, మండల, గ్రామీణ ప్రాంతాల్లో కంప్యూటర్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తిగల యువతీ, యువకులు జూలై 15లోపు సంప్రదించాలని కోరారు. వివరాలకు ఫోన్ నంబర్ 9505800042 లేదా ఆన్‌లైన్‌లో WWW.Pacecomputers.orgలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ఆదివారం హైదరాబాద్‌లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావును కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నారాయణపేట జెడ్పీ చైర్‌పర్సన్ వనజ. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తదితరులు

కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంచిర్యాల జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి. చిత్రంలో మంత్రి మల్లారెడ్డి, ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, బాల్క సుమన్, జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు తదితరులు

కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మేడ్చల్ జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి. చిత్రంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి తదితరులు

కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజన్న సిరిసిల్ల జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ. చిత్రంలో ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు

కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునితా మహేందర్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, కొప్పుల మహేశ్‌రెడ్డి తదితరులు

కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ శివకుమార్

ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న గవర్నర్ నరసింహన్, ఏపీ సీఎం జగన్

రేణిగుంట సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఏపీ, తెలంగాణ బీజేపీ అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ, లక్ష్మణ్ తదితరులు

రేణిగుంటలో బీజేపీ ప్రజా ధన్యవాద సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు

ఏపీ అభివృద్ధికి సంపూర్ణ మద్దతు

ఆంధ్రరాష్ట్ర ప్రజలకు కేంద్రం ఎప్పుడూ తోడుంటుంది ■ ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందితేనే నవభారత నిర్మాణం సాధ్యం జగన్‌కు అభినందనలు ■ సుపరిపాలన అందించాలని కోరుతున్నా ■ తిరుపతి సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ

విమానాశ్రయంలో స్వాగతం పలికిన గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, ఏపీ సీఎం జగన్, ఇతర నేతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. ఆంధ్రరాష్ట్ర ప్రజలకు కేంద్రప్రభుత్వం ఎప్పుడూ తోడు ఉంటుందని అన్నారు. ఏపీలో ఘన విజయం సాధించిన జగన్‌కు అభినందనలు తెలిపిన మోదీ.. ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలకు ఆయన సుపరిపాలన అందించాల్సిందిగా కోరుతున్నానని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలన్నారు. ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందితేనే నవభారత నిర్మాణం సాధ్యమవుతుందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో అఖండ విజయం సాధించి రెండోసారి ప్రధానిగా పగ్గాలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆదివారం ఏపీకి వచ్చిన ఆయనకు తిరుపతిలోని రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. గవర్నర్ నరసింహన్, ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఏపీ మంత్రులు, బీజేపీ, వైఎస్సార్సీపీ నేతలు స్వాగతం పలికారు. అనంతరం రేణిగుంటలోని ఎలక్ట్రానిక్స్ పార్క్‌లో ఏర్పాటుచేసిన 'బీజేపీ ప్రజా ధన్యవాద సభ'లో మోదీ మాట్లాడారు. 'నమో వేంకటేశ..' అంటూ స్తోత్రంతో తెలుగులో మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. 'బాలాజీ పాదపద్మాల సాక్షిగా నాకు మళ్లీ అధికారం అప్పగించిన దేశ ప్రజలందరికీ కృతజ్ఞతలు, స్వామికి నా ప్రణామాలు' అంటూ తెలుగులో ప్రసంగించారు. 'తిరుమల వేంకటేశ్వరుడి సన్నిధిలో తలవంచి ఆశీస్సులు తీసుకుందామని వచ్చా. దేవదేవుడి దర్శనానికివెళ్తూ ప్రజా దేవుళ్లను సందర్శించే భాగ్యం లభించింది. శ్రీవారిని 130 కోట్ల భారతీయుల ఆశయాలను నెరవేర్చాలని కోరుతున్నా' అని తెలిపారు. 'మా వరకు ఎన్నికల అధ్యాయం ముగిసిపోయింది. సేవచేసే అధ్యాయం ప్రారంభమైంది. ప్రజల భాగస్వామ్యం, వారి మద్దతుతో నవభారత నిర్మాణానికి కొత్త మార్గాలు వేస్తామనే నమ్మకం నాకున్నది' అని మోదీ అన్నారు.

ఆదివారం రాత్రి తిరుమల శ్రీవారి ఆలయ ప్రాంగణంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, ఏపీ సీఎం జగన్, టీటీడీ ఈవో ఏకే సింఘాల్ తదితరులు

వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అభినందనలు

'ఏపీలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన జగన్మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు. జగన్మోహన్‌రెడ్డి కూడా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తారని భావిస్తున్నాం. ఏపీ అభివృద్ధికి, ప్రజలకు పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇస్తున్నా' అని ప్రధాని ప్రకటించారు. 'ఆంధ్రప్రదేశ్ అనేక అంశాల్లో ముందంజలో ఉన్నది. ఏపీ ప్రజల్లో ప్రతిభాపాటవాలకు కొదువలేదు. వ్యవసాయం నుంచి విజ్ఞానం వరకు, ఇన్నోవేషన్ నుంచి స్టార్టప్స్ వరకు ఏపీ కొత్తమార్గంలో పయనిస్తున్నది. ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందితేనే బీజేపీ ఆశయమైన నవభారత నిర్మాణం సాధ్యమవుతుంది. ఏపీ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏవిధంగానూ వెనుకడుగు వేయబోదు' అని పేర్కొన్నారు.

ప్రజాసేవకు అంకితమవ్వాలి

'బీజేపీ కార్యకర్తలు కర్మ సిద్ధాంతాన్ని విశ్వసిస్తారు. మున్సిపల్ వార్డు గెలువలేని రోజుల్లోనూ భారత్‌మాతాకీ జై అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఎన్నికలప్పుడే ప్రజలకు కనిపించే వాళ్లు కాదు. ఎల్లప్పుడూ ప్రజలతో మమేకమై పనిచేస్తారు. అధికారంలోకి రావడమే కాదు.. ప్రజాసేవకు అంకితమవ్వాలి. జనంలో.. జనంతో ఉంటేనే ప్రజాహృదయాలు గెలుస్తాం. అధికారంలో లేని రాష్ట్రాల్లోనూ కార్యకర్తలు దేశసేవలో తరిస్తున్నారు. ఏపీ, తమిళనాడు రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టి అభివృద్ధికి కృషిచేస్తాం. దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తానని హామీ ఇస్తున్నా' అని చెప్పారు.

తిరుమలేశుని సేవలో మోదీ

తిరుమల, నమస్తే తెలంగాణ: తిరుపతిలో బహిరంగసభలో పాల్గొన్న అనంతరం మోదీ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రోడ్డు మార్గంద్వారా రాత్రి ఏడు గంటలకు తిరుమల పద్మావతి అతిథి గృహం చేరుకున్నారు. అక్కడినుంచి 7.15 నిమిషాలకు శ్రీవారి ఆలయ మహాద్వారం వద్దకు చేరుకున్న ప్రధానికి టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో కేఎస్ శ్రీనివాసరాజు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. ప్రధాని వెంట గవర్నర్ నరసింహన్, ఏపీ సీఎం జగన్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఏపీ మంత్రులు ఉన్నారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో ప్రధానికి వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం టీటీడీ ఈవో, జేఈవో కలిసి శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం తిరిగి పద్మావతి అతిథిగృహం చేరుకున్నారు. అక్కడి నుంచి రాత్రి 8.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకొన్న మోదీ.. భారతవాయుసేన విమానంలో ఢిల్లీకి తిరిగి వెళ్లారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి

మొదటిపేజీ తరువాయి...

ప్రజాప్రతినిధులను కేటీఆర్ అభినందించారు. ప్రజలు టీఆర్ఎస్ వైపు ఉన్నారని, రాష్ట్రవ్యాప్తంగా బ్రహ్మాండమైన విజయాన్ని టీఆర్ఎస్‌కు అందించారన్నారు. ఎదిగిన కొద్దీ ఒదిగి ఉంటూ ప్రజాసేవ చేయాలని సూచించారు. సీఎం కేసీఆర్ కొత్తగా తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టాన్ని సమర్థంగా అమలు చేసేలా పనిచేయాలని తెలిపారు. కొత్త పంచాయతీరాజ్ చట్ట స్ఫూర్తిని అర్థంచేసుకోవాలని తెలిపారు. స్థానిక సంస్థల నేతలకు ప్రజలతో నిత్యం నేరుగా సంబంధాలు ఉంటాయని, వారి సమస్యలను సావధానంగా వింటూ పరిష్కరించడానికి ప్రయత్నించాలని హితవుచెప్పారు. రాష్ట్ర స్థాయిలో పరిష్కారం కావాల్సినవాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకొని రావాలన్నారు. కేటీఆర్‌కు రాష్ట్ర మంత్రులు వీ శ్రీనివాస్‌గౌడ్, సీహెచ్ మల్లారెడ్డి , ఎంపీ డాక్టర్ జీ రంజిత్‌రెడ్డి, మాజీ మంత్రులు సీ లక్ష్మారెడ్డి, పీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చెన్నమనేని రమేశ్‌బాబు, బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, మహేశ్‌రెడ్డి, పీ నరేందర్‌రెడ్డి, ఆనంద్‌బాబు, రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్‌రాజు, పురాణం సతీశ్ అభినందనలు తెలిపారు. కేటీఆర్‌ను కలిసినవారిలో రంగారెడ్డి, వికారాబాద్, మంచిర్యాల, మహబూబ్‌నగర్, సిరిసిల్ల, నారాయణపేట జెడ్పీ చైర్‌పర్సన్లు తీగల అనితారెడ్డి, సునితా మహేందర్‌రెడ్డి, నల్లాల భాగ్యలక్ష్మి, స్వర్ణా సుధాకర్‌రెడ్డి, న్యాలకొండ అరుణ, వనజ, మేడ్చల్ జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మహబూబ్‌నగర్ వైస్‌చైర్మన్ యాదయ్య, నారాయణపేట వైస్‌చైర్‌పర్సన్ సురేఖ పలువురు జెడ్పీటీసీ సభ్యులు ఉన్నారు.

భవిష్యత్ దిక్సూచి ఈ ఫెయిర్

- టీ న్యూస్, అపెక్స్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఫెయిర్‌కు విశేష స్పందన ■ తరలివచ్చిన తల్లిదండ్రులు, విద్యార్థులు
- మూడోరోజు పెరిగిన సందర్శకుల తాకిడి
- నేటితో ముగియనున్న ఎడ్యుకేషన్ ఫెయిర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇంటర్ తర్వాత ఎంపిక చేసుకునే కోర్సు విద్యార్థి జీవితంలో చాలా ముఖ్యమైంది. ఇందుకోసం విద్యార్థులతోపాటు, తల్లిదండ్రులు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. విద్యార్థి అభిరుచికి అనుగుణంగా పదిమందిని పది కోర్సుల గురించి అడిగి ఏది బెస్ట్ అవుతుందో నిర్ణయించుకుంటారు. అయితే పదుల సంఖ్యలో కోర్సులు, వందల సంఖ్యలో కళాశాలలు, వేల సంఖ్యలో ఇతర ప్రత్యామ్నాయాలు.. వీటన్నింటినీ తెలుసుకోవటం విద్యార్థులు, తల్లిదండ్రులకు కత్తిమీద సామే. ఈ నేపథ్యంలో టీ న్యూస్, అపెక్స్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ వీటన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చి వారికి బాసటగా నిలిచాయి. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి, భవిష్యత్ మార్గాన్ని సులువుగా ఎంపిక చేసుకునేందుకు నిజాంకళాశాల మైదానంలో 'తెలంగాణ గోల్డెన్ ఎడ్యుకేషన్ ఫెయిర్' నిర్వహిస్తున్నాయి. ఆదివారం మూడోరోజు విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో తరలివచ్చి సద్వినియోగం చేసుకున్నారు. సోమవారం చివరిరోజు కావటం.. రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో నిర్వాహకులు అందుకనుగుణంగా ఏర్పాట్లుచేశారు. ఫెయిర్‌లో 70కిపైగా స్టాళ్లు ఏర్పాటుచేశారు. వందకుపైగా విద్యాసంస్థలు ఇందులో పాల్గొన్నాయి. ఇతర దేశాల్లో విద్యనందించే పలు అంతర్జాతీయ విద్యాసంస్థలు కూడా స్టాళ్లు ఏర్పాటు చేశాయి. ఆదివారంతో ఫెయిర్ ముగియాల్సినప్పటికీ, ఎంసెట్ ఫలితాలు విడుదలవటం, తల్లిదండ్రులు కోరటంతో సోమవారం వరకు పొడిగించిన విషయం తెలిసిందే.

ఆదివారం నిజాం కళాశాల మైదానంలో టీ న్యూస్, అపెక్స్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ గోల్డెన్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో పెద్దఎత్తున పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న నిపుణులు

ఆకట్టుకునేలా సెమినార్లు

ఇంజినీరింగ్, ఫార్మసీ, మెడిసిన్, మేనేజ్‌మెంట్ కోర్సులకు సంబంధించి అనుమానాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేకంగా సెమినార్లు ఏర్పాటుచేశారు. ఎంసెట్ ర్యాంకు ద్వారా మంచి కళాశాలలో సీటురాని పరిస్థితిలో ఎలాంటి కోర్సులను ఎంపిక చేసుకోవాలో నిపుణులు వివరించారు. ఆయా కోర్సులకు ఎలాంటి అవకావాశాలున్నాయో చెపుతున్నారు. ప్రత్యేకంగా ఇంజినీరింగ్, మెడిసిన్‌పై ప్రముఖ యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు ప్రసంగించారు. ప్రస్తుతం తీసుకునే కోర్సులు ఎలా ఉన్నాయి.. మరో 5 ఏండ్ల తర్వాత ఎలా ఉంటాయో అనేవిషయాన్ని విద్యార్థులకు వివరిస్తున్నారు.

వెబ్ కౌన్సెలింగ్ ఎలా?

వెబ్ కౌన్సెలింగ్‌పై ఉన్న అపోహలను తొలిగించేందుకు ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అసలు వెబ్ కౌన్సెలింగ్ అంటే ఏమిటి, ఎలా ఉంటుంది, కావాల్సిన డాక్యుమెంట్స్ ఏమిటి, ఎన్ని దశల్లో ఉంటుంది.. అనేదానిపై తల్లిదండ్రులు, విద్యార్థులకు నిపుణులు వివరిస్తున్నారు. ఎంసెట్ ర్యాంకు, చేరబోయే కోర్సు చెప్తే ఏయే కళాశాలల్లో సీటు లభించే అవకాశం ఉన్నదో.. పూర్తి డాటాను అందజేస్తున్నారు. ఆదివారం ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ విశ్వనాథం వంగపల్లి.. ఇంజినీరింగ్ విద్యలో విజేతగా మారాలంటే ఎలా? అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం టీ న్యూస్ సీజీఎం ఉపేందర్, ఎపెక్స్ ప్రతినిధి దినేష్.. ప్రొఫెసర్ విశ్వనాథ్‌కు జ్ఞాపిక అందజేశారు. ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో భాగంగా లక్కీ డ్రా తీశారు. ఉచిత రిజిస్ట్రేషన్ చేసుకున్నవారి నుంచి ఇద్దరికి ల్యాప్‌టాప్ బహుమతిగా లభించింది.

ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి

ఇంటర్ తర్వాత ఏం చేయాలనేదానిపై అనాలోచితంగా నిర్ణయాలు తీసుకోకుండా పూర్తి అవగాహనతో తదుపరి కోర్సును ఎంపిక చేసుకోవాలి. ముఖ్యంగా ఇంజినీరింగ్ విద్యకు సంబంధించి ఏయే కోర్సులకు ఎలాంటి భవిష్యత్ ఉందో తెలుసుకోవాలి. ఏ కళాశాలలు బాగున్నాయి, ప్లేస్‌మెంట్స్ కల్పన ఎలా ఉంది, క్రమశిక్షణ ఎలా ఉంది, ఫ్యాకల్టీ ఎలా ఉంది.. అనే అంశాలను పరిశీలించాలి. ఇలాంటివి తెలుసుకునేందుకు ఈ ఫెయిర్ ఎంతగానో ఉపయోపడుతుంది.

– తిరుపతిరావు, అసోసియేట్ ప్రొఫెసర్ జేబీఐటీ

సందేహాలు నివృత్తి చేసుకున్నాం

తక్కువ సమయంలో ఎక్కువ సమాచారం తెలుసుకోగలిగాం. అన్ని కళాశాలలు తిరిగి తెలుసుకోవటం అసాధ్యం. ఇంటర్ తర్వాత ఏం చేస్తే మంచిదనే ప్రశ్నకు ఇక్కడ సమాధానం దొరికింది. ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందేందుకు ఏ అంశాలు పరిగణనలోకి తీసుకోవాలో తెలిసింది. మంచి కార్యక్రమం చేపట్టినందుకు కృతజ్ఞతలు..

– రాజేశ్వర్‌రెడ్డి, నిజామాబాద్

వెబ్ కౌన్సెలింగ్ గురించి తెలిసింది

మా పాపకు ఇంటర్ తర్వాత ఇంజినీరింగ్ చేస్తానంది. అయితే వెబ్‌కౌన్సెలింగ్ గురించి పెద్దగా అవగాహన లేదు. ఏయే పత్రాలు అవసరం అవుతాయో కూడా తెలీదు. కానీ ఇక్కడకు వచ్చినందుకు మా అనుమానాలు తొలగిపోయాయి. వెబ్‌కౌన్సెలింగ్ గురించి స్క్రీన్ ఏర్పాటు చేసి మరీ వివరించారు.

– రమేశ్, హైదరాబాద్

విదేశీ విద్యపై ఆసక్తి

విదేశాల్లో విద్యనభ్యసించేందుకు ఎంతోమంది ఆసక్తి చూపిస్తున్నారు. ఎక్కువగా మెడిసిన్ కోసం విదేశాలవైపు చూస్తుంటారు. అయితే అక్కడి పరిస్థితులు, కళాశాలల గుర్తింపు, ఫీజులు, భద్రతకు భరోసా తదితర అన్నిఅంశాల గురించి చెపుతున్నాం. వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకొని దాన్నే నమ్మి ముందుకువెళ్తే విద్యార్థులు మోసపోయే అవకాశం ఉన్నది.

– బీ శ్వేత, మేనేజర్, వీఆర్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ

యశోదలో భుజం గాయాలపై జాతీయ సదస్సు

కాన్ఫరెన్స్‌ను ప్రారంభించిన మంత్రి ఈటల

హైదరాబాద్: భుజం గాయాలకు సంబంధించిన సమస్యలపై ఆదివారం హైదరాబాద్‌లో యశోద హాస్పిటల్స్ యాజమాన్యం, తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సును రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భుజం చికిత్సలో జాయింట్లను విప్పకుండా చేసే ఆధునిక వైద్యపరిజ్ఞానమైన కీ హోల్ సర్జరీ గురించి అంతర్జాతీయ, జాతీయ ప్రతినిధులు వెల్లడించారు. సదస్సులో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, కోర్సు చైర్మన్ డాక్టర్ నితిన్‌కుమార్, యశోద గ్రూప్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ జీఎస్ రావు, సుమారు 200 మంది ఆర్థోపెడిక్ సర్జన్లు పాల్గొన్నారు.

టీఎస్ ఎంసెట్ ఫలితాల్లో రెండు స్టేట్‌ఫస్ట్ ర్యాంకులు శ్రీచైతన్యవే

హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్ -2019 ఫలితాల్లో ఇంజినీరింగ్, అగ్రి/మెడికల్‌లో స్టేట్‌ఫస్ట్ ర్యాంకు తమ విద్యార్థులే సాధించి చరిత్ర సృష్టించారని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టాపర్లు ఇద్దరూ శ్రీచైతన్య స్కూల్ టెక్నో కరుక్యులమ్ విద్యార్థులే కావడం విశేషమని పేర్కొన్నారు. ఇంజినీరింగ్‌లో టాప్ పదిలోపు పది ర్యాంకులు, 100లోపు 76 ర్యాంకులు, అగ్రి/మెడికల్‌లో టాప్ పదిలోపు ఆరు ర్యాంకులు, 100లోపు 60 ర్యాంకులు తమ విద్యార్థులే కైవసం చేసుకున్నారని వెల్లడించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బందికి ఆ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు అభినందనలు తెలిపారు.

'నారాయణ' ఏకఛత్రాధిపత్యం

హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో స్టేట్ 2, 3, 4, 4, 6, 6, 7, 7, 9, 10 వంటి టాప్ పదిలోపు పది ర్యాంకులతో తమ విద్యార్థులు ఏకఛత్రాధిపత్యం కనబరిచారని నారాయణ విద్యాసంస్థల ఎండీ డాక్టర్ పీ సింధూర నారాయణ, డైరెక్టర్ పీ శరణి నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్‌లో 100లోపు 51 ర్యాంకులు, అగ్రి/మెడికల్‌లో 100లోపు 27 ర్యాంకులు కైవసం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఇంతటి విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ అభినందనలు తెలిపారు.

డా.కేకేఆర్‌గౌతమ్ స్కూల్స్ పూర్వవిద్యార్థుల జయకేతనం

హైదరాబాద్: రాష్ట్ర ఎంసెట్ ఫలితాల్లో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్స్‌లో టెన్త్ వరకు చదివి ఐఐటీ ఫౌండేషన్ తీసుకున్న విద్యార్థులు జయకేతనం ఎగురవేశారని ఆ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. త

అంటరాని మామిళ్లు

రాలిన పండు
మనిషిని కూల్చింది
ఆకలి చెట్టుకింద శవమైంది

అతడిది ఒక్కమరణమేనా
కుటుంబమంతా నేలమీద రాలిన చిగురు
మామిళ్లే కదా..!

ఉరి ఎవరిది
బొండిగ పిసికే చేతులెవ్వరివి
కులంమీద గురి ఎవరిది
దరి దొరకని బతుకెవ్వరిది..?

గ్రామం వెలివేస్తుంది
పంచాయితీ నిలదీస్తుంది
గాయాల సలపరింత గానమై
గళమెత్తేదెన్నడు
నోరెత్తనీయని చూపుని
ముక్కలుచేసే కాలమెన్నడు
యుగాల అపశ్రుతుల
బంధనాలు
బద్దలు కొట్టే స్వరయాత్రకు
మొదలెన్నడు
నీడలానడిచే అంటరానితనం
మెడలో మాల అయ్యేదెన్నడు

– వేముగంటి మురళి
83091 78109

నీటి మనసు

నిజానికి చలనశీలమైన కవి ఎప్పుడూ మంచు ముద్దకాదు, కాలేడు. అతనిది 'నీటి మనసు'. నీటికున్నంత స్వచ్ఛత, ఏ మలినాన్నయినా కడిగివేసే సామర్థ్యం, ఏ కాలాన్నయినా కవిత్వం ద్వారా శుద్ధిచేసే తెగువ అతని సొంతం. దీనికి తార్కాణంగా వచ్చిందే డాక్టర్ నందిని సిధారెడ్డి ఇటీవల వెలువరించిన **'నీటి మనసు'** కవితా సంపుటి. ఇందులోని కవితలన్నీ తెలంగాణ రాష్ట్ర సాధనానంతర కాలంలో రాసినవే. సిధారెడ్డి గతంలో వెలువరించిన ఏడుపాయల్లాంటి కవితా సంపుటాలకు భిన్నంగా ఈ కవితా సంపుటిలో పల్లె, పట్టణం, విదేశం ఈ మూడు కోణాల్లోనే ఎక్కువ కవితలు సాగాయి. ఇతరాలు కూడా లేకపోలేదు. కాని వాటి సంఖ్య రాశిలో తక్కువ.

చరిత్రాత్మకమైన తెలంగాణ ఉద్యమం తర్వాత కవులు ఏం రాయాలో, ఏ సమస్యలు ఇంకా పీడిస్తున్నాయో ఈ సంపుటి చదివితే అర్థం అవుతుంది. తెలంగాణ ఉద్యమం జరిగి స్వరాష్ట్ర కల సాకారమైన తర్వాత నిజంగానే కవులకు ఎలా స్పందించాలో కొన్నిరోజులు అర్థం కాలేదు. చలనశీల కవి ఎల్లప్పుడూ ప్రజల పక్షం వహిస్తాడు. పాలకుల దుర్నీతిని నిలదీస్తాడు.

'నువ్వేమిటి?
డబ్బులు పోసి మూటలు పోగేసి
గెలిచిన పార్లమెంటు సీటువి
పాటలు కట్టి జీవితం పణం పెట్టి
హృదయాలు గెల్చిన శిఖరసభ నేను
కలం మూయించగలవా?
ఎందరు నియంతలను చూసిందీ కలం
ఎందరి నియంతల తలలు వంచిందీ కలం..' అంటూ

'ఒక రోజు.. దేశం విడిచిపోతాను
మరొక రోజు.. లోకం విడిచిపోతాను
అయితేమి?అక్షరాల సాక్షిగా..
జీవించే పుస్తకం నేను.. వర్ధిల్లే వాక్యం నేను..'

సిధారెడ్డి దృక్పథాన్ని, స్థానాన్ని స్పష్టంగా చెప్పే కవితా పంక్తులివి. తన చిరునామా ఈ లోకంలో ఎట్లా శాశ్వత చిరునామాగా మారుతుందో ప్రకటించే వాక్యాలివి. ఈ కవితా సంపుటి నిండా వస్తు వైవిధ్యం అపారంగా కనిపిస్తుంది. కవితలన్నీ పఠితను ఏదో లోకంలోకి తీసుకెళ్లి ఒక కుదుపు కుదుపి మనల్ని మనం ఎడిట్ చేసుకునేలా చేస్తాయి. **'ఎట్లా గూ జీవించదలుచుకున్నావు గదా!దమనులూ సిరలూ ధుమధుమలాడే జాతి పౌరుషమై విస్తరించు'** అంటాడు. **'ఏడ్చే వాళ్లను ఏడువనీ నవ్వేవాళ్లను నవ్వనీ.. నీ పని నీది, నీ పయనం నీది, నేలను మరువకు,తడితడి గుణం విడువకు, అనుభవం వడగట్టి ధ్యాసంతా కేంద్రీకరించి, అక్షరాలు వెదజల్లడం మరువకు'** లాంటి వాక్యాలు మార్చింగ్ వాక్యాల్లా మనిషిని ముందుకు నడిపిస్తాయి. అదే సమయం లో నేటి తరం ఎంతగా చేవగారి పోతున్నారో చెప్పి మన్నుతిన్న పాముల వైఖరిని ఈసడించుకుంటారు. **'ఆకాశాన్ని వంచి హరివిల్లు చేయగలవాళ్లు, వాట్సాప్‌లో వట్టిపోతున్నారు..'** అంటూ ఇప్పటి యువత ఏ మత్తు లో పడి విలువైన కాలాన్ని జారవిడుచుకుంటున్నారో చెప్పి హెచ్చరిస్తారు.

సిధారెడ్డి కవిత్వంలో చెప్పుకోదగ్గది అతని కవితా ఎత్తుగడలు, శిల్పం. ఎంచుకున్న వస్తువును ఒక కొంగ్రొత్త ఎత్తుగడతో గమ్మత్తయిన దారిలో నడిపించి కవిత సాంతం మనస్సుకు హత్తుకునేలా చేయడం ఈయన ప్రత్యేకత.

కవి తనదైన బాధ్యతను గుర్తెరిగిన తీరును చెప్పుకున్నాడు.

ఏ కాలంలోనైనా రాళ్లు విసిరేవాళ్లు ఎప్పుడూ ఉంటారు. అందుకే **'ఏ గతి రచియించితేని సమకాలం వారు మెచ్చరే కదా!'** అన్నాడు చేమకూర వేంకటకవి. కన్ను తడవకుండా, గాయం కాకుండా జీవితాన్ని దాటలేం. నటిస్తూ నడిచే కవికి, వంద నాలుకలతో రకరకాల పల్లవులెత్తుకునే కవికి ఇవేవీ దరిచేరవు. కాని నిజమైన కవి అలా నటించలేడు.చూపు, తొవ్వ రెండూ సమతూకంగా సాగుతాయి. నిజాయితీగా నడిచే కవి తడిలేని అక్షరాన్ని ఆలింగనం చేసుకోలేడు. దాదాపు నాలుగున్నర దశాబ్దాల ప్రయాణంలో ఈ కవిది ఎప్పుడూ పోరాటాల పయనమే. ధిక్కార స్వరమే.

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఒక సాంస్కృతిక పరిమళ వీచిక. ఇక్కడి చెట్లకు పూలు కాదు ఆయుధాలు, నినాదాలు పూసి విద్యార్థులకు పిడికిళ్లను బహుమతిగా ఇస్తాయి. అందుకే ఈ నేల మీద అనేక ఉద్యమాలు పూస్తాయి. ఓయూ ఎంతోమందికి జీవించడం నేర్పింది. ప్రేమించడం నేర్పింది. పోరాడటం నేర్పింది. కలలు కనడం నేర్పింది. వాటిని సాకారం చేసుకోవడమూ నేర్పింది. అందుకే ఓయూ అంటే అందులో చదివిన విద్యార్థులకు అమ్మ మీది మమకారం. నాన్న మీది అధికారం.

సిధారెడ్డి కవిత్వంలో చెప్పుకోదగ్గది అతని కవితా ఎత్తుగడలు, శిల్పం. ఎంచుకున్న వస్తువును ఒక కొంగ్రొత్త ఎత్తుగడతో గమ్మత్తయిన దారిలో నడిపించి కవిత సాంతం మనస్సుకు హత్తుకునేలా చేయడం ఈయన ప్రత్యేకత. సిధారెడ్డి ఏది చెప్పినా కవి పీడితుని వైపు, బాధితుని వైపు, సగటు మనిషి వైపు నిలబడటం కనిపిస్తుంది. ఇందులోని నలభై కవితలు నలభై కొత్త కోణాల్ని ఆవిష్కరించి తెలంగాణ సమాజాన్ని, భారతీయ సమాజాన్ని, ప్రపంచాన్ని మన కళ్లముందుంచి కాసింత తడిని మన గుండెకు అందించి వెళ్తాయి. అందుకే కవే అన్నట్టు 'కవి పుట్టువడి నది పుట్టువడి ఒకటే'. **'నీటి మనసు'** లోలోతుల్లోకి తవ్వుకుంటూ వెళ్లినా కొద్దీ ఊరుతత్త్వం, నీటి తత్త్వం, మనిషి తత్త్వం బోధపడుతాయి. నెత్తుటి కత్తిని కడిగిన నది నీటిలాగా నిదానంగానే అయినా ఒక రక్తపు జీర మన మనసు మూలల్లోకి చేరుకుంటుంది.

– డాక్టర్ వెల్దండి శ్రీధర్
9866977741

పుస్తకాలు

కథాకళి



బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి 1946-61 మధ్య కాలంలో రాసిన కథల సంకలనమిది. ఆ కాలం నాటి స్వాతంత్ర్యోద్యమాన్ని, విదేశీ వస్తు బహిష్కరణను చిత్రించిన కథలు ఇవి. ఆ కాలం నాటి పండుగలు కూడా ఎన్నో కష్టాలను తెచ్చిన విధాన్ని 'కొత్తపండుగ' కథలో కథనం చేసిన తీరు విలక్షణం. ఈ కథలు స్వాతంత్ర్యపు పూర్వపు, తర్వాతి స్థితి గతులను తెలియజేస్తాయి.

రచన:బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి, వెల: రూ.40, ప్రతులకు:తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభారతి, రవీంద్రభారతి, ప్రాంగణము,హైదరాబాద్-4

జీవశాస్త్ర చరిత్ర-1

జీవశాస్త్రానికి వేల ఏండ్ల చరిత్ర ఉన్నది. జంతువులను వేటాడి పొట్టపోసుకోవటం నేర్చుకున్న మానవుడికి జంతుశరీర నిర్మాణం గురించి తెలియకపోలేదు. ఆ క్రమంలోనే వైద్యం కూడా పురుడు పోసుకున్నది. గెలీలియో తదితరులు సాధించిన ఆధునిక వైజ్ఞానిక విప్లవం కారణంగా భౌతికశాస్త్రంతోపాటు, జీవశాస్త్రం కూడా వేగంగా పురోగమించింది. ఆ పురోగమన శాస్త్రమే ఈ పుస్తకం.

రచన: ఐజాక్ అసిమోవ్, తెలుగు: డాక్టర్ వి. శ్రీనివాస చక్రవర్తి, వెల: రూ. 50, ప్రతులకు: మంచి పుస్తకం, 12-13-439, వీధినెం:1, తార్నాక, సికింద్రాబాద్-17. ఫోన్: 940746614

ప్రకటన

నవలా స్రవంతి

నెల నెలా 'నవలా స్రవంతి' కార్యక్రమంలో భాగంగా 2019 జూన్ 14న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాలులో భాస్కరభట్ల కృష్ణారావు 'వెల్లువలో పూచికపుల్లలు'పై ఆడెపు లక్ష్మీపతి ప్రసంగిస్తారు. సభకు నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారు. అందరికీ ఆహ్వానం.

– తెలంగాణ సాహిత్య అకాడమి

నన్నయ, తిక్కనల నడిమి కాలంలోనూ తర్వాత ఎర్రన కాలంలోనూ కొనసాగిన సారస్వత ప్రవాహం.. రామాయణ ప్రసారం. వాల్మీకి నోట ఎప్పుడు వెలువడిందో కానీ రామాయణం, భారతీయుల మనసులలో అనన్య సాధ్యమైన ప్రతిష్ఠను సంపాదించుకొన్నది. వాల్మీకి మొదట కిరాతుడై తర్వాత మునిగా పరివర్తన చెందినట్టు ఒక గాథ ప్రచారం జరుగుతూ వచ్చింది. ఈ గాథలోని సత్యాసత్యాలు ఎట్లా ఉన్నా మనిషి తన భౌమ సంస్కారాల నుంచి కామక్రోధాదుల నుంచి అతి లోభ బుద్ధి నుంచి మృత్యుభయం నుంచి విముక్తి చెందేందుకు రామాయణం ఆ గ్రంథ పారాయణం కొన్ని వేల ఏండ్లుగా మన దేశంలో జరుగుతూ వస్తున్నది. ఏవమేతత్ పురావృత్తం ఆఖ్యాతం భద్రమస్తువః ప్రవ్యాహరత విస్రగ్ధం బలం విష్ణోః ప్రవర్ధతాం అని గ్రంథ ఫలశృతి చెప్తున్నది. మనందరికీ క్షేమం కలిగించే ఈ గ్రంథం అధ్యయన అధ్యాపనాలు జగద్వ్యాప్తమైన మూల చైతన్యమైన విష్ణువు యొక్క బలాన్ని పెంపొందిస్తున్నది. విష్ణువు బలాన్ని పెంపొందించడం అనే మాట వైదికమైంది. ఇక్కడ విష్ణు బలం అంటే మనిషి అంతర్ముఖుడై తనను తాను పరిమితుల నుంచి ఛేదించుకొని విశ్వచైతన్యంతో తాదాత్మ్యం చెందడమని తాత్పర్యం.

రామాయణ రసవాహిని

శ్రీరామచంద్రుడు ఆదర్శమానవ వ్యక్తిత్వానికి ఆదర్శప్రాయమైన ప్రతీక. ఈ ఆదర్శం గురించి రామాయణం ఆరంభంలోనే పదహారు గుణాలు కేంద్రీకృతమైన మానవుడుగా షోడష కళాప్రపూర్ణుడైన చంద్రుడుగా రాముడు నిరూపించబడ్డాడు. ఈ చంద్రకళాస్వరూపం దేవీ ఉపాసకులకు ప్రత్యక్షమయ్యే లలితాదేవి, రాజరాజేశ్వరిరూపం. అట్లాగే శ్రీవైష్ణవ సంప్రదాయంలో శ్రీమన్నారాయణుని సంపూర్ణమైన అవతారం. రాఘవత్యే భవత్ సీతా రుక్మిణీ కృష్ణ జన్మని అన్న మాటను భావన చేస్తే ఈ కావ్య నాయకుడు లక్ష్మీ నారాయణ స్వరూపుడుగా భావింపబడినాడు.

రామాయణం మనకు ఆది కావ్యం. మన కవిత్వ విద్య అంతా ఈ గ్రంథంలోనే అమృతం గూడు కట్టినట్లుగా రూపింపబడింది. ' ఈ సంసారమిదెన్ని జన్మలకునేని మౌని వాల్మీకి భా

'షా సంక్రాంంత ఋణంబు దీర్పగలదా తత్కావ్య నిర్మాణ రే
ఖా సామర్థ్య ఋణంబు దీర్పగలదా కాకుత్సుడౌ స్వామి గా
ఢా సంపన్నము భక్తి దీర్చినను ద్వైతాద్వైత మార్గంబులన్..'

అని కల్పవృక్షకవి వాల్మీకి కావ్యశిల్పాన్ని గురించిన తన అచ్చెరువును ప్రకటించాడు. తర్వాత వచ్చిన భారతీయ వాఙ్మయమంతా వాల్మీకికి ఋణపడి ఉన్నదే. 'ఒక్క వాల్మీకి యే రూపమొందినాడో కాళిదాసుగ, భవభూతిగా జగాన' ఇద్దరు కవులనే పేర్కొన్నా మన కవి పరంపరలో అనేకమందికి ఈ మాట సరిపోతుంది.

తెలుగు సాహిత్యానికి సంబంధించిన మహాభారత సందర్భంలో వేదవ్యాసుని వివర్త రూపాలు ముగ్గురే. కవిత్రయమే. (శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి గారి మహాభారత అనువాదం ఎంతగొప్ప ప్రయత్నం అయినా వంద సంవత్సరాల కాలం ఇంచుమించుగా రచన జరిగిపోయినా పఠన పాఠశాలలో అంతగా కనిపించదు) కానీ శ్రీమద్రామాయణానికి సంబంధించినంత వరకు వాల్మీకి వివర్త రూపాలు నూటికి మించే ఉంటాయి. తిక్కనకాలం నాటికే ఆయన తాతగారు మంత్రి భాస్కరుడు రామాయణం చెప్పినట్లుగా తిక్కన నిర్వచనోత్తర రామాయణంలో పేర్కొన్న తర్వాత తిక్కన స్వయంగా ఉత్తర రామాయణాన్ని నిర్వచనంగా తన పోషకుడైన ప్రభువులు మనుమసిద్ధికి అంకితంగా రచించారు. కాకతీయుల ఆస్థానంలో ఉన్న ఒక సేనాపతి గంగయ సాహిణికి అంకితంగా హుళుక్కి భాస్కరుడు చంపూ పద్ధతిలో రామాయణాన్ని రచించారు. ఈయన తోడుగా ఈ రామాయణ రచనలో అయ్యలార్యుడు కుమార రుద్రదేవుడు దీన్ని పూర్తిచేయడంలో తోడ్పడ్డారు. కవిత్రయ భారతం వలెనే దీనిలోనూ పఠన పాటవాలకు యోగ్యమైన శైలి ఉన్నది. ఆకాశంలో మబ్బులు పట్టినప్పుడు అంతా చీకటిగా మారినప్పుడు.. ఏ వస్తువునూ గుర్తించలేనప్పుడు లోకమెట్లా కనిపించిందో భాస్కర రామాయణం ఇలా వర్ణించింది..

'యమునద్గంగము, కృష్ణభూమదిలము అబ్జాక్షనమనుష్యంబు, నీ
లమహీధ్రనిన్నిఖిలాగామావళి, తమూలద్భూజమిందీవరతుముదశ్రేణి...'

ప్రపంచమంతా నీలమేఘాల కాంతివల్ల ఎలా తమోమయంగా మారిందో అద్భుతమైన రీతిలో వర్ణించారు. భాస్కర రామాయణం అనే కుల రచన యైనా పాఠకులకు కావ్యానుభవాన్ని అందించడంలో ఒకే కవికృత కావ్యంగా గోచరిస్తుంది.

దీని తర్వాత ఇంచుమించు ఇదే కాలంలో రంగనాథ రామాయణం వచ్చింది. గోనబుద్ధారెడ్డి అతని సంతానం నిర్మించిన ఈ కావ్యం సరసమైంది. సులభమైంది. పాడుకోవటానికి అనుకూలమైంది. దీనిలో అనేక గాథలు మూల రామాయణంలో ఉన్నవి కావు. ఇతర రామాయణాలలో వేరైన రామ సారస్వతం ప్రసిద్ధికి వచ్చిన గాథలు చేర్చబడ్డాయి. ఈ గాథలన్నీ ప్రజలలో అధికంగా వ్యాపించి ఉండటం వల్ల ఈ రామాయణం రచించిన కాలం నుంచి ఈ నాటి వరకు జనప్రియంగా సహృదయరంజకంగా ప్రచారంలో కొనసాగుతూ ఉంది. ఇంద్రజిత్తు భార్య సులోచన గాథ దీనిలోని అపూర్వ కథలలో ఎక్కువగా వ్యాప్తి పొందింది. రంగనాథ రామాయణం గోనబుద్ధారెడ్డి ప్రభృతులు కర్తలైనా చక్రపాణి రంగనాథుడే కర్త అని చాలాకాలం మన విమర్శకులు భావించారు. దేశంలో బహుళంగా ప్రదర్శింపబడే తోలు బొమ్మలాటలలో ఈ రామాయణంలోని భాగాలు భావస్ఫురణ కోసం ఆడబడుతూ ఉండేవి. అందువల్ల ఇది అధికంగా వ్యాప్తి పొందిన రచన.

ఈ విధంగా ఈ రెండు రామాయణాలు తెలుగు సారస్వతంలో మార్గదేశి సంప్రదాయాల ప్రతినిధులుగా ఎక్కువ ప్రాచుర్యం పొందాయి. తర్వాత రామాభ్యుదయం వంటి కావ్యాలు, ప్రబంధాలు, యక్షగానాలు, వచన కావ్యాలు, ఆధ్యాత్మ రామాయణం వంటివి కీర్తన రూపాలతోపాటు, రచనా కాలాన్ని ఇదమిత్థంగా నిర్ణయించడానికి వీలులేని స్త్రీల రామాయణ పాటలు కూడా వచ్చాయి. ఇలా ఈ రామాయణ సారస్వతవాహిని అనంతంగా కొనసాగుతూ వచ్చింది.

ఆధునిక కాలంలో గడిచిన రెండు శతాబ్దాలలో వాల్మీకి రామాయణానికి అనుకరణలు అనువాదాలు పరిణత రూపాలు ఎన్నో వెలువడ్డాయి. వాల్మీకి రామాయణాన్ని మించి ఆధ్యాత్మ రామాయణం ఆనంద రామాయణం, మొదలైన రామాయణ కథా వ్యాఖ్యరూప రచనలు ఎన్నో వెలువడ్డాయి. తమకిష్టమైన రీతిలో రామగాథను పాక్షికంగానో, సంపూర్ణంగానో పద్యరూపంలో గద్యరూపంలో నాటకాల రూపంలో నిర్వహించిన వందలమంది కవులు ఉన్నారు. అంతేగాక మన దేశంలోని ఇతర భాషలలో వెలువడిన ప్రసిద్ధ రామాయణాలను యథాశక్తిగా అనువదించి అందించినవారున్నారు. తులసీదాస్‌గారి 'రామచరితమానస్'కు రెండు మూడు అనువాదాలు తెలుగులో వచ్చాయి. అట్లాగే మైథిలీశరణ్ గుప్త సాకేత్ అనే మహాకావ్యానికి తెలుగులో అనువాదాలు వచ్చాయి. కంబన్ తమిళంలో రచించిన రామాయణం తెలుగులోకి పద్యరూపంలోనూ వచన రూపంలోనూ పరివర్తితమైంది. రామాయణంలోని ఒక్కొక్క ఘట్టాన్ని ఒక్కొక్క పాత్రను ఆధారం చేసుకుని శ్రీవైష్ణవాచార్య పురుషులు తమ గ్రంథాలలో చేసిన వ్యాఖ్యానం ఆధారంగా శ్రీమాన్ గుడిమెళ్ల రామానుజాచార్యులు ఇరవైకి పైగా కావ్యాలు రచించారు.

రామాయణ పరివర్తకులలో రెండు మూడు అంశాలు ప్రధానంగా పనిచేశాయి. మొదటిది వాల్మీకి కవితయందు వారు పొందిన సమ్మోహశీలము అందువల్ల వాల్మీకిని వీలైనంత సన్నితంగా ప్రతిఫలింపచేయడం ఆయన కవిత్వ గౌరవాన్ని సంభావింపచేయడం ఒకటి. వాల్మీకి చిత్రణలోని పాత్రలు, సన్నివేశాలు తమ భావనకు అనుగుణంగా లేవని భావించి ఆధునిక భావముల ఒత్తిడితో ఆ ఘట్టాలను పునర్ వ్యాఖ్యానంచేసే ప్రయత్నం రెండవది. రామగాథను ప్రతీకాత్మకంగా గ్రహించి దానిలోని ఆధ్యాత్మికాంశాలను విస్తరించి వివిధ తాత్త్విక సంప్రదాయ భావనలను గౌరవించి ప్రతీకాత్మకంగా నిర్మించడం మూడవది. రామకథా సంప్రదాయానికి భిన్నంగా ఆనాటి జస్టిస్‌పార్టీ మొదలైన వారి భావనలకు అనుగుణంగా కథారూపాన్ని మార్చి పాత్రల వ్యక్తిత్వాలను రూపుకట్టించి ఆనాటి భావనలకు అనుగుణంగా రచనను కొనసాగించటం నాలుగవది. రామాయాణానికి ప్రతిబింబంగా ఉండే నూతన కథానిర్మాణంలో రైతు రామాయణం, గ్రామాయణం మొదలైన రచనలు కొనసాగించటం ఐదవది. ఇంకా ఎన్నో విధాల, భావాల, సంఘర్షణల, ఇష్టాయిష్టాల, రాగద్వేషాల పరిణామాలు రామకథా వ్యాఖ్యానంలో మనం చూడవచ్చు.

వాల్మీకి రామాయణాన్ని గూర్చి బహు ప్రాంతాలలో అనేక నిరూపణలు మనకు కనిపిస్తాయి. వీటిలో ప్రధానమైనది సీతా పరతత్త్వ నిరూపణం. దీనికోసం సీతారామణం, లంకా విజయం వంటి కావ్యాలు వెలువడ్డాయి. సీతాదేవిని మహామాయగా, ఆదిపరాశక్తిగా, పరతత్త్వ స్వరూపిణిగా ఇవి నిరూపించాయి. రామాయణమని, సీతా చరితమని, పౌలస్త్యవధమని మూడు త్రోవలలో తాను రచిస్తున్నట్లు వాల్మీకి పేర్కొన్నాడు. దీనివల్ల వ్యాఖ్యకు సహ్యత అనంతంగా ఉన్నట్లు మనకు తెలియవస్తున్నది. ఈ సందర్భంలో రామాయణంలోని బాలకాండంలోని చాలా భాగం ఉత్తరకాండలోని ఎక్కువభాగం ప్రక్షిప్తాలని పరిశోధకులు అర్ధశతాబ్దం ముందు భావించేవారు. ఉత్తర రామాయణం లేకపోతే శంబూకవధ లేదు. సీతాపరిత్యాగగాథ లేదు. యుద్ధకాండ చివరన వాల్మీకి కావ్య ఫలశ్రుతిని చెప్పారు.

ఈనాడు మనం ఆక్షేపిస్తున్న అనేకాంశాలు ఉత్తర రామాయాణానికి సంబంధించిన వి. అలా ఐనపుడు ఈ ఆక్షేపణలకు నిలిచే అవకాశం ఉండదు. బౌద్ధ, జైన రామాయణాలలోని కొన్ని అంశాలు వాల్మీకి ఆశయానికి భిన్నంగానే ఉన్నవి. ఇక్కడ ఒక్కొ సంప్రదాయం తమ విశ్వాసాలను బట్టి తమకనుగుణంగా రామగాథను చిత్రీకరించాయి. ఆ మూల గాథ యొక్క బలం ఎన్ని సంవత్సరాలైనా అలాగే కొనసాగుతుంది. పోతన్న భాస్కరుని గురించి అతని రామాయణ రచన గురించి మాట్లాడుతూ' భాస్కరుడు నిర్మించెను గాని నేనురామాయణా బండ్లకెత్తి యుందునని 'అన్నాడు

'యావత్ స్థాస్యంతి గిరయః
సరితశ్చమహీతలే
తావద్రామాయణీ గంగా
లోకేషు ప్రచరిష్యతి

– కోవెల సుప్రసన్నాచార్య

> వాల్మీకి రామాయణాన్ని గూర్చి బహు ప్రాంతాలలో అనేక నిరూపణలు మనకు కనిపిస్తాయి. వీటిలో ప్రధానమైనది సీతా పరతత్త్వ నిరూపణం. దీనికోసం సీతారామణం, లంకా విజయం వంటి కావ్యాలు వెలువడ్డాయి. సీతాదేవిని మహామాయగా, ఆదిపరాశక్తిగా, పరతత్త్వ స్వరూపిణిగా ఇవి నిరూపించాయి.

మిరుగు పండు!

ఆన దేవుడు ఆగకుండ అస్తడని
మెరుగు వానల మబ్బుల కొలది తెస్తడని
మిరుగు పండ్ల ఇల్లిల్లు చేస్తున్నరు

అవ్వ ఇంగు బెల్లం కల్వంల దంచి దంచి
ఉండలు గట్టి ఇంటోల్లకు
సోపతిగ ఇరుగు పొరుగోల్లకు పంచిపెట్టి
మొగులుకేసి ఆశగా సూస్తున్నది ఊరు మీదికి
మబ్బు దిగాలని !

తియ్యగ ఇంగుబెల్లం తిన్నాకా
తియ్యటి ఆన సిన్కులు పడకుండ ఆగుతయా !
భూమిని తడుపనే తడుపుతై
మన్ను దాగిన ఇత్తనాలను తడుముతై !

మిరుగు నాడు ఆనవడితే
కాలం మంచిగుంటదని
తాత ముత్తాతల మాట బండ మీది శాసనమే !

ఇంకా నోట్ల ఇంగు బెల్లం కరుగనే లేదు
ఆన చిన్కులు మొదలైనై
ఆకిలంతా తడిసినోళ్లతోని మిరుగు పండుగైంది !!

– కందాళై రాఘవాచార్య
99086 12007

భువనగిరి గుట్ట

కొండపక్కనే మాయిల్లు
లేదా మాయింటి పక్కనకొండ
నేను పుట్టగానే నాకళ్లనిండా
దాని నీడలు వ్యాపించివుంటాయి
దానిని తెచ్చివ్వమని ఏడ్చిందే
నాతొలి ఏడుపు అయివుంటుంది!

దాని వెనుక నుంచి
తొంగిచూసే సూర్యోదయం,
దానిపై కురిసే
ఐంద్రజాలిక వర్షాలు
నా భావుకతకు చిగురులు తొడిగి
కవిగా మలిచి వుంటాయి..!

మా కొండ కూడా
ఏ ఆకృతిని ఊహించుకంటే
అలాగే కనిపించేది.
మబ్బులతో దానికి సోపతి
ఆ రోజుల్లోనే దానిచుట్టు పక్కల
బోలెడన్ని పల్లెలుండేవి.
ఒక్కో ఊరిలోంచి
ఒక్కో కోణంలో కనిపించేది
దాని సమగ్ర స్వరూపాన్ని
నేనింకా దర్శించవలసేవుంది..!

ఏప్రాక్తన కాలం నాటిదో ఆ కొండ..
దాని శిథిలాలు
నిన్నమొన్నటి చరిత్రకు కూడా
సజీవ సాక్ష్యాలు..!

ఆకాశం
మేఘచాలితమైనప్పుడు
కిందకొండ
కాలమహాసాగరంలో కదుల్తున్న
ఓడలా వుంటుంది..!

ఎప్పుడో నగరానికి వలసపొయ్యాను
కలతలు ముసిరినప్పుడల్లా
చెప్పుకోడానికిప్పుడు
దగ్గర కొండ కూడా లేదు.
మెల్లగా అర్థమౌతుంది
తోడుండటానికి తనకు బదులుగా
కవిత్వాన్నిచ్చింది కాబోలు..!

– డాక్టర్ ఎన్.గోపి



ముసలి అద్దం

పెద్ద మనుమరాలు
ఎండకాలం సెలవుల్లో
మా ఇంటికి వచ్చింది

పొద్దున అద్దంలో ముఖం
చూసుకుంటూ
'అమ్మా! అద్దం ముసలిదైంది
సరిగా కనిపించడంలేదు.. '
పెద్దమ్మాయికి ఫిర్యాదు చేసింది.

నడిపి మనుమరాలు
'అమ్మమ్మా ! కొత్త అద్దం
దుకాణానికి పోయి
కొనుక్కచ్చుకుందాం..'
గావురాలు పోతూ చెప్పింది.

రెండేళ్ల చిన్న మనుమరాలు
ఇద్దరక్కల మాటలు విని
అద్దం గుంజుకొని
గోడకు విసిరి కొట్టింది.

ముక్కలైన అద్దంవైపు చూస్తూ
చేసేదంతా చేసి
ఎవరేమంటారోనని ఏడుస్తుంది.

పెయ్యి వృద్ధాప్య సూచనలు చేస్తున్నా
ఒప్పుకోలేక మసలిపోతున్న
మనసును చూసి
పగిలిన దర్పణం
బేతాళునిలా పకపకా నవ్వింది..!

– జూకంటి జగన్నాథం

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

వేములవాడ రాజన్న సన్నిధి ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్వామివారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. దాదాపు 8వేల మంది స్వామివారిని దర్శించుకోగా.. రూ.10 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయాధికారులు తెలిపారు.
-వేములవాడ కల్చరల్

సీఎం కృషితోనే పురాతన ఆలయాలకు పూర్వవైభవం

- మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ఎమ్మెల్యే స్వగ్రామం తోటపల్లిలో చెన్నకేశవస్వామి విగ్రహ ప్రతిష్ఠ
- కార్యక్రమానికి హాజరైన చిన జీయర్‌స్వామి

బెజ్జంకి: ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితోనే పురాతన ఆలయాలు అభివృద్ధికి నోచుకున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. తన స్వగ్రామం సిద్దిపేట జిల్లా తోటపల్లిలో సొంత నిధులతో చెన్నకేశవస్వామి ఆలయాన్ని పునరుద్ధరించగా, ఆదివారం చిన జీయర్ స్వామి చేతులమీదుగా విగ్రహ ప్రతిష్ఠ జరిపించారు. కార్యమానికి కుటుంబసమేతంగా హాజరైన హరీశ్‌రావు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఏన్నో ఏండ్ల చరిత్ర కలిగిన చెన్నకేశవస్వామి ఆలయంలో చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా విగ్రహప్రతిష్ఠ జరుగడం ఆనందంగా ఉందన్నారు. చెన్న కేశవస్వామి తమ గ్రామంలో కొలువుదీరడం పూర్వజన్మసుకృతమన్నారు.

సిద్దిపేట జిల్లా తోటపల్లిలో విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు దంపతులు. చిత్రంలో చిన జీయర్‌స్వామి ఉన్నారు.

యాదాద్రి పంచనారసింహక్షేత్రం ఆదివారం భక్తజనులతో పోటెత్తింది. వేసవి సెలవులు ముగుస్తున్న తరుణంలో శ్రీలక్ష్మీసమేతుడైన నరసింహస్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. శ్రీసత్యనారాయణస్వామి వారి వ్రత పూజల్లో పాల్గొన్నారు. శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరునికి రుద్రాభిషేకం జరిపారు. స్వామివారి ఖజానాకు రూ. 27,81,893 ఆదాయం సమకూరింది. - యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ

పల్లెల్లో స్వయంపాలన

కొత్త జిల్లాలు, మండలాల్లో కొలువైన పాలక మండళ్లు
స్వయంసమృద్ధి దిశగా పంచాయతీలు
గ్రామాల అభివృద్ధిలో పరిషత్ సభ్యులకు ప్రత్యేకాధికారాలు
ఇక మున్సిపాల్టీ ఎన్నికలకు కసరత్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్థానిక సంస్థల్లో అత్యంత ప్రధానమైన ఎన్నికల ప్రక్రియ ముగిసింది. జనవరిలో గ్రామ పంచాయతీల ఎన్నికలతో ప్రారంభమైన స్థానికఎన్నికలు మేలో జరిగిన జిల్లా, మండల పరిషత్ ఎన్నికలతో సింహభాగం పూర్తయినట్లయింది. మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరుగాల్సి ఉన్నది. రిజర్వేషన్ల జాబితా అందితే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి పేర్కొన్నారు.

కొత్త గ్రామాలు.. కొత్త జిల్లాలు..

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనాసంస్కరణలు తీసుకురావడంతో కొత్త జిల్లాలు, మండలాలు, గ్రామపంచాయతీలు ఏర్పడ్డాయి. గ్రామీణాభివృద్ధి పరిపుష్టం చేయడంకోసం ప్రభుత్వం గత ఫిబ్రవరి నుంచి నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. సుమారు 12,751 గ్రామాలకు పాలక మండళ్ల ఎన్నికతోపాటు 32 జిల్లాలు, 538 మండలాల పరిషత్‌లకు ఎన్నికలయ్యాయి. తండాలు, గూడేలు కొత్తగా గ్రామాలు కావడంతో వేలమంది గిరిజనులకు రాజకీయ అధికారం లభించింది. నూటికి నూరుశాతం గిరిజన పాలక మండళ్లు ఏర్పడటం రాష్ట్ర చరిత్రలోనే రికార్డు. చాలా గ్రామాలు, మండలాలు, జిల్లా పరిషత్‌లు నూతనంగా ఏర్పడటంతో వాటికి ఎన్నికైన ప్రతినిధులు తొలి సర్పంచ్‌లుగా, ఎంపీపీలుగా, జెడ్పీ చైర్మన్లుగా రికార్డుల్లో నిలిచిపోనున్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల ప్రక్రియ

డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగిన నాటి నుంచి రాష్ట్ర ఎన్నికలసంఘం వరుస ఎన్నికల నిర్వహణను విజయవంతంగా చేపట్టింది. జనవరిలో పంచాయతీ ఎన్నికలు కాగా, ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికలు.. ఆ వెంటనే పరిషత్ ఎన్నికలను ఎలాంటి అవరోధాలు లేకుండా నిర్వహించింది. పంచాయతీ, పరిషత్ ఎన్నికలో మూడు విడుతల్లో పూర్తిచేశారు. ఒకటి రెండు చిన్న సందర్భాలు మినహా.. స్థానిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం. మరోవైపు మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్, కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలు ఈ నెల 7, 8 తేదీల్లో ప్రశాంతంగా ముగిశాయి. గ్రామీణ ఓటర్లంతా టీఆర్ఎస్‌కు పట్టం కట్టడంతో జిల్లా, మండల పరిషత్‌లు ఒకేరోజున ఏకగ్రీవమయ్యాయి. పలు కారణాలతో ఇంకా 22 ఎంపీపీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వాటిని కూడా ఈ వారంలో పూర్తిచేయనున్నారు.

గ్రామాల ప్రణాళికలో పరిషత్ సభ్యుల పాత్ర

గ్రామ పంచాయతీల్లో ఎంపీటీసీ సభ్యుల భాగస్వామ్యం కల్పిస్తూ సీఎం కేసీఆర్ నూతన పంచాయతీరాజ్ చట్టంలో రూపొందించారు. దీని ప్రకారం ప్రతి ఐదేండ్లకు గ్రామ పంచాయతీ దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళిక, వార్షిక ప్రణాళికను ఎంపీటీసీ సభ్యులు ఆమోదించాల్సి ఉంటుంది. ఇలా పలు అధికారాలను ఎంపీటీసీలకు అప్పగించారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులపై బాధ్యతలను పెంచిన ప్రభుత్వం... వాటిని నిర్లక్ష్యం చేసే చర్యలు తీసుకునేందుకు కూడా చట్టంలో మార్పులు చేసింది. అంతేకాకుండా కొన్ని పరిమితులను విధించింది. మండల పరిషత్ అధ్యక్షులు వరుసగా 15 రోజులు మండలానికి, కార్యాలయానికి రాకుంటే.. వారిని తొలిగించినట్లుగా భావిస్తూ ఉపాధ్యక్షుడికి బాధ్యతలను అప్పగించాల్సి ఉంటుంది. ఒకవేళ ఇద్దరూ రాకుంటే సంబంధిత ఎంపీడీవోలు ఆ బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. మండల పరిషత్‌కు వచ్చిన నిధులన్నీ పరిషత్ నిధిగా ఏర్పాటు చేసి, అందరి ఆమోదంతో వినియోగించాలి. వచ్చిన నిధులను ప్రభుత్వ ఖజానాలోనే జమ చేయాలి. ఉద్యోగ భద్రత పథకం, ఇతర వేతనాలు, ఉపాధి నిధులను జాతీయ బ్యాంకులు, సహకార బ్యాంకులు, తపాలా కార్యాలయాల్లో జమచేయాల్సి ఉంటుందని కొత్త చట్టంలో నిబంధనలు విధించారు.

'ఓటెత్తిన' పల్లె : వనపర్తి జిల్లాలోని ఓ గ్రామంలో ఓటేసేందుకు బారులుతీరిన ఓటర్లు

దేశంలోనే మోడల్ స్టేడియంగా అంబేద్కర్ క్రీడా మైదానం

కరీంనగర్ మేయర్ రవీందర్‌సింగ్

కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడా మైదానాన్ని స్మార్ట్ సిటీ నిధులతో దేశంలోనే మోడల్ స్టేడియంగా తీర్చిదిద్దనున్నట్లు కరీంనగర్ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ పేర్కొన్నారు. ఆదివారం స్టేడియంలో ఆయన మీడియాతో మాట్లాడు తూ.. స్మార్ట్ సిటీలో భాగంగా ఈ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు రూ.18 కోట్లు కేటాయించామన్నారు. ఇప్పటికే అధునాతన డిజైన్లు తయారు చేయించామనీ, టెండర్లు పిలిచి వర్క్ ఆర్డర్లు ఇచ్చామన్నారు. ఈ నెల 11న మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తామని చెప్పారు.

ఎన్నికల హామీలు నెరవేరుస్తా

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

జగిత్యాల, నమస్తే తెలంగాణ: ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతిహామీని నెరవేరుస్తానని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. ఎంపీగా గెలిచిన తర్వాత తొలిసారి జగిత్యాలకు వచ్చిన ఆయన స్థానిక మార్కండేయ, వినాయక ఆలయాలను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు తథ్యమనీ, కేంద్ర మంత్రితో మాట్లాడి పసుపునకు మద్దతు ధర కల్పిస్తామన్నారు.

వరంగల్‌లో మాట్లాడుతున్న పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పేదల సంక్షేమానికి సంఘాలు కృషి చేయాలి

■ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

న్యూశాయంపేట(వరంగల్) : పేదల సంక్షేమానికి కులసంఘాలు కృషి చేయాలని పంచాయతీరాజ్‌శాఖా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం వరంగల్ అభిరాం గార్డెన్స్‌లో జరిగిన వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం 24వ వార్షికోత్సవానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో గుర్తింపు పొందాయన్నారు. కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పుస్కూరి మోహన్‌రావు, అధ్యక్షుడు పేరాల మధుసూదన్‌రావు, ఉపాధ్యక్షుడు పల్లెపాటి విద్యాసాగర్‌రావు, జనరల్ సెక్రటరీ బొంపెల్లి వెంకట్‌రావు, కోశాధికారి కాకుమర్రి ప్రవీణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ తక్కళ్ల పల్లి శ్యాంసుందర్‌రావు పాల్గొన్నారు.

వనపర్తి జిల్లా వెల్టూర్‌లో మాట్లాడుతున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

నేటినుంచి రైతుబంధు

■ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

పెద్దమందడి : ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల్లో ప్రకటించిన విధంగా ఈ ఏడాది రైతుబంధు సోమవారం నుంచి ప్రారంభమవుతుందనీ, పెట్టుబడి సాయం నేరుగా రైతుల అకౌంట్లలో జమవుతుందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల సన్మాన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతుల ఆత్మాభిమానం పెంచేందుకు రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. రైతు పంట సాగు కోసం అప్పులు చేయకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే పెట్టుబడి అందిస్తున్నదన్నారు. ఇప్పటికే గతేడాది రెండు సీజన్లకు సంబంధించిన పెట్టుబడి డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈ సీజన్ నుంచి ఎకరానికి రూ.5 వేల చొప్పున వస్తుందని వెల్లడించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉన్నా యన్నారు.రైతులందరూ సబ్సిడీ ద్వారా లభించే విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని, దళారులు అమ్మే నకిలీ విత్తనాలకు మోసపోకూడదని అన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

వేగంగా కదులుతున్న నైరుతి

- వచ్చే 48 గంటల్లో ఓ మోస్తరు వానలు
- మళ్లీ పెరిగిన ఎండల తీవ్రత
- ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో అత్యధికంగా 44.4 డిగ్రీలు నమోదు
- హైదరాబాద్‌లో 38.6 డిగ్రీలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నైరుతి రుతుపవనాలు వేగంగా కదులుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. సోమవారంకల్లా దక్షిణ అరేబియా సముద్రం, లక్షదీవులు, కేరళ ప్రాంతాలకు పూర్తిగా విస్తరిస్తాయని చెప్పారు. రాగల 48 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో రుతుపవనాలు విస్తరించే వరకు ఉత్తర తెలంగాణలోని పలు చోట్ల వడగాడ్పులు వీస్తాయని అధికారులు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం చల్లబడ్డ వాతావరణం ఆదివారం మళ్లీ వేడెక్కింది. పగటి ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీల మేర పెరిగాయి. శనివారం ఒక్క ఆదిలాబాద్‌లో తప్ప చాలా ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలలోపు నమోదుకాగా, ఆదివారం చాలా జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. రాష్ట్రంలో అత్యధికంగా ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 44.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, సిద్దిపేటలో 44.3 డిగ్రీలు, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో 44 డిగ్రీలు, హైదరాబాద్‌లో 38.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉత్తర తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వడగాడ్పులు వీచాయి. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతోకూడిన వానలు కురిసినప్పటికీ వాతావరణం చల్లబడలేదు. మరోవైపు కరీంనగర్ జిల్లా కేశవపట్నానికి చెందిన బొజ్జ ఎల్లవ్వ (70), వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలం ముత్తోజిపేట శివారు కమలాపురానికి చెందిన మద్దికుంట్ల సులోచన (55), మడికొండకు చెందిన తంగెళ్ళపల్లి రవి (45) వడదెబ్బతో మృతిచెందారు.

24 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌కు వర్ష సూచన

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వర్షాల రాకతో గ్రేటర్ హైదరాబాద్‌లో వాతావరణం కొంత చల్లబడింది. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో రాగల 24 గంటల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురువొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ నెల 15 తర్వాత గ్రేటర్‌కు రుతుపవనాలు వచ్చే అవకాశం ఉన్నదని వెల్లడించారు. శనివారం 34 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, ఆదివారం కొంత పెరిగి 38.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. కనిష్ఠ ఉష్ణోగ్రత 27.2 డిగ్రీలుగా, గాలిలో తేమ 36 శాతంగా నమోదైందని అధికారులు వెల్లడించారు.

వైద్యుడి అవతారంలో సెక్యూరిటీ గార్డు

మయూరీసెంటర్ : ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన దవాఖానలో విధులు నిర్వహిస్తున్న ఓ సెక్యూరిటీ గార్డు వైద్యుడి అవతారమెత్తాడు. దవాఖానలో చికిత్స పొందుతున్న ఓ బాలింతకు సెలైన్ బాటిల్ ఎక్కించేందుకు కాన్‌లా పెట్టేశాడు. ఈ దృశ్యం చూసిన అక్కడే ఉన్న ఇతర రోగులు భయాందోళనకు గురయ్యారు. సుమారు 10 నిమిషాల పాటు సెక్యూరిటీ గార్డు అక్కడే ఉన్నా.. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అటువైపు చూడలేదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ చేపడతామని జిల్లా వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి వెంకటేశ్వర్లు తెలిపారు.

మాతా శిశు కేంద్రంలో రోగికి సెలైన్‌ను పెడుతున్న సెక్యూరిటీ సిబ్బంది

గోదావరిఖనిలో నైట్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొప్పుల, చిత్రంలో ఎమ్మెల్యే చందర్

నిరాశ్రయులకు అండగా టీఆర్ఎస్ ప్రభుత్వం

■ మంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని టౌన్: నిరాశ్రయులకు టీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని బస్టాండ్ సమీపంలో రామగుండం పురపాలక సంఘం నిర్మించిన నైట్ షెల్టర్లను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి ఆదివారం మంత్రి ప్రారంభించారు. పారిశ్రామిక ప్రాంతంలో ఎలాంటి ఆధారం లేని వ్యక్తులకు ఆశ్రయమిచ్చేందుకు నిర్మించిన ఈ నైట్ షెల్టర్ భవనాలు వృద్ధులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. గోదావరిఖని ప్రాంతంలో ఎక్కడ నిద్రించాలో కూడా తెలియని, రాత్రి నిద్రించే సౌకర్యాలు లేని వారిని గుర్తించి ఈ నైట్ షెల్టర్లను నిర్మించామని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు.

మంచిర్యాల జిల్లా దండేపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత చేపమందు పంపిణీకి విశేష స్పందన లభించింది. గ్రామానికి చెందిన మామిడిశెట్టి (రంగసాయి) ప్రేంరాజ్, భూలక్ష్మి దంపతులు చేపమందును పంపిణీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ , ఉమ్మడి కరీంనగర్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, ఒడిశా ప్రాంతాలకు చెందిన 10 వేల మంది అస్తమా బాధితులు చేప మందును తీసుకున్నారు. ఉదయం 5:30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం మధ్యాహ్నం వరకు కొనసాగింది. - దండేపల్లి

వైద్యుడి అవతారంలో సెక్యూరిటీ గార్డు

మయూరీసెంటర్ : ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన దవాఖానలో విధులు నిర్వహిస్తున్న ఓ సెక్యూరిటీ గార్డు వైద్యుడి అవతారమెత్తాడు. దవాఖానలో చికిత్స పొందుతున్న ఓ బాలింతకు సెలైన్ బాటిల్ ఎక్కించేందుకు కాన్‌లా పెట్టేశాడు. ఈ దృశ్యం చూసిన అక్కడే ఉన్న ఇతర రోగులు భయాందోళనకు గురయ్యారు. సుమారు 10 నిమిషాల పాటు సెక్యూరిటీ గార్డు అక్కడే ఉన్నా.. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అటువైపు చూడలేదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ చేపడతామని జిల్లా వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి వెంకటేశ్వర్లు తెలిపారు.

మాతా శిశు కేంద్రంలో రోగికి సెలైన్‌ను పెడుతున్న సెక్యూరిటీ సిబ్బంది

ఖమ్మంలో మాట్లాడుతున్న గౌరీశంకర్. చిత్రంలో సీఎం కార్యాలయం సీపీఆర్వో జ్వాలానర్సింహారావు

'ఖమ్మం పుస్తక ప్రదర్శన రాష్ట్రానికే ఆదర్శం'

రఘునాథపాలెం : రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు ఖమ్మం నగరంలో ప్రారంభించిన పుస్తక ప్రదర్శన మహోత్సవం రాష్ట్రానికే ఆదర్శమని హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు డాక్టర్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. ఆదివారం పుస్తక ప్రదర్శన ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. అనంతరం కవులను, రచయితలను, కళాకారులను సన్మానించారు. అధ్యాపకుడు, కాళోజీ అవార్డు గ్రహీత సీతారాంపై మారబత్తుల పెద్దన్న రాసిన 'అనగనగా..సీతారాం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఎం కార్యాలయం సీపీఆర్వో వనం జ్వాలానర్సింహారావు, అసిస్టెంట్ కలెక్టర్ హనుమంత్ కొడింబా, ట్రైనీ కలెక్టర్ ఆదర్శ్ సురభి, కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

భూవివాదంలో వ్యక్తి హత్యకు కుట్ర

- విచారణలోచోరీ కేసులు బహిర్గతం
- రూ.8 లక్షల ఆభరణాలు స్వాధీనం

పాల్వంచ: ఓ భూవివాదంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నల్లకుంటకు చెందిన సొడెం వెంకట్‌ను హత్య చేసేందుకు కుట్ర పన్నిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా విచారణలో పలు చోరీ కేసులు వెలుగులోకి వచ్చాయి. ఆదివారం పాల్వంచ డీఎస్పీ మధుసూదన్‌రావు వెల్లడించిన వివరాల మేరకు.. నల్లకుంట గ్రామానికి చెందిన సొడె వెంకట్‌కు దమ్మపేట మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ శేషగిరిరావు, గాదం వెంకటరాజు, పసుమర్తి ముక్తేశ్వరరావు, దార యుగేందర్‌లతో భూవివాదం నడుస్తున్నది. వెంకట్ అడ్డు తొలగించుకొనేందుకు వారు పథకం రచించారు. గతంలో తన వద్దకు వైద్యం కోసం వచ్చిన పలు కేసుల్లో జైలుకెళ్లిన పిల్లి వెంకటేశ్వరరావుతో వెంకట్ హత్యకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పిల్లి వెంకటేశ్వరరావు తన స్నేహితుడు కుప్పాల శ్రీను సాయంతో గతేడాది అక్టోబర్ 6న రాత్రి మోటారుసైకిల్‌పై స్వగ్రామానికి వస్తున్న వెంకట్‌పై కత్తితో దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటనలో వెంకట్ ప్రాణాలతో బయటపడి ప్రస్తుతం కోలుకుంటున్నాడు.

కేసు ఛేదించాలా..

ఇటీవల మహబూబాబాద్‌లో కొన్ని కేసుల విషయంలో 9 మంది నిందితులను అరెస్టు చేసి విచారించగా వెంకట్ హత్యాయత్నం ఉదంతంవెలుగులోకివచ్చింది.ఈ క్రమంలో పిల్ల వెంకటేశ్వరరావు, కుప్పాల శ్రీను పాల్పడ్డ చోరీల గురించి వివరాలు బయటపెట్టారు. వీరి వద్ద నుంచి తొమ్మిది కేసులకు సంబంధించిన రూ.8 లక్షలు విలువ చేసే 25 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి

- మృతుల్లో వైద్యుడు, ఆర్మీ జవాన్
- వనపర్తి జిల్లాలో అత్తాకోడండ్లు
- జనగామలో ఇద్దరు స్నేహితులు

నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం చెందారు. జనగామకు చెందిన ఎలిశెట్టి కరుణాకర్ (26), ఎర్రి రవికిరణ్‌రెడ్డి (23) సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో జరుగుతున్న వివాహానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో బచ్చన్నపేట మండలం మొండికుంట వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో వీరిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం అనంతనగర్‌కు చెందిన వైద్యుడు యాదగిరిరావు(37).. రగుడు శివారులోని సాయిమణికంఠ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఓ వివాహవేడుకకు హాజరై బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా.. సిరిసిల్ల-కరీంనగర్ రహదారిలో రంగినేని ట్రస్టు డివైడర్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా వెనక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన ఆర్మీ జవాన్ సోమ రాజశేఖర్ (38) హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు కారులో వస్తుండగా.. వంగూరు మండలం కోనేటిపూర్ టోల్‌ప్లాజా దగ్గర సిబ్బంది ఐడీ కార్డు చూపించాలని కోరగా.. కార్డు కనిపించలేదు. దీంతో కడ్తాల టోల్‌ప్లాజా దగ్గర మరిచిపోయినట్టు గమనించి కార్డు కోసం బయలుదేరాడు. ఈ క్రమంలో సర్వారెడ్డిపల్లి గేటు సమీపంలో మలుపు వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన వున్న చెట్టుకు ఢీకొట్టి పొలాల్లోకి వెళ్లింది. ఈ ప్రమాదంలో రాజశేఖర్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. రాజశేఖర్ ప్రస్తుతం సెలవులో ఉన్నారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని బుర్రవాగు స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అత్తా, కోడల్లు ప్రాణాలు వదిలారు. ఏపీలోని ప్రొద్దుటూర్‌కు చెందిన ఓ కుటుంబం కారులో హైదరాబాద్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో వారి కారు మోజర్ల సమీపంలోని జాతీయరహదారి-44 బుర్రవాగు స్టేజీవద్ద బ్రిడ్జిని వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో అత్తాకోడండ్లు లక్ష్మీదేవమ్మ(79), మాధవి భర్త మధుసూదన్‌రెడ్డి, కుమారుడు వంశీధర్‌రెడ్డి, కూతురు వర్షిణికి గాయాలయ్యాయి.

కరుణాకర్ (ఫైల్)

రవికిరణ్‌రెడ్డి (ఫైల్)

రాజశేఖర్ (ఫైల్)

యాదగిరిరావు (ఫైల్)

రెడ్డిపల్లిలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణంలో తాపీ మేస్త్రీగా సర్పంచ్ నర్సయ్య

సర్పంచే తాపీ మేస్త్రీగా..

వీణవంక: కరీంనగర్ జిల్లా వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామంలో పంచాయతీ భవనాన్ని నిర్మించేందుకు తాపీ మేస్త్రీలు ఎవరూ ముందుకు రాకపోవడంతో స్వయంగా సర్పంచ్ నర్సయ్య రంగంలోకి దిగి మేస్త్రీపనిచేస్తూ భవనాన్ని నిర్మిస్తున్నాడు. నర్సయకు గతంలో తాపీ మేస్త్రీ పనిచేసిన అనుభవమున్నది. సర్పంచే పంచాయతీ భవనాన్ని నిర్మించడం పట్ల గ్రామస్థులు అభినందిస్తున్నారు.

హాంకాంగ్‌లో మిలియన్ మార్చ్

చైనా తెస్తున్న నిందితుల అప్పగింత చట్టాన్ని వ్యతిరేకిస్తూ.. హాంకాంగ్ వీధుల్లో ఆదివారం 13 లక్షల మంది నిరసనకారులు భారీ ర్యాలీని నిర్వహించారు. ఎర్రటి ఎండను కూడా లెక్కచేయకుండా.. దిక్కులు పిక్కటిల్లేలా ఈ బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఎన్డీఏతో జేడీయూ కటీఫ్!

బీహార్ మినహా ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో సోలో పోటీకే నిర్ణయం

పాట్నా, జూన్ 9: కేంద్ర క్యాబినెట్‌లో ఒకటే బెర్త్ ఇస్తామన్న బీజేపీతో విభేదించి.. కేంద్ర మంత్రివర్గంలో చేరకూడదని నిర్ణయం తీసుకున్న ఎన్డీఏ భాగస్వామ్య పార్టీ జనతాదళ్(యునైటెడ్) మరో కీలక నిర్ణయం తీసుకున్నది. బీహార్ మినహా ఇతర రాష్ట్రాల్లో ఎన్డీఏతో పొత్తు పెట్టుకోబోమని ఆ పార్టీ ప్రకటించింది. ఆదివారం నాడు జేడీయూ జాతీయ కార్యవర్గ సమావేశం పాట్నాలో జరిగింది. బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్ ఈ సమావేశానికి నేతృత్వం వహించారు. 'బీహార్ వెలుపల ఎన్డీఏతో మాపార్టీ భాగస్వామ్యం ఉండదు. త్వరలో జరుగనున్న జమ్ముకశ్మీర్, జార్ఖండ్, హర్యానా, ఢిల్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీకి దిగుతాం' అని జేడీయూ ప్రధాన కార్యదర్శి కేసీ త్యాగి తెలిపారు. 2020లోపు జేడీయూకు

పార్టీ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్‌తో జేడీయూ అధినేత, బీహార్ సీఎం నితీశ్

జాతీయ పార్టీ హోదా వచ్చేలా కృషి చేస్తామన్నారు. 2020లో జరిగే బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏతో కలిసే పోటీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కిషోర్, కీలక నేతలు రామ్ చంద్ర ప్రసాద్ సింగ్, బశిష్ట నారాయణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సుఖోయ్‌కి బ్రహ్మాస్త్రం!

బ్రహ్మోస్ క్షిపణి అనుసంధాన పనులు వేగవంతం

న్యూఢిల్లీ, జూన్ 9: బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను 40 సుఖోయ్ యుద్ధ విమానాలకు అనుసంధానించే ప్రక్రియను వేగవంతం చేయాలని భారత్ నిర్ణయించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పుల్వామా ఉగ్రదాడి అనంతరం పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత్ వైమానిక దాడులకు దిగడం, అనంతరం పాక్ భారత సైనిక కేంద్రాలపై దాడికి యత్నించిన పరిణామాల నేపథ్యంలో ఆరు వారాల కిందట ఈ వ్యూహాత్మక ప్రాజెక్టు అమలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు సమాచారం. ప్రభుత్వరంగ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), ఇండో-రష్యా జాయింట్ వెంచర్ అయిన బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్(బీఏపీఎల్) సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. భారత వాయుసేన అవసరాల నేపథ్యంలో ఈ ప్రాజెక్టును వేగవంతం చేశారు. షెడ్యూల్ గడువైన 2020 డిసెంబర్ కంటే చాలా ముందుగానే ఇది పూర్తయ్యే అవకాశం ఉన్నదని అధికార వర్గాలు తెలిపాయి. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి అయిన బ్రహ్మోస్‌ను సుఖోయ్ యుద్ధ విమానంతో అనుసంధానించడం వల్ల వాయుసేనకు వ్యూహాత్మక శక్తి సామర్థ్యాలు పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తున్నది. బాలాకోట్ దాడులపై సమీక్ష సందర్భంగా మన వద్ద సుపీరియర్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఉండుంటే శత్రుదేశం మనపై దాడికి పాల్పడే సాహసం చేసి ఉండేది కాదన్న అభిప్రాయం వ్యక్తమైందని సమాచారం.

బెంగాల్ హింసపై కేంద్రం సీరియస్

శాంతి భద్రతలు కాపాడాలని హెచ్చరిక
హింసపై నివేదిక ఇవ్వాలని రాష్ట్రానికి ఆదేశం
టీఎంసీ, బీజేపీ ఘర్షణల్లో ఐదుగురు కార్యకర్తలు మృతి
నేడు ప్రధానిని కలువనున్న బెంగాల్ గవర్నర్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో కొనసాగుతున్న రాజకీయ హింసపై కేంద్రం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన ప్పటికీ రాష్ట్రంలో హింస కొనసాగుతుండడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంలా కనిపిస్తున్నదని మండిపడింది. కేంద్ర హోంశాఖ ఆదివారం ఒక హెచ్చరిక జారీ చేస్తూ రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో భయాందోళనలు తొలగించాలని ఆదేశించింది. అలాగే శనివారం నాటి హింసాత్మక ఘటనలపై నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. అయితే రాష్ట్రంలో పరిస్థితి అదుపులోనే ఉందని, హింసాత్మక ఘటనలపై తగిన చర్యలు తీసుకున్నామని ఆదివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. మరోవైపు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా బ్లాక్ డేగా పాటించాలని బీజేపీ నిర్ణయించింది.

కొనసాగుతున్న హింస

పశ్చిమబెంగాల్లో హత్యా రాజకీయాలు కొనసాగుతూనే ఉన్నాయి. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), బీజేపీ వర్గాల మధ్య ఘర్షణలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. రాష్ట్రంలోని ఉత్తర 24 పరగణాల జిల్లా సందేశ్‌ఖలి పరిధిలో శనివారం సాయంత్రం ఇరు పార్టీల కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణల్లో కనీసం ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. పలువురి ఆచూకీ గల్లంతైంది. మృతుల్లో ఇద్దరు బీజేపీ, ఒకరు టీఎంసీకి చెందినవారిగా గుర్తించారు. అయితే మృతుల సంఖ్యపై రెండు పార్టీలూ తలోమాట చెబుతున్నాయి. పోలీసులు కూడా దీనిపై స్పష్టత ఇవ్వడంలేదు. తృణమూల్ ర్యాలీ సందర్భంగా బీజేపీకి చెందిన జెండాలను తృణమూల్ కార్యకర్తలు తొలిగించే క్రమంలో ఇరు పార్టీల మధ్య వివాదం చెలరేగి ఘర్షణలకు దారితీసినట్టు స్థానికులు చెబుతున్నారు.

ఐదుగురు కార్యకర్తలు హతం!

శనివారం రాత్రి ముగ్గురి మృతదేహాలను దవాఖానకు తీసుకొచ్చినట్టు బషిర్హత్ దవాఖాన చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ముఖర్జీ తెలిపారు. వారిని సుకంత మండల్, ప్రదీప్ మండల్, కయూమ్ మొల్లాగా గుర్తించారు.

తమపార్టీ కార్యకర్తల మృతదేహాలను కోల్‌కతాకు తరలిస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదానికి దిగిన బీజేపీ కార్యకర్తలు

సుకంత, ప్రదీప్ బీజేపీకి చెందినవారు కాగా, కయూమ్ టీఎంసీకి చెందిన కార్యకర్త. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయంతన్ బసు మాట్లాడుతూ.. తమ పార్టీకి చెందిన సుకంత, ప్రదీప్, శంకర్ మండల్‌ను టీఎంసీ కార్యకర్తలు హతమార్చారని ఆరోపించారు. మరోవైపు తమ పార్టీకి చెందిన కయూమ్‌ను బీజేపీ కార్యకర్తలు హత్యచేశారని రాష్ట్ర మంత్రి జ్యోతిప్రియో మల్లిక్ పేర్కొన్నారు. శంకర్ మండల్, దేవదాస్ మండల్ కనిపించకుండా పోయారని స్థానిక బీజేపీ నేతలు చెబుతున్నారు. అయితే మృతుల సంఖ్యపై పోలీసులు మౌనం వహిస్తున్నారు. ఘర్షణలు చోటుచేసుకున్న న్యాజత్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భంగిపారా గ్రామంలో పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. న్యాజత్‌లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. దాడులకు నిరసనగా బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టింది. కోల్‌కతాలో 65 మందిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

నేడు ప్రధానిని కలువనున్న గవర్నర్..

రాష్ట్రంలో హింసాత్మక ఘటనల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ కేసరీనాథ్ త్రిపాఠి సోమవారం ప్రధాని నరేంద్రమోదీని కలువనున్నారు. రెండోసారి ప్రధానిగా ఎన్నికైన నేపథ్యంలో శుభాకాంక్షలు తెలిపేందుకు మాత్రమే మోదీని కలువనున్నట్టు గవర్నర్ చెప్పారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై వివరించేందుకు తాను ప్రధానిని కలువనున్నట్టు మీడియాలో వచ్చిన కథనాలను ఆయన ఖండించారు. మరోవైపు గవర్నర్‌పై ముఖ్యమంత్రి మమతాబెనర్జీ మండిపడ్డారు. 'గవర్నర్ గిరీ అనేది రాజ్యాంగ బద్ధమైన పదవి. నేను ప్రజలచేత ఎన్నుకోబడ్డాను. ఆయన(గవర్నర్) నన్ను ఎన్నోసార్లు భయభ్రాంతులకు గురిచేశారు. ఆయన బీజేపీకి అధ్యక్షుడిగా ప్రవర్తిస్తున్నారు' అని మమత గవర్నర్ కేసరీనాథ్‌పై విమర్శలు గుప్పించారు.

మృతదేహాలను అడ్డుకున్న పోలీసులు

ఆదివారం బీజేపీ తమ పార్టీకి చెందిన ఇద్దరు కార్యకర్తల మృతదేహాలను బషిర్హాత్ నుంచి కోల్‌కతాలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలించాలని ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. తమ పార్టీ కార్యకర్తలను హత్య చేసినప్పుడు అడ్డుకోని పోలీసులు.. ఇప్పుడు మృతదేహాలను మాత్రం అడ్డుకుంటున్నారని బీజేపీ బెంగాల్ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ ఘోష్ మండిపడ్డారు. ఒకనొక దశలో హైవేపైనే అంత్యక్రియలు నిర్వహించేందుకు బీజేపీ నేతలు సిద్ధపడ్డారు. అనంతరం ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. మృతదేహాలను వారి స్వగ్రామానికి తరలించారు.

బాలికపై లైంగిక దాడి.. హత్య

సకాలంలో స్పందించని ఆరుగురు పోలీసుల సస్పెన్షన్

భోపాల్: ఓ వైపు ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో చిన్నారి దారుణ హత్యపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతుండగా మరోవైపు మధ్యప్రదేశ్‌లో జరిగిన ఇలాంటి ఘటన కలకలం రేపుతున్నది. భోపాల్‌లోని మురికివాడకు చెందిన 8 ఏండ్ల బాలిక శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యం కాగా ఆదివారం డ్రైనేజీలో ఆమె మృతదేహం లభ్యమైంది. కాగా బాలికపై లైంగికదాడి చేసి అనంతరం గొంతునులిమి హత్యచేసినట్లు పోస్ట్‌మార్టమ్ నివేదికలో వెల్లడైంది. దీంతో ఆమె తల్లిదండ్రులతో పాటు స్థానికులు దవాఖానతో పాటు కమలానగర్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. తమ కుమార్తె కనిపించకపోవడంపై వెంటనే ఫిర్యాదు చేశామని, అయితే పోలీసులు పట్టించుకోకపోగా తమ ఇంటికి వచ్చి టీ, గుట్కా అడిగారని వారు ఆరోపించారు. ఈ ఘటనపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఆరుగురు పోలీసులను సస్పెండ్ చేసింది.

మధ్యప్రదేశ్‌లో గిరిజన యువతిపై లైంగికదాడి

కోటా: రాజస్థాన్‌కు చెందిన గిరిజన యువతిపై మధ్యప్రదేశ్‌లో లైంగికదాడి జరిగింది. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని గుణా పట్టణంలో జరిగింది. రాజస్థాన్‌లోని బరాన్ జిల్లాకు చెందిన నలుగురు కంజార్ తెగకు చెందిన యువతులు ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం సమీపంలో ఉన్న గుణా పట్టణానికి వచ్చారు. కార్యక్రమం ముగిసిన తర్వాత తిరిగి రాజస్థాన్ వెళ్లేందుకు స్థానిక బస్టాండ్‌కు రాగా.. ఇద్దరు యువకులు వాహనాలపై వచ్చి ఇద్దరు యువతులను బలవంతంగా సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. ఒకరిపై లైంగికదాడికి పాల్పడిన అనంతరం రుతియాయి రైల్వేస్టేషన్ వద్ద పడేసి వెళ్లిపోయారు. యువతి ఆరోగ్యం క్షీణించడంతో స్థానిక దవాఖానలో చేర్పించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. పంకజ్ కలాల్ అనే వ్యక్తి తన సోదరిపై లైంగికదాడి చేసి విషపదార్థం ఇచ్చినట్టు మృతురాలు సోదరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంబులెన్స్, ట్రక్ ఢీ.. 8 మంది మృతి

పాలక్కాడ్: కేరళలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 మంది మృతిచెందగా పలువురు గాయపడ్డారు. ఆదివారం పాలక్కాడ్ జిల్లాలో 12 మందితో ప్రయాణిస్తున్న ఓ అంబులెన్స్ చేపల లోడ్‌తో వెళ్తున్న ట్రక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో అంబులెన్స్ డ్రైవర్‌తోపాటు అందులోని మరో ఏడుగురు చనిపోగా మిగతా వారు గాయపడ్డారు. మృతిచెందిన వారిలో కొందరు ఉదయం విహార యాత్రకు వెళ్తూ చిన్న ప్రమాదానికి గురయ్యారు. దీంతో వారిని మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రభుత్వ దవాఖానకు అంబులెన్స్‌లో తరలిస్తుండగా ఈ ఘటన జరిగింది.

గురుకులాల పనితీరు భేష్

- అభినందించిన కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎంబీబీఎస్, బీడీఎస్‌లో ఉత్తమ పనితీరును కనబర్చిన సాంఘిక సంక్షేమ, గిరిజన గురుకులాలపై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. ఆదివార ఓ ట్వీట్లో ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. 'ఎంబీబీఎస్, బీడీఎస్‌లో 2012లో దాదాపు 10 సీట్లు సాధించిన సాంఘిక సంక్షేమ, గిరిజన గురుకులాలు ఈ ఏడాది 150 సీట్లు సాధించడం అభినందనీయం. ఈ మేరకు కృషి చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, సంస్థ బాధ్యులైన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులకు నా అభినందనలు' అని కేటీఆర్ పేర్కొన్నారు.

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎమ్మార్పీఎస్ నేతలు

మాదిగల డిమాండ్లు నెరవేర్చాలి

ముషీరాబాద్, నమస్తే తెలంగాణ: మాదిగల డిమాండ్లను నెరవేర్చాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు టీఎమ్మార్పీఎస్ ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించింది. టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆదివారం ప్రగతిభవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు చెప్పుడప్పు వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలని, గురుకుల విద్యాసంస్థలను బలోపేతం చేయాలని, జిల్లాకు ఒక బాలుర డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలని, ఎస్సీ కార్పొరేషన్‌ను ఎస్సీ డెవలప్‌మెంట్ అండ్ ట్రేడింగ్ కార్పొరేషన్‌గా మార్చాలని కోరారు.

గీత కార్మికులకు సీఎం కేసీఆర్ ప్రోత్సాహం

త్వరలో ప్రయోగాత్మకంగా నీరా ప్రాజెక్టు ■ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడి

హైదరాబాద్/ హైదరాబాద్ సిటీ బ్యూరో, నమస్తే తెలంగాణ: గీత కార్మికులను సీఎం కేసీఆర్ ఎంతో ప్రోత్సహిస్తున్నారని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. హిమాయత్‌నగర్‌లోని గౌడ విద్యార్థి వసతి గృహంలో ఏర్పాటుచేసిన సోలార్ పవర్ సిస్టమ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. గౌడ సంఘం కార్యాలయంలో రాష్ట్రస్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నీరా ప్రాజెక్టును రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఐదు ప్రాంతాలను గుర్తించామని తెలిపారు. కేరళ తరహాలో నీరా విక్రయ కేంద్రాలను హైదరాబాద్‌లో ఏర్పాటుచేస్తామని శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు.

గౌడ సంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఇంజినీరింగ్‌లో 4 కొత్త కోర్సులు

- ప్రైవేటు కాలేజీల దరఖాస్తు అఫిలియేషన్‌పై జేఎన్టీయూ కసరత్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో 2019-20 విద్యాసంవత్సరానికి ఇంజినీరింగ్‌లో కొత్తగా నాలుగు (కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, ఐటీ అండ్ ఇంజినీరింగ్, ఐటీ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్) కోర్సులకు ఏఐసీటీఈ అనుమతులు మంజూరు చేసింది. ఈ కోర్సులను ప్రారంభించేందుకు నాలుగు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు దరఖాస్తు చేసుకున్నాయని జేఎన్టీయూహెచ్ వైస్ చాన్సలర్ ఏ వేణుగోపాలరెడ్డి తెలిపారు.

ప్రొఫెసర్ పోస్టులకు త్వరలో నోటిఫికేషన్

జేఎన్టీయూహెచ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేటెడ్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఈ నెలాఖరులోగా నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు వీసీ వెల్లడించారు. ఎన్నికల కోడ్ ఉన్నందువల్ల వీటిని భర్తీ చేయలేదని, ఇప్పుడు ఆ ప్రక్రియను ప్రారంభిస్తామని వీసీ వివరించారు.

బాలుర హవా

జేఎన్టీయూహెచ్‌లో ఆదివారం తెలంగాణ ఎంసెట్-2019 ఫలితాలను వెల్లడిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తదితరులు

మొదటిపేజీ తరువాయి...

సాధించినవారు 145 మంది, 81 నుంచి 120 మధ్య మార్కులు సాధించినవారు 4,198 మంది, 40 నుంచి 80 మధ్య మార్కులు సాధించినవారు 98,203 మంది ఉన్నారు. అగ్రికల్చర్ విభాగంలో ఇంటర్మీడియట్ బోర్డు నుంచి 67,785 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారిలో 8,421 మంది ఫెయిలయ్యారు. అర్హత సాధించిన 59,364 మంది విద్యార్థుల్లో 121-160 మధ్య మార్కులు సాధించినవారు 544 మంది, 81 నుంచి 120 మార్కులు సాధించినవారు 10,544 మంది, 40 నుంచి 80 మార్కులు సాధించినవారు 48,973 మంది ఉన్నారు.

సత్తా చాటిన ప్రభుత్వ జూనియర్ కాలేజీలు..

ఇంజినీరింగ్ విభాగ పరీక్షలకు ప్రభుత్వ జూనియర్ కాలేజీల నుంచి హాజరైన 7,960 మంది విద్యార్థుల్లో 6,737 మంది, కేంద్రీయ విద్యాలయాల నుంచి హాజరైన 463 మందిలో 401 మంది, జవహర్ నవోదయ విద్యాలయాల నుంచి హాజరైన 263 మందిలో 237 మంది, డీఆర్డీఏ కార్పొరేట్ పథకం కింద హాజరైన 482 మందిలో 424 మంది అర్హత సాధించగా.. ప్రైవేటు జూనియర్ కాలేజీల నుంచి హాజరైన 1,22,041 మంది విద్యార్థుల్లో 1,00,414 మంది అర్హత సాధించారు. అలాగే అగ్రికల్చర్, ఫార్మసీ విభాగ పరీక్షలకు ప్రభుత్వ జూనియర్ కాలేజీల నుంచి హాజరైన 9,886 మంది విద్యార్థుల్లో 9,055 మంది, కేంద్రీయ విద్యాలయాల నుంచి హాజరైన 212 మందిలో 203 మంది, జవహర్ నవోదయ విద్యాలయాల నుంచి హాజరైన 182 మందిలో 180 మంది, డీఆర్డీఏ కార్పొరేట్ స్కీమ్ ద్వారా హాజరైన 468 మందిలో 442 మంది అర్హత సాధించగా.. ప్రైవేటు జూనియర్ కాలేజీల నుంచి హాజరైన 57,802 మంది విద్యార్థుల్లో 53,878 మంది అర్హత సాధించారు.

సమస్యలేకుండా ఫలితాల విడుదల

ఇంటర్ ఫలితాలపై ఏర్పడిన గందరగోళం వల్ల ఎంసెట్ ఫలితాలను వాయిదా వేయాల్సి వచ్చిందని, అయినప్పటికీ ఎలాంటి సమస్యలు లేకుండా ఎంసెట్ ఫలితాలను విడుదల చేశామని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. వాస్తవానికి మే 20 నాటికే తాము ఈ ఫలితాల విడుదలకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. శుక్రవారం మధ్యాహ్న ఇంటర్ బోర్డు నుంచి ఎంసెట్ కన్వీనర్‌కు ఇంటర్ ఫలితాల సీడీ అందిన నేపథ్యంలో ఆదివారం ఫలితాలు విడుదల చేయడానికి ఎంసెట్ అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకున్నారని, ఈ విషయంలో ఎంసెట్ చైర్మన్, కన్వీనర్‌తోపాటు కమిటీ సభ్యులను అభినందిస్తున్నామని తెలిపారు.

ఈ నెల 20 తర్వాత కౌన్సెలింగ్

రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం ఈ నెల 20 తర్వాత ఎంసెట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు పాపిరెడ్డి వెల్లడించారు. అప్పటికి రాష్ట్రంలో యూనివర్సిటీల నుంచి అఫిలియేషన్ పొందిన మొత్తం ఇంజినీరింగ్ కాలేజీలు, వాటిలోని కోర్సులు, సీట్ల వివరాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఇప్పటివరకు జేఎన్టీయూహెచ్ పరిధిలోని 156 ఇంజినీరింగ్ కాలేజీల్లో దాదాపు 77,500 సీట్లకు అఫిలియేషన్ ఇచ్చామని, గత ఏడాదితో పోల్చితే ఈసారి ఇంజినీరింగ్ సీట్ల సంఖ్య దాదాపు 8 వేల వరకు తగ్గిందని జేఎన్టీయూహెచ్ వైస్ చాన్సలర్ వేణుగోపాలరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యా విధానాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా.. ప్రమాణాలను పాటించని కొన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో కొన్ని కోర్సులకు అఫిలియేషన్లు ఇవ్వలేదని, టీచింగ్ ఫ్యాకల్టీని బట్టి కోర్సులు, సీట్లవారీగా అఫిలియేషన్లు ఇచ్చామని ఆయన వివరించారు.

ఇంజినీరింగ్ విభాగంలో..		అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో..	
పరీక్ష రాసిన విద్యార్థులు	1,31,209	పరీక్ష రాసిన విద్యార్థులు	68,550
అర్హులైన విద్యార్థులు	1,08,213	అర్హులైన విద్యార్థులు	63,758
ర్యాంకు సాధించినవారు	91,446	ర్యాంకు సాధించినవారు	57,774
అర్హులు కానివారు	13,251	అర్హులు కానివారు	4,194
వివరాలులేని విద్యార్థులు	3,491	వివరాలులేని విద్యార్థులు	1,790

ఐఐటీ బాంబేలో చదువాలనుంది..

ఎంసెట్ ఇంజినీరింగ్‌లో మూడోర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉన్నది. మంచి ర్యాంకు వస్తుందనుకున్నా.. కానీ, టాప్‌లో నిలుస్తానని ఊహించలేదు. ఈ విజయాన్ని నా తల్లిదండ్రులు, ఇన్‌స్టిట్యూట్‌కి అంకితమిస్తున్నా. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో మంచి ర్యాంకు కోసం ప్రయత్నిస్తా. ఐఐటీ బాంబేలో సీఎస్ఈ కోర్సు చేయాలని ఉన్నది. - జిల్లెల్ల ఆకాశ్‌రెడ్డి

(మార్కులు 145.5028, ర్యాంకు 3)

ఎంసెట్ టాపర్లు ఏమన్నారు..

అమ్మ టైలరింగ్ చేస్తూ చదివిస్తున్నది..

నాకు నాన్న లేరు. అమ్మ టైలరింగ్ చేస్తూ కష్టపడి చదివిస్తున్నది. ఎంసెట్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీలో మొదటిర్యాంకు సాధించడంపై మా కుటుంబం ఎంతో సంతోషంగా ఉన్నది. ఎంబీబీఎస్ పూర్తిచేసి ఎండీ చేయాలన్నదే నా లక్ష్యం. డాక్టర్‌గా జీవితంలో మంచిస్థానానికి ఎదిగి ప్రజలకు సేవ చేయాలనుకుంటున్నా.

- ఎంపతి కుశ్వంత్

(మార్కులు 155.9766, ర్యాంకు 1)

మెడికల్ రిసెర్చే లక్ష్యం..

ఎంసెట్‌లో 5వ ర్యాంకు వస్తుందని ఊహించలేదు. చాలా ఎగ్జైటింగ్‌గా ఉన్నది. నీట్, జీఎమ్‌ఆర్, ఎయిమ్స్‌లో సీటు కొట్టడంపైనే దృష్టి పెట్టాలనుకుంటున్నా. ఎయిమ్స్‌లో చేరి మెడికల్ రిసెర్చ్ చేయడమే లక్ష్యం. - ఆరె అక్షయ్

(మార్కులు151.7756, ర్యాంకు 5)

డాక్టర్ కావడమే జీవితాశయం..

ఎంసెట్‌లో 7వ ర్యాంకు సాధించడం ఎంతో ఆనందంగా ఉన్నది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతోనే మంచి ర్యాంకు సాధ్యమైంది. డాక్టర్ కావడమే నా జీవితాశయం.

- బుర్రా శివాని శ్రీవాస్తవ

(మార్కులు 150.5655, ర్యాంకు 7)

న్యూరో సర్జన్ కావడమే ధ్యేయం..

చిన్నప్పటి నుంచి అన్ని విషయాల్లో తల్లిదండ్రులు నాకు మద్దతుగా నిలిచారు. పరీక్షల కోసం చాలా కష్టపడి ప్రిపేర్ అయ్యాను. ఎంసెట్‌లో 10వ ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉన్నది. ఎంబీబీఎస్ పూర్తిచేసిన తర్వాత న్యూరో సర్జన్ లేదా న్యూరో సైంటిస్ట్ కావాలన్నదే నా ధ్యేయం.

- తిప్పరాజు హసిత

(మార్కులు 148.9265, ర్యాంకు 10)

తల్లిదండ్రుల సహకారంతోనే ర్యాంకు సాధించా

తల్లిదండ్రుల సహకారం, టీచర్ల ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధ్యమైంది. చాలా సంతోషంగా ఉన్నది. చిన్నప్పటి నుంచి ఒకే ఇన్‌స్టిట్యూషన్‌లో చదువడం కూడా మంచి ర్యాంకు సాధించేందుకు కారణమైంది. ఐఐటీలో సీఎస్ఈ కోర్సు చేయడమే నా లక్ష్యం.

- బీ సాయివంశీ

(మార్కులు 142.7849, ర్యాంకు 6)

కొత్త సాఫ్ట్‌వేర్ కనిపెడుతా..

ఎంసెట్ టాప్ ర్యాంకు తెచ్చుకోవడానికి చాలా కష్టపడి చదివా. చాలా సంతోషంగా ఉన్నది. ఇంజినీరింగ్ పూర్తిచేసిన తర్వాత ప్రజలకు ఉపయోగపడే కొత్త సాఫ్ట్‌వేర్‌ను కనిపెడుతా.

- పీ వేదప్రణవ్

(మార్కులు 139.9550, ర్యాంకు 9)

ఇంజినీరింగ్ టాపర్లు

బట్టెపాటి కార్తికేయ	గోర్తి భానుదత్తా	బీ సాయివంశీ	సూరపనేని సాయివిజ్ఞ	గౌరిపెద్ది హితేంద్రకశ్యప్	పీ వేదప్రణవ్	అప్పకొండ అభిజిత్‌రెడ్డి
ర్యాంక్ : 4	ర్యాంక్ : 5	ర్యాంక్ : 6	ర్యాంక్ : 7	ర్యాంక్ : 8	ర్యాంక్ : 9	ర్యాంక్ : 10
రంగారెడ్డి, తెలంగాణ.	పశ్చిమ గోదావరి, ఏపీ.	రంగారెడ్డి, తెలంగాణ.	రంగారెడ్డి, తెలంగాణ.	ప్రకాశం, ఏపీ.	రంగారెడ్డి, తెలంగాణ.	రంగారెడ్డి, తెలంగాణ

సియాచిన్‌లో గడ్డకట్టుకుపోయిన పండ్ల రసాన్ని చూపుతున్న జవాన్

సుత్తితో కొట్టినా గుడ్డు పగలదు

పెద్ద ఐస్‌క్యూబ్‌లా జ్యూస్.. రాళ్లమాదిరిగా టమాటాలు, ఆలుగడ్డలు

సియాచిన్‌లో మైనస్ 60 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు

గడ్డకట్టుకుపోతున్న జవాన్ల ఆహారం

న్యూఢిల్లీ, జూన్ 9: సుత్తితో కొట్టినా కోడిగుడ్డు పగలదు.. జ్యూస్ మొత్తం గడ్డకట్టుకుపోయి ఐస్‌క్యూబ్‌లా మారిపోతుంది.. ఇక టమాటాలు, ఆలుగడ్డలు, ఉల్లిగడ్డలు వంటివి రాళ్లలాగా గట్టిపడిపోతున్నాయి.. వాటిని కోయాలంటే చెట్ల కొమ్మలను నరికినట్టు నరుకాల్సిందే. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన, అత్యంత శీతలప్రాంతంలోని సైనిక కేంద్రంగా రికార్డు సృష్టించిన సియాచిన్‌లోని ప్రస్తుత పరిస్థితి. దేశ రక్షణ కోసం మన సైనికులు పడుతున్న కష్టానికి నిదర్శనం.. సైన్యంపై అనుచిత వ్యాఖ్యలు చేసేవారికి చెంపపెట్టు. హిమాలయ శ్రేణుల్లో.. సముద్రమట్టానికి 20వేల అడుగుల ఎత్తున ఉన్న సియాచిన్‌లో ప్రస్తుతం ఉష్ణోగ్రతలు మైనస్ 60 డిగ్రీలకు పడిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో తాము ఎలాంటి జీవనం గడుపుతున్నాం? ప్రతి క్షణం ఎలాంటి సవాళ్లు ఎదుర్కొంటున్నామో వివరించేలా నలుగురు జవాన్లు కలిసి ఓ వీడియోను రూపొందించారు. ఇందులో జవాన్లు తాము తెచ్చుకున్న ఆహారం పరిస్థితిని వివరించారు. ఓ జవాన్ తన వెంటతెచ్చుకున్న జ్యూస్ ప్యాకెట్ మూతను తెరువడానికి ప్రయత్నించినా రాలేదు. దీంతో చుట్టూ ఉన్న ప్యాక్‌ను తొలిగించి చూడగా జ్యూస్ మొత్తం గడ్డకట్టి ఇటుక మాదిరిగా మారిపోయింది. సుత్తితో కొట్టినా విరుగనంత గట్టిపడింది. వారికి సరఫరా చేసిన కోడిగుడ్లు, కూరగాయలదీ ఇదే పరిస్థితి. అక్కడి చలికి గుడ్డులోని సొన, కూరగాయల్లోని నీటి శాతం పూర్తిగా గడ్డకట్టుకుపోయింది. కోడి గుడ్డును నేలకేసి కొట్టగా.. అది పగలకపోగా, బంతి మాదిరిగా ఎగిరింది. సుత్తితో కొట్టినా ఆ గుడ్డు పగలలేదు. ఆలుగడ్డలు, ఉల్లిగడ్డలు, టమాటలు సైతం సుత్తితో కొట్టినా ముక్కలు కాలేదు. ఒక పెద్ద కత్తితో చెట్ల కొమ్మలను నరికినట్టుగా నరికితే.. అవి ముక్కలయ్యాయి. దీనిని బట్టే అక్కడ ఉష్ణోగ్రతలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

కోడి గుడ్డును సుత్తితో కొడుతున్న జవాన్లు

1000 మంది మాల్దీవుల సివిల్ సర్వెంట్లకు భారత్ శిక్షణ

న్యూఢిల్లీ, జూన్ 9: మాల్దీవులకు చెందిన 1000 మంది సివిల్ సర్వీసెస్ అధికారులకు భారత్ శిక్షణ ఇవ్వనుంది. ఇందుకు సంబంధించి ప్రధాని మోదీ మాల్దీవుల పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం రానున్న ఐదేండ్లలో దాదాపు 1000 మంది మాల్దీవుల సివిల్ సర్వెంట్లకు భారత్ శిక్షణ ఇవ్వనుంది. ఇందుకోసం భారత్‌కు చెందిన సివిల్ సర్వీసెస్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూషన్ 'నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎన్‌సీజీజీ)' నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. శిక్షణకు అయ్యే ఖర్చు భారత ప్రభుత్వమే భరిస్తుంది.

'ఎవరెస్ట్' సవాళ్లు!

మృతదేహాలను గుర్తుపట్టడంలో నేపాల్ అధికారుల అవస్థలు

కఠ్మాండూ, జూన్ 9: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడంలో విఫలమై ప్రాణాలు కోల్పోయిన వారి మృతదేహాలను గుర్తించడంలో నేపాల్ అధికారులకు సవాళ్లు ఎదురవుతున్నాయి. ఎవరెస్ట్ పర్వతాన్ని శుద్ధి చేసేందుకు నేపాల్ ప్రభుత్వం రెండు నెలల పాటు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం సందర్భంగా 11 టన్నుల చెత్తతో పాటు నాలుగు మృతదేహాలను వెలికితీసిన సంగతి తెలిసిందే. మృతదేహాల అవశేషాలను కఠ్మాండూలో భద్రపరిచారు. వారి పేర్లను గుర్తించడంలో సవాళ్లు ఎదురవుతున్నాయని పోలీసులు, ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. డీఎన్‌ఏ శాంపిల్స్ సేకరించాలని వైద్యులను ఆదేశించామని, ఎవరైనా కుటుంబ సభ్యులు ముందుకు వస్తే, డీఎన్ ఏని సరిపోల్చి మృతదేహాలను అప్పగిస్తామని సీనియర్ పోలీస్ అధికారి ఫణీంద్ర ప్రసాయి తెలిపారు. 1920లో ఎవరెస్ట్ పర్వతారోహణ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 300 మందికి పైగా ప్రాణాలు కోల్పోయి ఉంటారని అంచనా. 1924లో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించే క్రమంలో తప్పిపోయిన బ్రిటిష్ పర్వతారోహకుడు జార్జ్ మల్లోరీ మృతదేహాన్ని 1999లో గుర్తించారు. అతడి సహచరుడు ఆండ్రూ ఇర్విన్ మృతదేహం ఇప్పటికీ లభించలేదు. కాగా నేపాల్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా ఎవరెస్ట్‌పై రద్దీ పెరిగి ఈ సీజన్‌లో ఎక్కువ మరణాలు సంభవించాయని పర్వతారోహకులు ఆరోపిస్తున్నారు. సరైన అనుభవం లేని వారు ఎక్కువగా ఉండడం కూడా మరణాలకు కారణమంటున్నారు.

కోజికోడ్‌లో నర్సు రాజమ్మను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటున్న రాహుల్ గాంధీ

తనను ఎత్తుకున్న నర్సును..

ఆప్యాయంగా హత్తుకున్న రాహుల్

కేరళ వయనాడ్‌లో రిటైర్డ్ నర్సును కలిసిన కాంగ్రెస్ అధ్యక్షుడు

నాటి జ్ఞాపకాలను రాజమ్మ ద్వారా తెలుసుకున్న యువనేత

కోజికోడ్/తిరువనంతపురం: తాను పుట్టగానే చేతుల్లో ఎత్తుకున్న ఒక నర్సుకు అమితానందాన్ని కలిగించారు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ. వృద్ధురాలైన నర్సు చేతులు పట్టుకొని, ఆప్యాయంగా పలుకరిస్తూ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఆమెకు ప్రత్యేక అనుభూతులను మిగిల్చారు. కేరళ రాష్ట్రం వయనాడ్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కల్పూర్‌కు చెందిన 72 ఏండ్ల రాజమ్మ వావథిల్ 1970లో ఢిల్లీలోని హోలీ ఫ్యామిలీ హాస్పిటల్‌లో ట్రైనీ నర్సుగా పనిచేశారు. అదే దవాఖానలో 49 ఏండ్ల కిందట రాహుల్ పుట్టగానే చేతుల్లోకి తీసుకున్నవారిలో రాజమ్మ కూడా ఒకరు. తనను భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించిన వయనాడ్ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ నిర్వహించిన విజయోత్సవర్యాలీలో రాహుల్ బిజీగా ఉన్నప్పటికీ.. ఆదివారం ఉదయం ఓ అనుకోని అతిథికి ప్రత్యేక సమయం కేటాయించారు. స్థానికంగా ఉన్న అతిథిగృహానికి వచ్చిన రాజమ్మ, ఆమె కుటుంబసభ్యులతో రాహుల్ భేటీ అయ్యారు. తనను కలిసేందుకు గంటపాటు వేచిఉన్న రాజమ్మ కుటుంబసభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. 49 ఏండ్ల కిందట రాహుల్ పుట్టినప్పుడు జరిగిన జ్ఞాపకాలను రాజమ్మ ఆయనతో పంచుకున్నారు. రాహుల్ నవ్వుతూ ఆమె చెప్పిన అంశాలను ఆసక్తిగా విన్నారు. మరోసారి కలుస్తానని చెప్పిన రాహుల్‌కు.. రాజమ్మ స్వయంగా తయారుచేసిన జాక్‌ఫూట్ చిప్స్, స్వీట్లను బహుమతిగా అందజేశారు. లోక్‌సభ ఎన్నికల వేళ రాహుల్‌గాంధీ పౌరసత్వ అంశం వివాదాస్పదం కాగా, రాహుల్ పుట్టగానే ఎత్తుకొన్నవారిలో తానూ ఒకరినని రాజమ్మ చెప్పడంతో ఆ వివాదానికి తెరపడింది. కేరళలో రాహుల్ గాంధీ మూడు రోజుల పర్యటన ఆదివారంతో ముగిసింది. సాయంత్రం ఆయన ఢిల్లీకి తిరిగి వెళ్లారు.

ఉగ్రవాదం ఉమ్మడి శత్రువు

అణచివేసేందుకు సమష్టి చర్యలు అవసరం

శ్రీలంక పర్యటనలో ప్రధాని మోదీ

ఈస్టర్ బాంబు పేలుళ్ల మృతులకు నివాళి

కొలంబో, జూన్ 9: ఉగ్రవాదం ఉమ్మడి ముప్పు అని, దాన్ని అణచివేసేందుకు సమష్టి, నిర్దిష్ట చర్యలు అవసరమని భారత్, శ్రీలంక ఉద్ఘాటించాయి. రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్రమోదీ.. తన తొలి విదేశీ పర్యటనలో భాగంగా శనివారం మాల్దీవుల్లో, ఆదివారం శ్రీలంకలో పర్యటించారు. శ్రీలంక అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన సహా ఆ దేశ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. శ్రీలంకలో గత ఏప్రిల్‌లో చోటుచేసుకున్న ఈస్టర్ బాంబు పేలుళ్ల అనంతరం ఆ దేశంలో పర్యటించిన తొలి విదేశీ నేత మోదీనే కావడం విశేషం. 'పది రోజుల్లో రెండోసారి అధ్యక్షుడు సిరిసేనతో సమావేశమయ్యా. ఉగ్రవాదం ఉమ్మడి ముప్పు అని, దాన్ని అంతం చేయడానికి సమష్టి, నిర్దిష్ట చర్యలు అవసరమని ఇరువురం నిర్ణయించాం' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ద్వైపాక్షిక సంబంధాలపై ఇరువురు నేతలు చర్చలు జరిపినట్లు భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ తెలిపారు. మోదీ గౌరవార్థం శ్రీలంక అధ్యక్షుడు సిరిసేన విందు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 'సమాధి బుద్ధ' ప్రతిమను మోదీకి బహూకరించారు. 'ప్రత్యేక స్నేహితుడి నుంచి ప్రత్యేక బహుమతి. అధ్యక్షుడు సిరిసేన ప్రధాని మోదీకి 'సమాధి బుద్ధ' ప్రతిమను బహూకరించారు. అనురాధపుర శకం నాటి గొప్ప శిల్పాల్లో ఇది ఒకటి. వాస్తవ విగ్రహాన్ని క్రీస్తు శకం 4-7 శతాబ్దాల మధ్యలో రూపొందించారు.' అని ప్రధాని కార్యాలయం పేర్కొంది. తెల్లటి టేకుతో ఈ ప్రతిమను రూపొందించారని, దీన్ని పూర్తిచేయడానికి రెండేండ్లు పట్టిందని వివరించింది.

ముఖ్యనేతలతో విస్తృత చర్చలు..

ఈస్టర్ బాంబు పేలుళ్ల బాధితులకు నివాళి అర్పించిన అనంతరం, శ్రీలంక అధ్యక్ష భవనానికి చేరుకున్న ప్రధాని మోదీకి సాదర స్వాగతం లభించింది. వర్షం నుంచి రక్షణగా అధ్యక్షుడు సిరిసేన స్వయంగా తనకూ, మోదీకి గొడుగు పట్టారు. అధ్యక్ష నివాసంలో ప్రధాని మోదీ అశోక చెట్టును నాటారు. శ్రీలంక ప్రధాని రణిల్ విక్రమసింఘేతో మోదీ ఈ సందర్భంగా భేటీ అయ్యారు. శ్రీలంకలో ప్రజల కోసం చేపట్టిన పలు ప్రాజెక్టులు సహా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి భారత్ పూర్తి మద్దతునిస్తుందని మోదీ స్పష్టంచేశారు. శ్రీలంక ప్రతిపక్ష నేత మహింద రాజపక్సేతోనూ మోదీ విస్తృత చర్చలు జరిపారు. కౌంటర్ టెర్రరిజం, భద్రత, ఆర్థికాభివృద్ధి అంశాల్లో ఇరుదేశాలు మరింత భాగస్వామ్యం అవ్వాల్సిన అవసరం ఉందని ఇరువురు నేతలు నిర్ణయించారు. ఆర్ సంపంతన్ నేతృత్వంలోని తమిళ జాతీయ కూటమి నేతలు కూడా ఈ సందర్భంగా ప్రధాని మోదీని కలిశారు. రెండోసారి ప్రధానిగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీలంక పర్యటన ఫలప్రదం

శ్రీలంక పర్యటన ఫలప్రదంగా సాగిందని మోదీ పేర్కొన్నారు. 'మా హృదయాల్లో శ్రీలంకకు ప్రత్యేక స్థానం ఉన్నది. శ్రీలంకకు భారత్ అన్ని వేళలా తోడుంటుందని, అభివృద్ధిలో అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా శ్రీలంక సోదర, సోదరీమణులకు మాట ఇస్తున్నా. మీ అపూర్వ ఆతిథ్యానికి ధన్యవాదాలు' అని మోదీ ట్వీట్ చేశారు. శ్రీలంకలోని భారతీయులను ఉద్దేశించి కూడా మోదీ మాట్లాడారు. గత ఐదేండ్లలో భారత ఇమేజ్ పూర్తిగా మారిందని చెప్పారు. శ్రీలంకలోని తమిళుల కోసం 350 మిలియన్ డాలర్ల వ్యయంతో భారత్ ప్రత్యేకంగా ఇండ్లను నిర్మిస్తున్నది. ఇప్పటికే తొలి విడుత నిర్మించిన ఇండ్లను అందజేసింది.

కొలంబోలోని సెయింట్ ఆంథోని చర్చిలో ఈస్టర్ బాంబు పేలుళ్ల మృతులకు నివాళి అర్పిస్తున్న ప్రధాని మోదీ

మోదీకి స్వయంగా గొడుగుపట్టి అధ్యక్ష భవనంలోకి తోడ్కొనివెళ్తున్న శ్రీలంక అధ్యక్షుడు సిరిసేన

శ్రీలంక మళ్లీ పుంజుకుంటుంది..

విమానాశ్రయం నుంచి అధ్యక్ష కార్యాలయానికి వెళ్లేముందు మార్గమధ్యలో సెయింట్ ఆంథోని చర్చిని ప్రధాని మోదీ సందర్శించారు. ఈస్టర్ బాంబు పేలుళ్ల బాధితులకు ఈ సందర్భంగా ఆయన నివాళులు అర్పించారు. 'ఉగ్రవాదుల పిరికి చర్యలు శ్రీలంక స్థైర్యాన్ని దెబ్బతీయలేవు. శ్రీలంక మళ్లీ పుంజుకుంటుందనే విశ్వాసం నాకుంది. లంక ప్రజలకు సంఘీభావంగా భారత్ నిలబడుతుంది' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. షెడ్యూల్‌లో లేకపోయినప్పటికీ ఆయన ఈ చర్చిని సందర్శించడం విశేషం. శ్రీలంకలో ఈస్టర్ పర్వదినం నాడు ప్రధాన చర్చిలు, విలాసవంతమైన హోటళ్లను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు జరిపిన వరుస బాంబు పేలుళ్లలో 254 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తామే బాధ్యులమని ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థ ప్రకటించినప్పటికీ, స్థానిక నేషనల్ తౌహీద్ జమాతే ఈ పేలుళ్లకు కారణమని శ్రీలంక ప్రభుత్వం పేర్కొంటున్నది.

కోజికోడ్‌లో ఓ పాపను ఎత్తుకొని ముద్దు ఇస్తున్న రాహుల్ గాంధీ

"బీజేపీ పాలిత, కాషాయేతర రాష్ట్రాలను ప్రధాని మోదీ ఒకేలా చూడలేరు. బీజేపీ ప్రభుత్వాలు లేనిచోట సవతిప్రేమ చూపిస్తారు. తనకు కేరళ, వారణాసి సమానమేనని మోదీ అంటున్నారు. పైకి ఎన్ని మాటలు చెప్పినా.. ఆయన కేరళవాసుల ఆకాంక్షలను నెరవేరుస్తారని నేను అనుకోవడం లేదు. ఉత్తరప్రదేశ్‌పై కురిపించినంత ప్రేమ కేరళ మీద కనబరుచకపోవచ్చు. ఎందుకంటే అక్కడ బీజేపీ అధికారంలో ఉంటే, ఇక్కడ సీపీఎం అధికారంలో ఉన్నది. ద్వేషం, కోపంతో బీజేపీ కండ్లు మూసుకుపోయాయి. ఆరెస్సెస్ భావజాలాన్ని ఆమోదించనివారు వారి దృష్టిలో భారతీయులు కారు.

– రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు

(ఆదివారం వయనాడ్ జిల్లా ఎంజాపుళ, ముక్కమ్ పట్టణాల్లో రోడ్‌షో సందర్భంగా..)

'ఎస్‌సీవో'లో మోదీ, జిన్‌పింగ్ భేటీ!

ఈ నెల 13, 14 తేదీల్లో కిర్గిస్థాన్‌లో జరుగనున్న సదస్సు

బీజింగ్/న్యూఢిల్లీ, జూన్ 9: ఈ నెల 13, 14 తేదీల్లో కిర్గిస్థాన్ రాజధాని బిష్‌కెక్‌లో జరుగనున్న షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భేటీ కానున్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన తర్వాత ఇరువురు నేతలు భేటీ కానుండటం ఇదే తొలిసారి. చైనాలోని భారత రాయబారి విక్రమ్ మిశ్రి మాట్లాడుతూ గతంలో పలు అంతర్జాతీయ సదస్సుల సందర్భంగా ప్రధాని మోదీ, జిన్‌పింగ్ సమావేశమయ్యారని, త్వరలో కిర్గిస్థాన్‌లో జరుగనున్న ఎస్‌సీవో సదస్సు సందర్భంగా మళ్లీ భేటీ కానున్నారని చెప్పారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చాక ప్రధాని మోదీకి జిన్‌పింగ్ ఫోన్ చేసి అభినందనలు తెలిపారని గుర్తుచేశారు.

మోదీ విమానానికి అనుమతివ్వండి..

ఎస్‌సీవో సదస్సుకు వెళ్లేందుకుగాను మోదీ ప్రయాణించే విమానానికి గగనతల అనుమతి ఇవ్వాలని పాక్‌ను భారత్ కోరింది. పాక్ బాలాకోట్‌లోని జేఈఎం ఉగ్రస్థావరాలపై భారత యుద్ధ విమానాలు మెరుపుదాడుల నేపథ్యంలో 11 విమాన మార్గాల్లో రెండింటిని మాత్రమే ఆ దేశం తెరిచింది. దీంతో భారత్‌తోపాటు పలు దేశాల విమాన సంస్థలకు ఇబ్బంది కలుగుతున్నది.

విస్తరిస్తున్న రుతుపవనాలు

- కేరళవ్యాప్తంగా భారీ వర్షాలు
- అరేబియా సముద్రంపై అల్పపీడన ద్రోణి
- మహారాష్ట్రలో కురుస్తున్న ముందస్తు వర్షాలు
- త్వరలో ఐఎండీకి రెండు సూపర్ కంప్యూటర్లు

తిరువనంతపురం/నాసిక్/న్యూఢిల్లీ, జూన్ 9: కేరళతీరాన్ని శనివారం తాకిన రుతుపవనాలు క్రమంగా విస్తరిస్తున్నాయి. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా మంచి వర్షాలు కురిసినట్టు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు తెలిపారు. మరోవైపు అరేబియా సముద్రంలో అల్పపీడన ద్రోణి ఏర్పడినట్టు వెల్లడించారు. ఇది లక్షద్వీప్ మీదుగా ఆగ్నేయ, తూర్పు మధ్య అరేబియా సముద్రంపై విస్తరించి ఉన్నదని చెప్పారు. ఉత్తరం వైపు కదులుతున్నదని పేర్కొన్నారు. అది క్రమంగా బలపడుతున్నదని మరో రెండు రోజుల్లో వాయుగుండంగా మారుతుందని, ఆ తర్వాత తుఫాన్‌గా మారే అవకాశం ఉన్నదని వెల్లడించారు. ఈ ప్రభావంతో కేరళ తీరప్రాంతాలతోపాటు లక్షద్వీప్‌లో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. మలప్పురం, కోజికోడ్ జిల్లాల్లో ఈ నెల 12న భారీ నుంచి అతిభారీ వర్షాలు పడొచ్చని హెచ్చరించారు. 11.5-20.4 సెం.మీ. మేర వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నదని అంచనావేశారు. మత్స్యకారులు ఈ నెల 13వ తేదీ వరకు చేపలవేటకు వెళ్లొద్దని సూచించారు. ఐఎండీ సూచనల మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని కేరళ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

తగ్గిన వర్షపాతం

ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు వారం రోజులు ఆలస్యంగా రావడంతో జూన్ నెల మొదటి తొమ్మిది రోజుల్లో సగటుకన్నా 45 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని ఐఎండీ అధికారులు చెప్పారు. సాధారణంగా జూన్ 9వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా 3.24 సెం.మీ. మేర వర్షం కురుస్తుందని, ఈసారి కేవలం 1.77 సెం.మీ. మాత్రమే పడిందని చెప్పారు.

రూ.1500 కోట్లతో సూపర్ కంప్యూటర్లు

వాతావరణ అంచనాల్లో మరింత కచ్చితత్వం, వేగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖకు మరో రెండు సూపర్ కంప్యూటర్లు సమకూర్చాలని నిర్ణయించింది. ఒక్కొక్కటి సెకనుకు 40 పెటాఫ్లాప్స్ వేగంతో పనిచేయగలిగే రెండు సూపర్ కంప్యూటర్లను కొనుగోలు చేయనున్నట్టు ఆ శాఖ కార్యదర్శి ఎం రాజీవన్ తెలిపారు. ఇందుకోసం రూ.1500 కోట్ల వరకు వెచ్చించనున్నట్టు చెప్పారు. ఇవి అందుబాటులోకి వస్తే ప్రస్తుత అంచనాలకన్నా ఎనిమిది రెట్లు వేగంగా, కచ్చితత్వంతో వాతావరణ వివరాలు అందించవచ్చని పేర్కొన్నారు. 'ప్రస్తుతం ఉపగ్రహాల సాయంతో ప్రతి 12 కి.మీ. పరిధిని ఒక యూనిట్‌గా తీసుకొని వాతావరణ అంచనాలు అందిస్తున్నాం. ఈ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రతి 5 కి.మీ. పరిధి యూనిట్‌గా వివరాలు అందించేలా సూపర్ కంపూటర్లను కొనుగోలు చేస్తాం' అని చెప్పారు. ప్రస్తుతం భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ పరిధిలో రెండు సూపర్ కంప్యూటర్లు ఉన్నాయి. ఈ రెండింటి వేగం కలిపి 10 పెటాఫ్లాప్స్ మాత్రమే.

భారీ వర్షాలకు జలమయమైన కొచ్చిలోని రహదారి

నాసిక్‌ను ముంచెత్తిన వర్షాలు

మహారాష్ట్రలోని నాసిక్‌ను ముందస్తు వర్షాలు ముంచెత్తాయి. శనివారం రాత్రి నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా జరిగిన ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, ముగ్గురు గాయపడినట్టు అధికారులు తెలిపారు. భారీ ఈదురుగాలులకు నాసిక్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని చెప్పారు. వడాలా ప్రాంతంలో ఓ ఇంటి పైకప్పు కూలిపోవడంతో 70 ఏండ్ల వృద్ధుడు తీవ్రగాయాలతో మరణించారని, మరో ముగ్గురు గాయపడ్డారని ఇందిరానగర్ పోలీసులు తెలిపారు. నాసిక్ జిల్లాలోని యోలా పట్టణంలోనూ భారీ వర్షాలు కురిశాయని చెప్పారు. అనేక ఇండ్లు ధ్వంసమయ్యాయని వెల్లడించారు.

దుబాయ్ రోడ్డు ప్రమాదం..

స్వదేశానికి చేరిన మృతదేహాలు!

దుబాయ్, జూన్ 9: దుబాయ్‌లో గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలొదిలిన 12 మంది భారతీయుల్లో 11 మంది మృతదేహాలు ఆదివారం స్వదేశానికి చేరుకున్నాయి. కాగా మృతుల్లో ఒకరైన రోష్ని మూల్ ఛాందిని మృతదేహానికి ఆమె కుటుంబసభ్యులు దుబాయ్‌లోనే అంత్యక్రియలు నిర్వహించారు. మృతుల కుటుంబాల ఆర్థిక స్థితిగతుల నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని.. ఎయిర్ ఇండియా సంస్థ ఎలాంటి చార్జీలను తీసుకోకుండానే మృతదేహాలను ఉచితంగా స్వదేశానికి తరలించినట్టు దుబాయ్‌లోని భారత కాన్సుల్ జనరల్ విపుల్ తెలిపారు. 31 మంది ప్రయాణికులతో గురువారం మస్కట్ నుంచి దుబాయ్‌కు ఓ బస్సు బయల్దేరింది. బస్సుల కోసం నిర్దేశించిన రోడ్డు మార్గంలో కాకుండా ఇతర వాహనాల రోడ్డు లేన్‌లోకి వేగంగా దూసుకెళ్లిన ఈ బస్సు ఎత్తైన బారికేడ్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం 17 మంది చనిపోయారు.

మీడియాతో మాట్లాడుతున్న విపుల్

యూపీలో జర్నలిస్టుల నిర్బంధం

- సీఎంకు వ్యతిరేకంగా అభ్యంతరకర వీడియో ప్రసారం చేశారని ఆరోపణ
- ఓ టీవీ చానెల్ ఎడిటర్, అధిపతి, జర్నలిస్టు అరెస్ట్
- ఖండించిన ఎడిటర్స్ గిల్డ్

లక్నో/న్యూఢిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ ప్రైవేట్ టీవీ చానెల్ అధిపతి, దాని ఎడిటర్, ఓ జర్నలిస్టును పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఇటీవల ఓ మహిళ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇంటి ముందు నిల్చొని మీడియాతో మాట్లాడుతూ తనను పెండ్లి చేసుకోవాలని కోరుతూ సీఎం ఆదిత్యనాథ్‌కు ప్రతిపాదన పంపానని చెప్పారు. ఇందుకు సంబంధించిన వీడియోను నోయిడాకు చెందిన జర్నలిస్ట్ ప్రశాంత్ కనోజియా ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. అదే రోజు ఈ వీడియోను ఓ ప్రైవేట్ చానెల్ కూడా ప్రసారం చేసింది. దీంతో పలువురు బీజేపీ కార్యకర్తలు టీవీ చానెల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు చానెల్ అధిపతి ఇషితా సింగ్, ఎడిటర్ అనూజ్ శుక్లాను అరెస్టు చేశారు. అంతేగాక ఎలాంటి లైసెన్స్ లేకుండా చానెల్ నిర్వహిస్తున్నందుకు మరో కేసు కూడా నమోదు చేశారు. అలాగే ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో వీడియో పోస్ట్ చేసి సీఎం ప్రతిష్ఠను దిగజార్చేలా ప్రవర్తించాడని ఆరోపిస్తూ నోయిడాకు చెందిన జర్నలిస్టు ప్రశాంత్ కనోజియాను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు ఈ అరెస్టులపై మీడియా సంఘాలు భగ్గుమన్నాయి. ఎడిటర్స్ గిల్డ్ స్పందిస్తూ పోలీసుల చర్య తీవ్రమైందని, చట్టాన్ని ఉల్లంఘించి ఏకపక్షంగా వ్యవహరించారని దుయ్యబట్టింది. పలు మీడియా సంస్థలు కూడా ఓ సంయుక్త ప్రకటన విడుదల చేస్తూ పోలీసుల చర్యను తీవ్రంగా తప్పుబట్టాయి.

ఇషితా సింగ్, అనూజ్ శుక్లా

మైనర్లపై జరిగేవే లైంగిక దాడులు!

వివాహిత మహిళలపై జరిగేవి వేరు

ఉత్తర్‌ప్రదేశ్ మంత్రి వివాదస్పద వ్యాఖ్యలు

లక్నో, జూన్ 9: ఉత్తర్‌ప్రదేశ్ మంత్రి లైంగికదాడికి సరికొత్త భాష్యం చెప్పారు. ఆ రాష్ట్ర నీటి వనరులు, అటవీ శాఖ మంత్రి ఉపేంద్ర తివారీని ఇటీవల రాష్ట్రంలో జరుగుతున్న వరుస లైంగిక దాడుల ఘటనలపై స్పందించాలని మీడియా కోరింది. దీంతో ఆయన మాట్లాడుతూ.. 'లైంగిక దాడులకు ఒక స్వభావం ఉంటుంది. మైనర్లపై జరిగే అఘాయిత్యాలే రేప్‌లు. మధ్య వయసు మహిళలు, వివాహితులపై లైంగిక దాడులు వేరు..'అని వ్యాఖ్యానించారు. ఓ వైపు ఉత్తర్‌ప్రదేశ్‌లో హత్యలు, లైంగిక దాడులపై నిరసనలు వెల్లువెత్తుతుండగా మరోవైపు ఉపేంద్ర తివారీ ఇలా వ్యాఖ్యానించి అందరిని ఆశ్చర్యపరిచారు. ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్‌పై ఓ మహిళ చేసిన వ్యాఖ్యలను పాత్రికేయుడు ప్రశాంత్ కనోజియా ట్వీట్ చేయడంపైన స్పందిస్తూ.. ప్రచురించే వార్తల పట్ల జర్నలిస్టులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితబోధ కూడా చేశారు.

ట్వీట్ తెచ్చిన తంటా

రచయిత్రి నటాషా బుక్ డీల్ రద్దు

పబ్లిషర్‌పై రూ. 90కోట్లకు దావా

వాషింగ్టన్: ఓ రచయిత్రి యాధృచ్ఛికంగా చేసిన ఓ ట్వీట్ పెద్ద దుమారానికి తెరలేపింది. అవార్డు గ్రహీత అయిన జోర్డన్ సంతతికి చెందిన అమెరికన

పాయింట్ల పట్టిక

స్థానం	జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే.	ర.రే	పా
1.	న్యూజిలాండ్	3	3	0	0	+2.16	6
2.	ఇంగ్లండ్	3	2	1	0	+1.30	4
3.	భారత్	2	2	0	0	+0.53	4
4.	ఆస్ట్రేలియా	3	2	1	0	+0.48	4
5.	శ్రీలంక	3	1	1	1	-1.51	3
6.	పాకిస్థాన్	3	1	1	1	-2.41	3
7.	వెస్టిండీస్	2	1	1	0	+2.05	2
8.	బంగ్లాదేశ్	3	1	2	0	-0.71	2
9.	దక్షిణాఫ్రికా	3	0	3	0	-0.95	0
10.	ఆఫ్ఘనిస్థాన్	3	0	3	0	-1.49	0

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, ర.రే - నెట్ ర.రేట్, పా-పాయింట్లు,

వరల్డ్‌కప్‌లో నేడు దక్షిణాఫ్రికా X వెస్టిండీస్ - 3 గం. స్టార్ స్పోర్ట్స్‌లో

అత్యధిక పరుగులు: 260 షకీబ్ (బంగ్లాదేశ్)

అత్యధిక వికెట్లు: 8 ఫెర్గూసన్ (న్యూజిలాండ్)

విశ్వసమరంలో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాను భారత ఆటగాళ్లు బెంబేలెత్తించారు. గత మ్యాచ్‌లో హిట్‌మ్యాన్ విజృంభిస్తే.. ఈసారి నా వంతు అంటూ గబ్బర్ గర్జించాడు. పరుగుల యంత్రం విరాట్ మరోసారి మాస్టర్ క్లాస్ నిలకడ ప్రదర్శిస్తే.. ధోనీ, పాండ్యా తమ బ్యాట్ పవర్ చూపెట్టారు. ఛేజింగ్‌లో వార్నర్, స్మిత్ భయపెట్టినా.. స్వింగ్ సుల్తాన్ భువనేశ్వర్, యార్కర్ కింగ్ బుమ్రా విజృంభించడంతో భారత్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసుకొని పట్టికలో మూడో స్థానానికి చేరింది. విజయగర్వంతో విర్రవీగుతున్న ఆసీస్‌ను నేలకు దించింది. పనిలోపనిగా గత వరల్డ్‌కప్‌లో సెమీస్‌లో ఎదురైన పరాజయానికి చక్కటి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చి టైటిల్ నెగ్గేందుకు కావాల్సిన ఆత్మవిశ్వాసాన్ని మూటగట్టుకుంది. కంగారూలపై టీమ్‌ఇండియాకు ఇది 50వ విజయం కావడం మరో విశేషం.

ఆసీస్‌కు రిటర్న్ గిఫ్ట్

గత ప్రపంచకప్ ఓటమికి బదులు తీర్చుకున్న భారత్

ఆస్ట్రేలియాపై 36 పరుగులతో గెలుపు ▪ శతక్కొట్టిన ధవన్ ▪ మెరిసిన కోహ్లీ, రోహిత్, భువనేశ్వర్

కోహ్లీ (82)



ధవన్ (117)

లండన్: ప్రపంచకప్ వేదికపై కీలకమైన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా విజయం సాధించింది. ఈ మ్యాచ్ నెగ్గితే చాలు వరల్డ్‌కప్ సొంతమైనట్టే.. ప్రత్యర్థులందరిలోకెళ్లా ప్రమాదకరమైన ఆసీస్‌ను మట్టికరిపిస్తే ఇక ఎదురులేనట్టే.. అనే అంచనాల మధ్య బరిలోదిగిన భారత్ అందుకు తగ్గట్లే విజృంభించింది. ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 36 పరుగుల తేడాతో ఐదు సార్లు ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియాపై గెలిచించింది. బ్యాట్స్‌మెన్ సమష్టిగా కదం తొక్కడంతో మొదట బ్యాటింగ్ చేసిన కోహ్లీ సేన 50 ఓవర్లలో 5 వికెట్లకు 352 పరుగులు చేసింది. శిఖర్ ధవన్ (109 బంతుల్లో 117; 16 ఫోర్లు) సెంచరీతో చెలరేగితే.. కెప్టెన్ విరాట్ కోహ్లీ (77 బంతుల్లో 82; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), రోహిత్ శర్మ (70 బంతుల్లో 57; 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలతో అదరగొట్టారు. చివర్లో హార్దిక్ పాండ్యా (27 బంతుల్లో 48; 4 ఫోర్లు, 3 సిక్సర్లు), మహేంద్ర సింగ్ ధోనీ (14 బంతుల్లో 27; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులు మెరిపించడంతో భారత్ భారీ స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 316 పరుగులకు ఆలౌటైంది. వార్నర్ (56; 5 ఫోర్లు), స్మిత్ (69; 5 ఫోర్లు, 1 సిక్స్), కారీ (55; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలతో రాణించారు. భువనేశ్వర్, బుమ్రాకు చెరో 3 వికెట్లు దక్కాయి. సెంచరీ హీరో ధవన్‌ను మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వరించింది.

ధనాధన్ ధవన్

టాస్ నెగ్గిన కోహ్లీ మొదట బ్యాటింగ్ ఎంచుకోవడం సరైందేనని ఓపెనర్లు నిరూపించారు. నిలదొక్కుకునేంత వరకు నెమ్మదిగా ఆడిన రోహిత్, ధవన్ ఆ తర్వాత విజృంభించారు. ఆసీస్ పేసర్లు స్టార్క్, కమ్మిన్స్ ఆరంభంలో కట్టుదిట్టమైన బంతులతో కట్టిపడేయడంతో 7 ఓవర్లు ముగిసేసరికి భారత్ 22 పరుగులే చేసింది. ఆ తర్వాత జూలు విదిల్చిన ధవన్ హ్యాట్రిక్ ఫోర్లతో జోరు పెంచాడు. ఇక అక్కడి నుంచి మొదలైన విరాట్ గ్యాంగ్ దంచుడు.. అంతకంతకూ పెరుగుతూ వెళ్లింది. 53 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న ధవన్ ఆ తర్వాత మరింతగా చెలరేగిపోతే.. ఆసీస్‌పై అత్యతం వేగంగా 2000 రన్స్ కొట్టిన రోహిత్ శర్మ వన్డేల్లో 42వ అర్ధశతకం పూర్తి చేసుకున్నాక ఔటయ్యాడు. అయినా కెప్టెన్ విరాట్‌తో కలిసి ధవన్ ధాటిగా ఆడాడు. ఈ క్రమంలో ఐసీసీ టోర్నీల్లో ఆరో శతకం పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత మరింత ప్రమాదకరంగా మారిన శిఖర్‌ను స్టార్క్ పెవిలియన్ పంపాడు. దీంతో రెండో వికెట్‌కు నమోదైన 93 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

10 ఓవర్లలో 116

అప్పటి వరకు బాల్‌కో రన్ చొప్పున సాగిన ఇన్నింగ్స్‌లో పాండ్యా ఊపుతెచ్చాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన అతడు మ్యాక్స్‌వెల్ ఓవర్‌లో సిక్సర్‌తో మోత మొదలెట్టాడు. 50వ అర్ధశతకం పూర్తిచేసుకున్న కోహ్లీ కూడా దూకుడు పెంచడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఎడాపెడా బౌండ్రీలు బాదిన పాండ్యా జట్టు స్కోరు 300 దాటాక ఔటైనా.. ఆ తర్వాత ధోనీ విరుచుకుపడటంతో స్కోరుకు బ్రేక్ పడలేదు. ఒక దశలో సెంచరీ పూర్తి చేసుకునేలా కనిపించిన కోహ్లీ చివరి ఓవర్లలో పాండ్యా, ధోనీకి ఎక్కువగా స్ట్రయికింగ్ ఇచ్చాడు. తనదైన శైలిలో రెచ్చిపోయిన మాజీ కెప్టెన్ ఆఖరి ఓవర్ తొలి బంతికి ఫాలోత్రూలో స్టాయినిస్ పట్టిన కండ్లు చెదిరే క్యాచ్‌కు పెవిలియన్ చేరాడు. కోహ్లీ కూడా అదే ఓవర్‌లో ఔటైనా.. రాహుల్ (3 బంతుల్లో 11 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) జట్టు స్కోరును 350 దాటించాడు. 40 ఓవర్లు ముగిసేసరికి 236/2తో ఉన్న విరాట్ సేన చివరి 10 ఓవర్లలో 116 పరుగులు పిండుకోవడం విశేషం. ఆసీస్ బౌలర్లలో స్టాయినిస్‌కు 2, కమ్మిన్స్, స్టార్క్, కౌల్టర్‌నైల్‌కు తలా ఓ వికెట్ దక్కింది.

ధోనీ (27)

ధోనీ 'బలిదాన్' తీసేసి..

మాజీ కెప్టెన్, వరల్డ్ బెస్ట్ ఫినిషర్ మహేంద్రసింగ్ ధోనీ క్రీజులోకి రాగానే ప్రసార మాధ్యమాల్లో హెలికాప్టర్ చక్కర్లు కొట్టే దృశ్యాలు కనువిందు చేశాయి. అందుకు తగ్గట్లే అతడు భారీ షాట్లతో విరుచుకుపడటంతో స్టేడియానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన భారత అభిమానులు పండుగ చేసుకున్నారు. కాగా.. ధోనీ ఈ మ్యాచ్‌లో 'బలిదాన్' గ్లౌవ్స్‌ను పక్కన పెట్టి బరిలోదిగాడు. తీవ్ర చర్చకు దారితీసిన ఈ గ్లౌవ్స్ ధరించేందుకు ఐసీసీ అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే.

పాండ్యా (48) రోహిత్ (57)

పవర్‌ఫుల్ పాండ్యా..

ఇదే పిచ్‌పై చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో సహచరులంతా విఫలమైనా.. దాయాది పాకిస్థాన్ వెన్నులో వణుకు పుట్టించిన హార్దిక్ పాండ్యా మరోసారి తన బ్యాట్ పవర్ చూపాడు. అప్పటికే భారీస్కోరుకు గట్టి పునాది పడటంతో నాలుగో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన కుంగ్‌ఫూ పాండ్యా తనకే సాధ్యమయ్యే షాట్లతో విరుచుకుపడ్డాడు. నైల్, కమ్మిన్స్, జంపాల బౌలింగ్‌లో ఒక్కో సిక్సర్ బాదిన పాండ్యా చూస్తుండగానే అర్ధశతకానికి చేరువయ్యాడు. నైల్ వేసిన 42 ఓవర్ చివరి బంతికి బౌలర్ తలమీదుగా అతడు కొట్టిన బౌండ్రీ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఒంట్లో ఉన్న బలాన్నంతా భుజాల్లోకి తీసుకొచ్చి అతడు కొట్టిన షాట్‌కు బౌలర్ అడ్డుతప్పుకున్నాడంటే బంతి ఎంత వేగంగా దూసుకెళ్లిందో అర్థం చేసుకోవచ్చు.

కంగారెత్తించిన ఆసీస్

స్మిత్ (69)

భారీ లక్ష్యఛేదనలో బరిలోకి దిగిన ఆసీస్ ఆచితూచి ఇన్నింగ్స్ ఆరంభించింది. 9 ఓవర్లు పూర్తయ్యేసరికి 29/0తో నిలిచింది. పాండ్యా వేసిన పదో ఓవర్‌లో వార్నర్ ఫోర్, ఫించ్ 6,4,4తో విరుచుకుపడటంతో 19 పరుగులు వచ్చాయి. తొలి వికెట్‌కు 60 పరుగులు జోడించాక ఫించ్ (36; 3 ఫోర్లు, 1 సిక్స్) రనౌట్ రూపంలో వెనుదిరిగాడు. అర్ధ శతకం అనంతరం వార్నర్ కూడా ఔటైనా.. ఖవాజా (42; 4 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి స్మిత్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. జట్టు స్కోరును 200 దాటించాక ఖవాజా ఔటైనా.. మ్యాక్స్‌వెల్ జతగా స్మిత్ రెచ్చిపోయాడు.

భువీ డబుల్ ధమాకా..

39 ఓవర్లు ముగిసేసరికి ఆసీస్ స్కోరు 235/3. గెలువాలంటే 66 బంతుల్లో 118 పరుగులు చేయాలి. స్మిత్, మ్యాక్స్‌వెల్ (14 బంతుల్లో 28; 5 ఫోర్లు) అదరగొడుతున్నారు. స్టాయినిస్ (0) , కారీ బ్యాటింగ్‌కు రావాల్సి ఉండటంతో ఆస్ట్రేలియా పోటీలోనే ఉంది. కానీ 40 ఓవర్ వేసిన భువీ గేమ్ చేంజ్ చేశాడు. జోరుమీదున్న స్మిత్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న భువనేశ్వర్.. చివరి బంతికి స్టాయినిస్‌ను బౌల్డ్ చేశాడు. మరుసటి ఓవర్‌లో మ్యాక్స్‌వెల్ కూడా ఔటవడంతో మ్యాచ్‌పై ఆసీస్ ఆశలు వదులుకుంది.

స్కోరు బోర్డు

భారత్: రోహిత్ (సి) కారీ (బి) కౌల్టర్‌నైల్ 57, ధావన్ (సి) (సబ్) లైయన్ (బి) స్టార్క్ 117, కోహ్లీ (సి) కమ్మిన్స్ (బి) స్టాయినిస్ 82, పాండ్యా (సి) ఫించ్ (బి) కమిన్స్ 48, ధోనీ (సి అండ్ బి) స్టాయినిస్ 27, రాహుల్ (నాటౌట్) 11, జాదవ్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు**: 10, **మొత్తం:** 50 ఓవర్లలో 352/5. **వికెట్ల పతనం:** 1-127, 2-220, 3-301, 4-338, 5-348, **బౌలింగ్:** కమ్మిన్స్ 10-0-55-1, స్టార్క్ 10-0-74-1, కౌల్టర్‌నైల్ 10-1-63-1, మ్యాక్స్‌వెల్ 7-0-45-0, జంపా 6-0-50-0, స్టాయినిస్ 7-0-62-2.

ఆస్ట్రేలియా: వార్నర్ (సి) భువనేశ్వర్ (బి) చహల్ 56, ఫించ్ (రనౌట్) 36, స్మిత్ (ఎల్బీ) భువనేశ్వర్ 69, ఖవాజా (బి) బుమ్రా 42, మ్యాక్స్‌వెల్ (సి) (సబ్) జడేజా (బి) చహల్ 28, స్టాయినిస్ (బి) భువనేశ్వర్ 0, కారీ (నాటౌట్) 55, కౌల్టర్‌నైల్ (సి) కోహ్లీ (బి) బుమ్రా 4, కమ్మిన్స్ (సి) ధోనీ (బి) బుమ్రా 8, స్టార్క్ (రనౌట్) 3, జంపా (సి) (సబ్) జడేజా (బి) భువనేశ్వర్ 1, **ఎక్స్‌ట్రాలు:** 14, **మొత్తం:** 50 ఓవర్లలో 316 ఆలౌట్. **వికెట్ల పతనం:** 1-61, 2-133, 3-202, 4-238, 5-238, 6-244, 7-283, 8-300, 9-313, 10-316, **బౌలింగ్:** భువనేశ్వర్ 10-0-50-3, బుమ్రా 10-1-61-3, పాండ్యా 10-0-68-0, కుల్దీప్ 9-0-55-0, చహల్ 10-0-62-2, జాదవ్ 1-0-14-1.

6 ఐసీసీ టోర్నీల్లో రోహిత్-ధవన్ జంటకు ఇది ఆరో సెంచరీ భాగస్వామ్యం. గిల్‌క్రిస్ట్, హెడెన్‌లతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. ఐసీసీ టోర్నీల్లో ధవన్ శతకాల సంఖ్య. సచిన్, గంగూలీ చెరో 7 సెంచరీలతో అగ్రస్థానంలో ఉండగా.. పాంటింగ్, సంగక్కరతో కలిసి ధవన్ రెండో స్థానంలో నిలిచాడు.

1 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక సెంచరీలు చేసిన జట్టుగా భారత్ అగ్రస్థానానికి చేరింది. ధవన్ సెంచరీతో టీమ్‌ఇండియా బ్యాట్స్‌మెన్ శతకాల సంఖ్య 27కు చేరింది. ఆసీస్ (26 సెంచరీలు) రెండో స్థానంలో ఉంది.

నిలువాలంటే గెలువాల్సిందే

వెస్టిండీస్‌తో దక్షిణాఫ్రికా అమీతుమీ ▪ ఓడితే సెమీస్ ఆశలు గల్లంతే

డుప్లెసిస్

సౌంతాప్టన్: టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా ప్రపంచ కప్‌లో ఉత్సాహంగా అడుగుపెట్టిన దక్షిణాఫ్రికా.. వరుస ఓటములతో డీలాపడింది. సెమీస్ ఆశలు సజీవంగా ఉండాలంటే మిగిలిన ఆరు మ్యాచ్‌లు గెలవాల్సిన పరిస్థితి తెచ్చుకుంది. ఈ తరుణంలో సోమవారం రోస్ బౌల్ మైదానం వేదికగా వెస్టిండీస్‌తో తలపడనుంది. పరాజయాలకు గాయాలు తోడవడం సఫారీలను మరింత కలవరపాటుకు గురిచేస్తున్నది. ఒక్క మ్యాచ్ ఆడకుండానే స్టార్ పేసర్ స్టెయిన్ టోర్నీకి దూరం కాగా.. మరో పేసర్ ఎంగ్డీ ఈ మ్యాచ్ ఆడే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. మరోవైపు విండీస్ మాత్రం అంచనాలకు మించి అదరగొడుతున్నది. తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై ఘన విజయం సాధించిన కరీబియన్లు రెండో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. భారీ హిట్టర్లు, పటిష్ఠమైన పేస్ దళం ఉన్న విండీస్‌ను.. నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయిన దక్షిణాఫ్రికా నిలువరిస్తుందో చూడాలి.

పేసర్లే బలంగా..

మెగాటోర్నీలో విండీస్ పేసర్లు ఆకట్టుకుంటున్నారు. తొలి మ్యాచ్‌లో కెప్టెన్ జాసన్ హోల్డర్, రస్సెల్, థామస్ విజృంభించడంతో పాకిస్థాన్ 105 పరుగులకే కుప్పకూలింది. ఆస్ట్రేలియాతో జరిగిన రెండో మ్యాచ్‌లో బ్రాత్‌వైట్, కార్టెల్ కూడా వికెట్లు పడగొట్టి లయ దొరకబుచ్చుకున్నారు. హిట్టర్లతో దట్టంగా ఉన్న విండీస్ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ విధించిన సాధారణ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. గేల్ అర్ధశతకంతో విజృంభించడంతో చూస్తుండగానే టార్గెట్ కరిగిపోయింది. రెండో మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై హోప్, హోల్డర్ రాణించినా స్వల్ప తేడాతో పరాజయం పాలైంది.

హోల్డర్

ఇబ్బందుల్లో ప్రొటీస్

పేస్‌కు పెట్టింది పేరైన సఫారీ బౌలర్లు టోర్నీలో పేలవ ప్రదర్శన చేస్తున్నారు. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఘోరంగా విఫలమైన బౌలింగ్ విభాగం.. బంగ్లాపై మరింత చెత్త ప్రదర్శన నమోదు చేసింది. భారత్‌తో జరిగిన మూడో మ్యాచ్‌లో కాస్త ఫర్వాలేదనిపించింది. ఎన్నో అంచనాలు పెట్టుకున్న రబాడ అనుకున్న స్థాయిలో రాణించడం లేదు. మూడు మ్యాచ్‌లు ఆడినా ఏ ఒక్క ఆటగాడు శతకం చేయలేకపోయాడు. తొలి మ్యాచ్‌లో డీకాక్, డస్సెన్, రెండోమ్యాచ్‌లో సారథి డుప్లెసిస్ అర్ధశతకాలు చేయగా.. భారత్‌తో పోరులో ఒక్కరూ ఆ మార్కును దాటలేకపోయారు. విండీస్‌తో మ్యాచ్‌లోనైనా బ్యాటింగ్ గాడిలో పడకపోతే ప్రొటీస్‌కు కష్టాలు తప్పవు.

నీ దూకుడూ.. సాటెవ్వరు

చరిత్ర సృష్టించిన రఫెల్ నాదల్

12వ సారి ఫ్రెంచ్ ఓపెన్ కైవసం

మట్టికోర్టు మరోసారి మురిసింది ఆ వీరుడి ఆట చూసి.. ఫ్రెంచ్ టైటిల్ పన్నెండోసారి సంబురపడింది ఆ ఆటగాడి ఎదలో ఒదిగి.. టెన్నిస్ ప్రేమికులు మైమరిచిపోయారు ఆ దూకుడైన ఆటను తిలకించి.. ఎర్రమట్టి కోటలో మకుటం లేని మహారాజు రఫెల్ నాదల్ మరోసారి గర్జించాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో తనకు ఎదురులేదంటూ కదంతొక్కాడు. రొలాండ్ గారోస్ ఉంది తనకోసమే అన్నట్టు చెలరేగాడు. ఫైనల్‌లో బెంబేలెత్తించే ఆటతో వరుసగా రెండోసారి థీమ్‌పై జయకేతనం ఎగురవేశాడు. ఒకే గ్రామ్‌స్లామ్‌లో 12సార్లు టైటిల్ సాధించి.. ఓవరాల్‌గా ఫెదరర్ రికార్డుకు రెండడుగుల దూరంలో నిలిచాడు.

థీమ్ నాదల్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లో స్పెయిన్ వీరుడు, డిఫెండింగ్ చాంపియన్ రఫెల్ నాదల్ జైత్రయాత్ర కొనసాగించాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో 6-3, 5-7, 6-1, 6-1తో నాలుగో సీడ్ డొమెనిక్ థీమ్(ఆస్ట్రియా)ను మట్టికరిపించి 12వ సారి టైటిల్‌ను ముద్దాడాడు. తొలి సెట్ ఆరంభం నుంచే బలమైన షాట్లతో ప్రత్యర్థిపై విరుచుకుపడ్డాడు. అయితే, ఓ దశలో థీమ్ పుంజుకొని రఫా సర్వీస్‌ను బ్రేక్ చేసి 3-2తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అతనికి ఆ సంతోషం ఎక్కువసేపు నిలువలేదు. వెంటనే తేరుకున్న రఫా దూకుడుగా ఆడాడు. వరుస గేమ్‌లు గెలిచి సెట్‌ను 6-3తో సొంతం చేసుకున్నాడు. మలి సెట్‌లో థీమ్ అనూహ్యంగా విజృంభించాడు. చక్కటి ఫోర్‌హ్యాండ్ షాట్లతో ఆధిపత్యం ప్రదర్శించాడు. ఐదు ఏస్‌లు కొట్టడంతో పాటు రెండు సార్లు నాదల్ సర్వీస్‌ను బ్రేక్ చేసి 7-5తో సెట్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక అక్కడి నుంచి నాదల్ అసలు ఆట ప్రారంభమైంది. ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా చెలరేగిన రఫా వరుసగా రెండు సెట్లు గెలిచి టైటిల్ చేజిక్కించుకున్నాడు. మ్యాచ్ మొత్తం మీద మూడు ఏస్‌లు, 38విన్నర్లు బాదిన నాదల్.. ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడు సార్లు బ్రేక్ చేసి రికార్డు స్థాయిలో 12వ సారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. ఇంతకు ముందు 2005 నుంచి 2008 వరకు, 2010-14 మధ్య, 2017,2018లో నాదల్ ఫ్రెంచ్ ఓపెన్ విజేతగా నిలిచాడు.

ఫెదరర్‌కు రెండడుగుల దూరంలో..

కెరీర్‌లో అత్యధిక గ్రాండ్‌స్లామ్‌లు(20) సాధించిన స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ రికార్డుకు నాదల్ చేరువయ్యాడు. ఈ గెలుపుతో మొత్తం 18గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను తన ఖాతాలో వేసుకున్నాడు. మరో రెండు టైటిల్స్ నెగ్గితే ఫెదరర్‌ను చేరుకుంటాడు.

క్రికెట్ చూడ్డానికి వచ్చా..!

ఐసీసీ వరల్డ్ కప్ భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్‌లో మాల్యా

లండన్, జూన్ 9: ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచ్‌లను చూస్తున్నారు విజయ్ మాల్యా. ఆదివారం ఇక్కడి ఓవల్ స్టేడియంలో జరిగిన భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్‌ను మాల్యా తిలకించారు. టిక్కెట్‌తో స్టేడియంలోకి వెళ్తూ.. 'నేను గేమ్‌ను చూసేందుకు ఇక్కడికి వచ్చాను' అన్నారు. 63 ఏండ్ల విజయ్ మాల్యాపై భారతీకు అప్పగింత విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ మాజీ అధినేత భారతీయ బ్యాంకులకు రూ.9 వేల కోట్లకుపైగా బకాయి పడి, వాటిని ఎగవేసి 2016లో లండన్‌కు పారిపోయిన సంగతీ విదితమే. కాగా, మొదట్నుంచి క్రికెట్ అంటే బాగా ఇష్టపడే మాల్యా.. ప్రస్తుత ఐసీసీ వరల్డ్ కప్ లండన్ వేదికగానే జరుగుతుండటంతో తెగ ఎంజాయ్ చేసేస్తున్నారు. సెంట్రల్ లండన్‌లో గత శుక్రవారం ప్రారంభమైన ఊటీ స్టేషన్ అనే ఇండియన్ రెస్టారెంట్-స్పోర్ట్స్ బార్‌లో క్రికెట్ మ్యాచ్‌లను చూస్తూ ఉండిపోతున్నారు. అయితే భారత్ ఆడే మ్యాచ్‌లను మాత్రం స్టేడియంలకు వెళ్లి మరి వీక్షిస్తుండటం గమనార్హం. మరోవైపు బ్యాంకులకు తాను ఇవ్వాల్సిన బకాయిలను పూర్తిగా చెల్లిస్తానని వీలు చిక్కినప్పుడల్లా మాల్యా ఏకరువు పెడుతూనే ఉన్నారు.

పన్నుల భారం తగ్గాలి

సామాన్యుడికి ఊరటనివ్వాలి.. రాబోయే బడ్జెట్‌పై నిపుణుల మాట



న్యూఢిల్లీ, జూన్ 9: బడ్జెట్‌లో కేంద్రం సామాన్యులకు పన్నుల భారం తగ్గించే నిర్ణయాలు తీసుకోవాలని నిపుణులు అంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను వచ్చే నెల 5న లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆదాయం పన్ను (ఐటీ) మినహాయింపు పరిమితిని కనీసం రూ.3 లక్షలకు పెంచాలని, కనీస ప్రత్యామ్నాయ పన్ను (మ్యాట్)ను రద్దు చేయాలని పన్ను నిపుణులు సూచిస్తున్నారు. మ్యాట్ రద్దుతో వినియోగం పెరిగి సంస్థలకు లాభం చేకూరగలదని చెబుతున్నారు. వ్యాపార, పారిశ్రామిక సంఘం అసోచామ్ ఆదాయం పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నది. దీనివల్ల చాలామంది వేతన జీవులకు గొప్ప ఊరట లభించగలదని అసోచామ్ చెబుతున్నది. అలాగే ప్రామాణిక కోత రూ.లక్షకు మించి ఉండకుండా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. సోమవారం నుంచి నార్త్ బ్లాక్‌లోని ఆర్థిక మంత్రిత్వ శాఖ బడ్జెట్ రూపకల్పనలో నిమగ్నం కానుండగా, ఉద్యోగులు, ఇతరత్రా సిబ్బంది.. బడ్జెట్ ప్రవేశపెట్టేదాకా గృహ నిర్బంధంలోనే ఉండనున్నారు. ఈ నెల 17 నుంచి వచ్చే నెల 26 వరకు 17వ లోక్‌సభ తొలి సెషన్ జరుగనున్నది. ఇక వచ్చే నెల 4న ఆర్థిక సర్వే విడుదల కానున్నది.

11-23 మధ్య సంప్రదింపులు

ఈ నెల 11 నుంచి 23 వరకు సీతారామన్ ముందస్తు బడ్జెట్ సంప్రదింపులను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆర్థిక వేత్తలు, పరిశ్రమ వర్గాలతో సమావేశం కానున్నారు. ఇప్పటికే సీఐఐ, ఫిక్కీలు బడ్జెట్ కోసం తమ విలువైన సలహాలు, సూచనలు ఆర్థిక మంత్రిత్వ శాఖకు అందించారు. ఇదిలావుంటే ఈ నెల 20న జరిగే వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) మండలి సమావేశం సందర్భంగా ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులూ బడ్జెట్ కోసం తగు సూచనలు చేసే వీలున్నది. సీతారామన్ బడ్జెట్ బృందంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్, ముఖ్య ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్‌లున్నారు. ఆర్థిక కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ నేతృత్వంలోని ఈ అధికారిక బృందంలో వ్యయ కార్యదర్శి గిరీష్ చంద్ర ముర్ము, రెవిన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే, దీపం కార్యదర్శి అటాను చక్రబర్తి, ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్‌లు కూడా ఉన్నారు.

వ్యవసాయ సంఘాలతోనూ..

వ్యవసాయ సంఘాలతోనూ ముందస్తు బడ్జెట్ సంప్రదింపులను సీతారామన్ జరుపనున్నారు. వ్యవసాయ నిపుణుల సలహాలు, సూచనలను తీసుకోనున్నారు. మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో కరువు పరిస్థితులు, రుతుపవనాల ఆలస్యం అంచనాల మధ్య మంగళవారం సీతారామన్ సమావేశం కానున్నారు. కాగా, దేశ తొలి పూర్తికాల మహిళా ఆర్థిక శాఖ మంత్రిగా గత నెల సీతారామన్ పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆమె జరిపే తొలి అధికారిక సమావేశం ఇదే కానున్నది. వ్యవసాయ రంగం వృద్ధి, రైతుల ఆదాయం రెట్టింపు లక్ష్యాలతో ఈ బడ్జెట్‌లో ఎటువంటి నిర్ణయాలు తీసుకోవచ్చన్న దానిపై మంత్రి ఆరా తీసే అవకాశాలున్నాయి. చేపల పరిశ్రమ, పౌల్ట్రీ, పశు సంవర్ధక తదితర వ్యవసాయ అనుబంధ రంగాల బలోపేతంపైనా సీతారామన్ దృష్టి పెట్టారు.

బ్యాంకింగ్ సంస్కరణలు

బ్యాంకింగ్ రంగ సంస్కరణల కోసం పక్కా ప్రణాళికనూ ఈ బడ్జెట్‌లో సీతారామన్ ఆవిష్కరించవచ్చునని బ్యాంకింగ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థను రూ.5 లక్షల కోట్లకు చేర్చాలన్న మోదీ సర్కారు ఆశయ సాధనకు బలమైన బ్యాంకింగ్ వ్యవస్థ అవసరమని గుర్తుచేస్తున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనానికి తెరతీసిన కేంద్రం.. మొండి బకాయి (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ)ల సమస్య నివారణకూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)తో కలిసి పనిచేస్తున్న విషయం తెలిసిందే. కాగా, దేశ జీడీపీ ఐదేండ్ల కనిష్ఠాన్ని తాకిన వేళ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నిర్మలా సీతారామన్‌పైనే ఇప్పుడు అందరి దృష్టి నెలకొన్నది. ఆమె ఈ బడ్జెట్‌ను జనాకర్షకంగా తీర్చిదిద్దుతారా? లేదంటే సంస్కరణలు, ఆర్థిక లక్ష్యాలకు ప్రాధాన్యతనిస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.

20న జీఎస్టీ మండలి సమావేశం

ఈ-ఇన్వాయిస్ టర్నోవర్ పరిమితి రూ.50 కోట్లు

ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతిపాదించే అవకాశం

న్యూఢిల్లీ, జూన్ 9: ఈ నెల 20న వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) మండలి సమావేశం కానున్నది. ఈ సందర్భంగా బిజినెస్ టు బిజినెస్ (బీ2బీ) అమ్మకాల కోసం కేంద్రీకృత ప్రభుత్వ పోర్టల్‌పై ఈ-ఇన్వాయిస్ పొందడానికి టర్నోవర్ పరిమితిని రూ.50 కోట్లుగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతిపాదించే అవకాశాలున్నాయి. జీఎస్టీ ఎగవేతలకు అడ్డుకట్ట వేయడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకోవచ్చన్న సంకేతాలున్నాయి. ఈ మేరకు ఓ ఉన్నతాధికారి ద్వారా అందుతున్న సమాచారం. రాష్ట్రాలతో సంప్రదింపుల తర్వాత ఈ-ఇన్వాయిస్ జారీ కోసం టర్నోవర్ పరిమితిపై ఓ తుది నిర్ణయం తీసుకోవచ్చని చెబుతున్నారు. కాగా, దాఖలైన రిటర్నుల ప్రకారం రూ.50 కోట్లకుపైగా టర్నోవర్ ఉన్న వ్యాపారులు 68,041 మంది ఉన్నారు. 2017-18 మొత్తం జీఎస్టీ చెల్లింపులకు అన్వయించుకుని చూసినట్లైతే వీరి టర్నోవర్ వాటా 66.6 శాతంతో సమానం. అయినప్పటికీ జీఎస్టీ చెల్లింపుదారుల్లో వీరు 1.02 శాతం మాత్రంగానే ఉన్నారు. వ్యవస్థలో నమోదవుతున్న దాదాపు 30 శాతం బీ2బీ ఇన్వాయిస్‌లు వీరివే. దీంతో పన్ను ఎగవేతలు భారీగా ఉన్నాయన్న నిర్ణయానికొచ్చిన కేంద్రం.. వాటికి చెక్ పెట్టాలనే ఈ-ఇన్వాయిస్ వ్యవస్థను తీసుకొస్తున్నది. దానికి రూ.50 కోట్ల టర్నోవర్ పరిమితి ప్రతిపాదనతో ముందుకొస్తున్నదని సదరు అధికారి పీటీఐకి తెలిపారు. ప్రతి నెలా రూ.50,000లకు మించి 3.9 కోట్ల బీ2బీ ఇన్వాయిస్‌లు నమోదవుతున్నాయి. రోజుకు 12 లక్షల చొప్పున జారీ అవుతున్నాయి. మొత్తం బీ2బీ ఇన్వాయిస్‌లను పరిగణనలోకి తీసుకుంటే కోటీపైనే. కాగా, సెప్టెంబర్ నుంచి ఈ-ఇన్వాయిస్ వ్యవస్థను ప్రారంభించడానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రయత్నిస్తున్నది.

ఈ ఏడాది 40 శాతం వృద్ధి

NATCO

■ నాట్కో ఫార్మా సీఈవో రాజీవ్

హైదరాబాద్, జూన్ 9: భారత్‌తోపాటు బ్రెజిల్, కెనడా మార్కెట్లపై ప్రముఖ ఫార్మా సంస్థ నాట్కో భారీ అంచనాలు పెట్టుకున్నది. ఈ మూడు దేశాల నుంచి ఆశించిన స్థాయిలో ఆదాయం సమకూరనుండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 30 శాతం నుంచి 40 శాతం మధ్యలో వృద్ధి నమోదవనున్నదని నాట్కో ఫార్మా వైస్-చైర్మన్, సీఈవో రాజీవ్ నన్నపనేని తెలిపారు. వీటిలో భారత మార్కెట్లో వృద్ధి 15 శాతం నుంచి 20 శాతం మధ్యలో ఉంటుందని చెప్పారు. ఇప్పటి వరకు బ్రెజిల్‌లో భారీ స్థాయిలో ఔషధాలను ప్రవేశపెట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో వృద్ధిని నమోదు చేసుకోలేక పోయామని, కానీ ఈ సారి మాత్రం రెండంకెల వృద్ధిని ఆశిస్తున్నట్లు వాటాదారుల జరిగిన సమావేశంలో ఆయన చెప్పారు. కెనడా మార్కెట్‌పై కూడా ప్రత్యేక దృష్టి సారించడంలో భాగంగా ఇక్కడ కూడా పలు మందులను విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ఏడాది దేశీయ మార్కెట్లోకి 8 నుంచి 10 మందులను విడుదల చేయడానికి సిద్ధమవుతున్న సంస్థ..బ్రెజిల్, కెనడా మార్కెట్లలోకి మూడు నుంచి నాలుగు విడుదల చేయనున్నదన్నారు. మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం రూ.2,242 కోట్ల నుంచి రూ.2,225 కోట్లకు పడిపోగా, నికర లాభంలో కూడా రూ.695 కోట్ల నుంచి రూ.642 కోట్లకు తగ్గింది. వీటిలో దేశీయంగా ఔషధాలను విక్రయించడం ద్వారా రూ.735 కోట్లు సమకూరగా, అదే కెనడా నుంచి రూ.96 కోట్లు, బ్రెజిల్ నుంచి రూ.33 కోట్లు లభించాయి.

వైజాగ్‌లో రెండో విమానాశ్రయం!

■ సంకేతాలిచ్చిన ఏఏఐ చైర్మన్ గురుప్రసాద్

సియోల్, జూన్ 9: విమాన ప్రయాణికుల పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అతిపెద్ద నగరాల్లో రెండో విమానాశ్రయం ఏర్పాటు చేసే అవకాశాలను పౌర విమానయాన మంత్రిత్వ శాఖ పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించి భూమిని కేటాయించడానికి ముందుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వాలకు అధిక ప్రాధాన్యతనివ్వడంతోపాటు అక్కడ రెండో ఎయిర్‌పోర్ట్ నెలకొల్పేదానిపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు ఎయిర్‌పోర్ట్స్ అథార్టీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) చైర్మన్ గురుప్రసాద్ మోహపాత్రా తెలిపారు. ఇప్పటికే ఏఏఐ ఆధ్వర్యంలో 125 విమానాశ్రయాలు నడుస్తుండగా, వీటిలో 11 అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌లు ఉన్నాయి. విమానాశ్రయల ఏర్పాటుకు భూసేకరణ చాలా సమస్యగా మారిందని, ఒక్కో విమానాశ్రయాన్ని నిర్మించడానికి కనీసంగా 2 వేల ఎకరాల భూమి అవసరమవుతుందన్నారు. భూసేకరణకు సంబంధించి విమానయాన మంత్రిత్వశాఖ, ఏఏఐలు కలిసి ఇప్పటికే పలు రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు కూడా రాసినప్పటికి ఎలాంటి స్పందన లేదని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. ఇప్పటికే ముంబై, ఢిల్లీలలో రెండు విమానాశ్రయాలు ఉండగా..విశాఖపట్నంలో కూడా రెండో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. వీటితో పాటు కోల్‌కతా, చెన్నై, పుణెతోపాటు ఇతర నగరాల్లో రెండో ఎయిర్‌పోర్ట్ నిర్మించడానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రపంచంలో అధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న విమానయాన రంగంల్లో ఒకటైన భారత్‌లో ఏప్రిల్ నెలలో ప్రతికూల వృద్ధి నమోదైంది. ఆర్థిక సంక్షోభంతో మూతపడిన జెట్ ఎయిర్‌వేస్ ఇందుకు కారణమన్నారు. ఏప్రిల్ నెలలో 2.67 కోట్ల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకోగా, 2.75 లక్షల టన్నుల సరుకు రవాణా అయింది. జెట్ ఎయిర్‌వేస్ మూతపడటంతో ఏఏఐపై ఎలాంటి ప్రభావం పడలేదని, కంపెనీ బకాయిలు పూర్తి స్థాయిలో చెల్లింపులు జరుపడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

ఓఐఎల్‌కు 12 చమురు బావులు!

ఓఎన్‌జీసీ, వేదాంతకు చెరో తొమ్మిది

న్యూఢిల్లీ, జూన్ 9: ప్రభుత్వరంగ ఇంధన విక్రయ సంస్థ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ), మైనింగ్ దిగ్గజం అనిల్ అగర్వాల్‌కు చెందిన వేదాంత లిమిటెడ్‌లు చెరో తొమ్మిది చమురు, గ్యాస్ బావులను దక్కించుకున్నట్లు తెలుస్తున్నది. 32 బావుల కోసం తాజాగా నిర్వహించిన వేలంలో రిలయన్స్ ఇండస్ట్రీస్-బీపీలు ఒక్క బావిని చేజిక్కించుకోగా, మరో ప్రభుత్వరంగ సంస్థ ఆయిల్ ఇండియా లిమిటెడ్(ఓఐఎల్)కు 12 బావులు లభించాయని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్(డీజీహెచ్)కు చెందిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఓఎన్‌జీసీ, వేదాంతా, ఆయిల్ ఇండియాలు లిమిటెడ్‌లు టాప్ బిడ్డర్లుగా నిలిచాయి. రిలయన్స్-బీపీ సంయుక్తంగా బంగాళాఖాతంలోని కృష్ణ గోదావరి బేసిన్‌లో ఓఎన్‌జీసీకి చెందిన చమురు బావిని దక్కించుకున్నట్లు తెలుస్తున్నది. వేలంలో బావులను దక్కించుకున్న కంపెనీల పూర్తి వివరాలు తెలియాలంటే మరో కొన్ని రోజులు ఆగాల్సి ఉంటుంది. ఎందుకంటే ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ(సీసీఈఏ) అనుమతించిన తర్వాతనే ఈ జాబితా బయటకు పొక్కనున్నది. ఓపెన్ అరెంజ్ లైసెన్సింగ్ పాలసీ(ఓఏఎల్‌పీ) రౌండ్-2లో భాగంగా 14 బ్లాక్‌లను వేలం వేయగా, మరో 18 చమురు-గ్యాస్ బ్లాకులు, ఐదు కోల్-బెడ్ మిథైన్ బ్లాక్‌ల వేలం మే 15న ముగిసింది. ఎనిమిదేండ్ల తర్వాత రిలయన్స్-బీపీ తొలి చమురు బావిని దక్కించుకున్నట్లయిందని ఆ వర్గాలు వెల్లడించాయి. 2013లో కేజీ-డీ6 చమురు బావులలో నీరు, ఇసుక అధికంగా చేరడంతో సగానికి పైగా బావుల్లో ఉత్పత్తిని నిలిపివేసింది.

2017లోనే బయటపడేది

■ ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ మోసంపై ఎస్‌ఎఫ్‌ఐవో

న్యూఢిల్లీ, జూన్ 9: ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ కుంభకోణం 2017లోనే బయటపడేదని ఈ కేసును విచారణ చేస్తున్న తీవ్ర మోసాల దర్యాప్తు కార్యాలయం (ఎస్‌ఎఫ్‌ఐవో) తెలిపింది. సంస్థలో ఎప్పట్నుంచో మోసాలు జరుగుతున్నాయని, దీనిపై వచ్చిన విజిల్ బ్లోవర్ ఫిర్యాదును స్వతంత్ర డైరెక్టర్లతో కలిసి యాజమాన్యం తొక్కిపట్టిందని ఎస్‌ఎఫ్‌ఐవో అధికారులు చెప్పారు. ఈ మేరకు తమ దర్యాప్తులో వెల్లడైందన్నారు. అడుగడుగునా నిర్లక్ష్యం పేరుకుపోయిందని, బకాయిల వసూళ్లను కావాలనే ఆలస్యం చేశారని వివరించారు. 2017 మార్చిలో విజిల్ బ్లోవర్ నుంచి ఫిర్యాదు అందితే దానిపై ఆ ఏడాది డిసెంబర్‌లో ఆడిటింగ్ కమిటీ చర్చ చేపట్టిందని అన్నారు. యాజమాన్యంతో ఆడిటర్లూ కుమ్మక్కై కుట్రకు తెరతీసినట్లు ఎస్‌ఎఫ్‌ఐవో దర్యాప్తులో అధికారులు గుర్తించారు. దేశీయ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రంగాన్ని ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ కుంభకోణం కుదిపేయగా, ఇది గతేడాది వెలుగుచూసిన విషయం తెలిసిందే. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ గ్రూప్ రూ.90,000 కోట్లకుపైగా రుణ భారాన్ని మోస్తుండగా, గ్రూప్‌లోని పలు సంస్థలు చెల్లింపుల్లో వరుసగా వైఫల్యమవుతున్న క్రమంలో మోసం సంగతి బయటికొచ్చింది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదం

■ వాణిజ్య యుద్ధాలపై జీ20 నేతల ఆందోళన

జీ20 ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ల బృందంలో నిర్మలా సీతారామన్

ఫుకువోక, జూన్ 9: వాణిజ్య యుద్ధాలపై జీ20 సభ్య దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అమెరికాకు చైనాసహా ఇతర దేశాలకు మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధాలు.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రమాదంలోకి నెడుతున్నాయని పలువురు జీ20 నేతలు అభిప్రాయపడ్డారు. ఇక్కడ రెండు రోజులపాటు జరిగిన జీ20 దేశాల ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ల సదస్సు ఆదివారం ముగిసింది. అమెరికా-చైనా మధ్య మొదలైన వాణిజ్య యుద్ధం.. వచ్చే ఏడాది ప్రపంచ జీడీపీని 0.5 శాతం లేదా 455 బిలియన్ డాలర్ల మేర క్షీణింపజేసే వీలుందని ఈ సందర్భంగా అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టిన్ లగార్డే అన్నారు. అమెరికా-చైనా పరస్పర సుంకాలు ఆ రెండు దేశాల్నేగాక, ప్రపంచ ఆర్థిక వ్యవస్థని కుంగదీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరో సంక్షోభంలోకి గ్లోబల్ ఎకానమీ పడిపోక ముందే వాణిజ్య యుద్ధాలకు ముగింపు పలుకాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మెక్సికో-అమెరికా మధ్య కుదిరిన సయోధ్యను స్వాగతించిన జీ20 దేశాధినేతలు.. అమెరికా-చైనా మధ్య కూడా ఓ సహృద్భావ ఒప్పందం జరుగాలని ఆకాంక్షించారు. వలసలపై అమెరికా-మెక్సికోల మధ్య ఓ డీల్ కుదరగా, మెక్సికో వస్తూత్పత్తులపై 5 శాతం సుంకాల విధింపును ట్రంప్ సర్కారు ఉపసంహరించుకున్నది.

మరిన్ని సుంకాలే

అమెరికా ఆర్థిక మంత్రి స్టీవెన్ మ్నూచిన్ శనివారం ఇక్కడ విలేఖరులతో మాట్లాడుతూ ఈ నెలాఖరులో ఒసాకాలో జరిగే జీ20 సదస్సులో తమ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మధ్య చర్చలు విఫలమైతే.. చైనాపై మరిన్ని సుంకాలు వేస్తామని స్పష్టం చేయడం గమనార్హం. ఒకవేళ ఈ లోగా చైనా చర్చలకు ముందుకొస్తే.. మేమూ చర్చిస్తామన్న ఆయన ఫలప్రదం కాకపోతే పన్నుల భారం తప్పదని హెచ్చరించారు.

రిలయన్స్ పవర్ నష్టం రూ.3,558 కోట్లు

న్యూఢిల్లీ, జూన్ 9: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్ నష్టాల పరంపర కొనసాగుతున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలోనూ రూ.3,558.51 కోట్ల నష్టం వచ్చినట్లు సంస్థ ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలానికిగాను సంస్థ రూ.189.21 లాభాన్ని గడించింది. ఈ నెల 8న సమావేశమైన కంపెనీ బోర్డు గతేడాది చివరి త్రైమాసికం, మొత్తం ఆర్థిక సంవత్సరం ఆర్థిక ఫలితాలకు ఆమోదముద్ర వేసింది. వీటితో పాటు రుణాలు తగ్గించుకోవడానికి నిధుల సేకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికిగాను సంస్థ రూ.2,951.82 కోట్ల నష్టాన్ని చవిచూసింది. 2017-18లో సంస్థ రూ.840.46 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నది.

అమెరికా నిషేధం ఉన్నా..

■ 5జీ కాంట్రాక్టుల్లో హువావీ దూకుడు

బీజింగ్, జూన్ 9: హువావీ 5జీ సేవల వినియోగంపై అమెరికా నిషేధం ఉన్నా.. ప్రపంచ మార్కెట్‌లో దాని ప్రభావం ఏ మాత్రం కనిపించడం లేదు. అంతర్జాతీయ 5జీ టెలీకమ్యూనికేషన్స్ వ్యవస్థలో ఈ చైనా టెలికం దిగ్గజం దూసుకెళ్తున్నది మరి. ఇప్పటిదాకా 30 దేశాల్లో వాణిజ్యపరంగా 46 5జీ కాంట్రాక్టులను పొందినట్లు హువావీ వెల్లడించింది. హువావీ.. చైనా ప్రభుత్వం కనుసన్నల్లో పనిచేసే సంస్థని, ఇతర దేశాలపై గూఢచర్యం చేస్తున్నదని ఆరోపిస్తూ ఈ సంస్థపై ట్రంప్ సర్కారు నిషేధం విధించిన విషయం తెలిసిందే. దీంతో గ్లోబల్ మార్కెట్‌లో హువావీ సంగతి అయిపోయిందని అంతా భావించిన నేపథ్యంలో.. ఆ అంచనాలను తలదన్నేలా హువావీ పరుగులు తీస్తుండటం అందరినీ ఆశ్చర్యపరుస్తున్నది. ఈ క్రమంలోనే గూగుల్ సైతం హువావీ నిషేధం పట్ల అమెరికా ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. హువావీ ఫోన్లకు గూగుల్ ఆండ్రాయిడ్ అప్లికేషన్లు దూరం కానున్న సంగతి విదితమే. దీంతో హువావీ జోరు చూస్తుంటే అప్లికేషన్ల మార్కెట్‌లో తమ ఏకఛత్రాధిపత్యానికి త్వరలోనే బ్రేకులు పడవచ్చన్న భయం ఇప్పుడు గూగుల్‌లో కనిపిస్తున్నది. కాగా, హువావీపై అమెరికా అధ్యక్షుడి నిర్ణయాన్ని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తప్పుబట్టినది తెలిసిందే.

పారిశ్రామిక ప్రగతి కీలకం

రూపాయి, ద్రవ్యోల్బణ గణాంకాలు కూడా

స్టాక్ మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్న అంశాలు

న్యూఢిల్లీ, జూన్ 9: గడిచిన రెండువారాలుగా తీవ్ర హెచ్చుతగ్గులకు లోనైన స్టాక్ మార్కెట్లు ఈ వారంలో పలు స్థూల ఆర్థికాంశాలు కీలకంగా మారనున్నాయి. ఈవారంలోనే విడుదలకానున్న పారిశ్రామిక వృద్ధి రేటు, ద్రవ్యోల్బణం, టోకు ధరల సూచీ ఆధారిత గణాంకాలతోపాటు అమెరికా-చైనా దేశాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం, ఇంధన ధరలు కూడా మార్కెట్లపై ప్రభావితం చేయనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. బ్యాంకింగేతర ఆర్థిక సేవల సంస్థలకు నిధుల లభ్యత ఆందోళనకర స్థాయికి చేరుకోవడంతో గతవారంలో భారీగా పడిపోయిన ఈక్విటీ మార్కెట్లు ఈవారంలోనూ జాగ్రత్తపడే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. దేశీయ స్థూల ఆర్థికాంశాలతోపాటు రుతుపవనాలు కూడా ఈక్విటీల కదలికలను దిశానిర్దేశం చేయనున్నాయి. వచ్చే నెలలో ప్రవేశపెట్టబోతున్న సార్వత్రిక బడ్జెట్‌లో తీసుకునే నిర్ణయాలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈవారంలో ముందస్తు సమావేశాలు ప్రారంభించడం కూడా మార్కెట్ల ట్రేడింగ్‌ను ప్రభావితం చేయనున్న అంశాల్లో ఒకటని జియోజిట్ ఫైనాన్షియల్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. అమెరికా-మెక్సికో-చైనా ట్రేడ్‌వార్ ఇప్పట్లో కొలిక్కి వచ్చే అవకాశాలు లేకపోవడం, మరోవైపు ఇంధన ధరలు ఎగువ ముఖం పడే అవకాశాలు ఉండటంతో మార్కెట్ల పతనం తప్పదని ఆయన పేర్కొన్నారు. బుధవారం పారిశ్రామిక వృద్ధిరేటుతోపాటు మే నెలకుగాను ద్రవ్యోల్బణ గణాంకాలు విడుదల కాబోతున్నాయి. టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం మాత్రం శుక్రవారం విడుదల కానున్నది.

ఎఫ్‌పీఐల పెట్టుబడుల జోరు

■ ప్రస్తుత నెలలో రూ.7 వేల కోట్లు

వరుసగా నాలుగు నెలలుగా దేశీయ ఈక్విటీ మార్కెట్లలోకి పెట్టుబడులు పెడుతున్న విదేశీ ఇన్వెస్టర్లు ప్రస్తుత నెలలోనూ కొనసాగించారు. ప్రస్తుత నెల తొలివారంలో రూ.7,095 కోట్ల నిధులను క్యాపిటల్ మార్కెట్లలో కుమ్మరించారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని నూతన సర్కార్ సంస్కరణలను కొనసాగించనుండటం ఇందుకు దోహదం చేస్తున్నది. మే నెలలో రూ.9,031.15 కోట్లు ఇన్వెస్ట్ చేసిన ఎఫ్‌పీఐలు..ఏప్రిల్‌లో రూ.16,093 కోట్లు, మార్చి నెలలో రూ.45,981 కోట్లు, ఫిబ్రవరిలోనూ రూ.11,182 కోట్లను దేశీయ క్యాపిటల్ మార్కెట్ల(ఈక్విటీ, డెబిట్)లోకి నిధులు చొప్పించారు. తాజాగా డిపాజిటరీ వద్ద ఉన్న సమాచారం మేరకు జూన్ 3 నుంచి 7 మధ్యకాలంలో ఈక్విటీ మార్కెట్లలోకి రూ.1,915.01 కోట్లను పెట్టుబడిగా పెట్టిన ఎఫ్‌పీలు..డెబిట్ మార్కెట్లలోకి రూ.5,180.43 కోట్లు చొప్పించారు. రంజాన్ సందర్భంగా గత బుధవారం స్టాక్ మార్కెట్లు పనిచేయలేవు. గతవారంలో ఒక్కరోజు కూడా ఎఫ్‌పీఐలు తమ పెట్టు

గిరిజన గురుకులాలను దేశవ్యాప్తంగా ఏర్పాటుచేయాలి

- మాజీ ఎంపీ సీతారాంనాయక్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఏర్పాటుచేసిన తరహాలో అన్ని రాష్ట్రాల్లో 500 జనాభా గల తండాలను గ్రామ పంచాయతీలుగా చేయాలని, గిరిజన విద్యార్థులకు దేశవ్యాప్తంగా గురుకుల పాఠశాలలు ఏర్పాటుచేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ కోరారు. మహారాష్ట్రలోని ధానేలో ఆదివారం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం (ఏఐబీఎస్సెస్) నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం జాతీయ అధ్యక్షుడు శంకర్‌పవార్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ప్రత్యేక అతిథిగా హాజరైన సీతారాంనాయక్ మాట్లాడుతూ.. ఏఐబీఎస్సెస్‌ను బలోపేతంచేసి దేశంలోని 10 కోట్ల మంది బంజారాల సమస్యలను ప్రధానమంత్రి, ముఖ్య మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పేదవారిని ఆదుకోవాలని కోరారు. ప్రధాని మోదీ దేశంలో ఒకే జాతికి చెందిన బంజారాలకు ప్రత్యేకమైన అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేస్తామని చెప్పినందుకు జాతీయ ముఖ్య నాయకులు, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో తెలంగాణ నుంచి కే జగన్నాథరావు, ఏ శ్యాంనాయక్, పీ పీర్యానాయక్, ఆర్ మోహన్‌సింగ్, కే తారాచంద్, సీ కిషన్‌సింగ్ , రాజునాయక్ పాల్గొన్నారు.

ఇద్దరి ప్రాణాలు తీసిన డ్రైవింగ్ సరదా

- కూలీల గుడిసెల్లోకి దూసుకెళ్లిన టిప్పర్
- తండ్రీకూతురు దుర్మరణం

ప్రమాదానికి కారణమైన టిప్పర్

కుత్బుల్లాపూర్: సరదా డ్రైవింగ్ ఇద్దరి ప్రాణాలను బలితీసుకొన్నది. సరదాగా నడిపిన టిప్పర్ అదుపుతప్పి గుడిసెల్లోకి దూసుకెళ్లిన ఘటనలో ఆదమరిచి నిద్రపోతున్న తండ్రీకూతురు అక్కడికక్కడే చనిపోగా.. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని సూర్గుజా జిల్లాలోని డోయి, దావుద్గావ్, ఉదయ్‌పూర్ గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు జీవనోపాధి నిమిత్తం ఐదేండ్ల క్రితం నగరానికి వలస వచ్చి షాద్‌నగర్‌లో ఉంటున్నారు. గాజులరామారం సర్కిల్ పరిధిలోని మెట్టగానిగూడలో నిర్మిస్తున్న మోడీ వెంచర్స్‌లో పనిచేసేందుకు వచ్చిన రెండు కుటుంబాలు.. ఇక్కడే గుడిసెలు వేసుకొని నివసిస్తున్నాయి. వాహనం నడపటం ఇష్టమున్న మరో కూలీ కీర్తన్.. అక్కడే నిలిపి వుంచిన యాజమాన్యానికి చెందిన టిప్పర్ (టీఎస్12యూబీ1535)ను నడిపే ప్రయత్నం చేశాడు. అనుభవం లేకపోవడంతో వేగాన్ని అదుపుచేయలేక పక్కనున్న గుడిసెల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో పెరిలాల్ (34), ఆయన కూతురు సరస్వతి (2) అక్కడికక్కడే చనిపోయారు. పెరిలాల్ భార్య సోనుకుమారి, కూలీ దేవేంద్రకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించి, జీడిమెట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మైనార్టీ యువతకు కార్ల పంపిణీ రేపు

- టీఎస్ఎంఎఫ్‌సీ ఎండీ ఎంఏ వహీద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మైనార్టీ యువతకు ఉపాధి కల్పించేందుకు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ 'డ్రైవర్ ఎంపవర్మెంట్ స్కీం' కింద మంగళవారం (11న) కార్లను పంపిణీ చేయనున్నట్టు టీఎస్ఎంఎఫ్‌సీ ఎండీ ఎంఏ వహీద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017-18 సంవత్సరానికి 500 కార్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 472 మందిని ఎంపిక చేశాసి, మొదటి విడుతలో 342 మందికి పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్లను ఉబెర్ సర్వీసెస్‌లో నడుపుకోవచ్చని చెప్పారు.

క్షీణించిన అక్బరుద్దీన్ ఆరోగ్యం

- త్వరగా కోలుకోవాలని అల్లాను ప్రార్థించండి
- ఎంఐఎం కార్యకర్తలు, ప్రజలకు ఎంపీ అసదుద్దీన్ పిలుపు
- అక్బర్ ఆరోగ్యం నిలకడగానే ఉంది: మజ్లిస్ పార్టీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎంఐఎం శాసనసభాపక్ష నాయకుడు, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఆరోగ్యం క్షీణించింది. ఆయన లండన్‌లోని దవాఖానలో చికిత్స పొందుతున్నారు. 2011 మే 4న అక్బరుద్దీన్‌పై చాంద్రాయణగుట్టలో హత్యాయత్నం జరిగింది. ఊరేగింపులో పాల్గొన్న ఒవైసీపై మహమ్మద్ పహిల్వాన్‌తోపాటు కొందరు కత్తులు, రివాల్వర్‌తో దాడికి పాల్పడ్డారు. పెద్ద పేగుకు గాయం, కిడ్నీలో బుల్లెట్ ఉండిపోవడంతో తరుచూ అనారోగ్యానికి గురవుతున్నారు. లండన్‌లో చికిత్స పొంది, హైదరాబాద్ వచ్చి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం దారుస్సలాంలో జరిగిన ఈద్-మిలాప్ కార్యక్రమంలో అసదుద్దీన్ మాట్లాడుతూ.. తన తమ్ముడు, ప్రజా నాయకుడు అక్బరుద్దీన్ ఆరోగ్యం మళ్లీ క్షీణించిందని, చికిత్స కోసం లండన్‌లోని దవాఖానకు తరలించినట్టు ప్రకటించడం సంచలనం సృష్టించింది. అక్బరుద్దీన్ ఒవైసీ ఆరోగ్యం మెరుగుపడాలని, పెద్దపులిలా తిరిగి రావాలని అల్లాను ప్రార్థించాలని ప్రజలను కోరారు. కాగా, అక్బర్ ఆరోగ్యం మెరుగుపడిందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంఐఎం వర్గాలు వెల్లడించాయి.

ఉద్యోగులకు అన్యాయం జరుగదు

- సీఎం కడుపులో తలపెట్టి సమస్యలు పరిష్కరించుకుంటాం
- గచ్చిబౌలి సొసైటీ సభ్యులకు ఇండ్ల స్థలాలు ఇప్పిస్తాం
- వాటాదారులకు కార్డుల పంపిణీలో స్వామిగౌడ్, టీఎన్జీవో నేతల ఉద్ఘాటన
- డీఏ పెంచినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

హౌసింగ్ సొసైటీ వాటాదారులకు పంపిణీ చేసిన కార్డులను ప్రదర్శిస్తున్న శాసనమండలి మాజీ చైర్మన్ స్వామీగౌడ్. చిత్రంలో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఎస్‌పీఎస్సీ సభ్యుడు విఠల్ తదితరులు ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏ విషయాల్లోనూ అన్యాయం జరుగదని తెలంగాణ శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఎస్‌పీఎస్సీ సభ్యుడు విఠల్, ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి అన్నారు. భాగ్యనగర్ తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (బీటీఎన్జీవో) ఆధ్వర్యంలోని గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీని తెలంగాణ ఎన్జీవోగా మార్చి వాటాదారులకు ఆదివారం ప్రియదర్శిని ఆడిటోరియంలో కార్డులను పంపిణీ చేశారు. బీటీఎన్జీవో అధ్యక్షుడు ఎం సత్యనారాయణగౌడ్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు ప్రసంగిస్తూ.. ఉద్యోగుల సమస్యలన్నీ తెలిసిన కే చంద్రశేఖర్‌రావు ముఖ్యమంత్రిగా ఉండటం అదృష్టమన్నారు. ఇటీవలే డీఏ పెంచిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కొంతమంది తమ స్వార్థ రాజకీయాల కోసం ఉద్యోగుల్లో చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీలో అర్హులైన వాటాదారులందరికీ ఇండ్ల స్థలాలు వస్తాయని, సీఎం కేసీఆర్ కడుపులో తలపెట్టైనా ఇండ్ల స్థలాలు ఇప్పిస్తామని భరోసా కల్పించారు. సొసైటీకి కేటాయించిన భూమి అన్యాక్రాంతం కాకుండా చూసేందుకే రాష్ట్ర ప్రభుత్వం మెమో జారీ చేసిందని, దీన్ని ఎత్తివేయించి, అర్హులైన వారందరికీ నివేశన స్థలాలు ఇప్పిస్తామని స్వామిగౌడ్, దేవీ ప్రసాద్, విఠల్, రవీందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఏపీలో తెలంగాణ ఫ్రెండ్లీ ప్రభుత్వం రావడంతో తెలంగాణ ప్రాంత ఉద్యోగులు త్వరలోనే స్వరాష్ట్రానికి వస్తారని అన్నారు. ఉద్యోగుల సమస్యలను సీఎం కేసీఆర్ క్రమంగా పరిష్కరిస్తారన్న నమ్మకం ఉన్నదని తెలిపారు. గతంలో చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి కూడా రోడ్డెక్కి ఆందోళన చేయాల్సివచ్చేదని, కానీ స్వరాష్ట్రంలో అలాంటి పరిస్థితులు లేవని సంతోషాన్ని వ్యక్తం చేశారు. టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, అసోసియేట్ ప్రెసిడెంట్ బీ రేచల్, కోశాధికారి రామినేని శ్రీనివాస్ రావు, ప్రతినిధులు కొండల్‌రెడ్డి, శ్రీకాంత్, టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, బీటీఎన్జీవో కార్యదర్శి బలరాం, కోశాధికారి మల్లారెడ్డి టీఎన్జీవో వైద్య విభాగం అధ్యక్షుడు జూపల్లి రాజేందర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పీఆర్సీ నివేదికను సీఎంకు సమర్పించాలి: ముజాహిద్

రాష్ట్రంలో ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య స్నేహపూర్వక వాతావరణం కొనసాగుతున్నదని, ఈ సమయంలోనే పీఆర్సీ నివేదికను సీఎం కేసీఆర్‌కు సమర్పించాలని తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ కోరారు. టీఎన్జీవో భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని సీఎంతో పాటు సీఎస్ ఎస్కే జోషికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశానన్నారు. ఏపీలో పని చేస్తున్న ఉద్యోగులను వెంటనే తీసుకురావాలని, కొత్త జిల్లాల్లో పనిచేస్తున్న వారికి ఇంటి అద్దె అలవెన్సు ఇప్పించాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలను ఎత్తివేసిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అయితే కొన్ని శాఖల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న వారి అర్హతలను పరిశీలించి వారిని పర్మినెంట్ చేయాలని ముజాహిద్ కోరారు.

బీవీ పరమేశ్వరరావు కన్నుమూత

- సంతాపం తెలిపిన గవర్నర్ నరసింహన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భాగవతుల చారిటబుల్ ట్రస్ట్ (బీసీటీ) వ్యవస్థాపకుడు డాక్టర్ బీవీ పరమేశ్వరరావు (86) విశాఖపట్నంలోని తన స్వగృహంలో ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయనకు భార్య కల్యాణి భాగవతుల, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. 1967లో అమెరికాలో న్యూక్లియార్ సైన్స్‌లో పీహెచ్‌డీ అందుకొన్నారు. ప్రజల బాగు కోసం ఏదో ఒకటి చేయాలనుకొని విశాఖపట్నం జిల్లాకు తిరిగివచ్చారు. యలమంచిలి మండలంలోని దిమిలి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజలను చైతన్యవంతులను చేశారు. ఆయన మృతి పట్ల గవర్నర్ నరసింహన్ ప్రగాఢ సంతాపం తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయ అభివృద్ధికి ఆయన సేవలు మరువరానివని కొనియాడారు.

కోడెల కుమార్తెపై కేసు

- ఇటీవల కొడుకుపై.. తాజాగా కుమార్తెపై ఎఫ్ఐఆర్
- అక్రమ వసూళ్లపై ఠాణాలో బాధితురాలి ఫిర్యాదు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు తనయుడు కోడెల శివరాంపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదుకాగా, తాజాగా ఆయన కుమార్తె డాక్టర్ పూనాటి విజయలక్ష్మి నర్సరావుపేటలో కేసు నమోదయింది. తండ్రి కోడెల అధికారాన్ని అడ్డంపెట్టుకుని కుమార్తె విజయలక్ష్మి విలువైన భూమి కబ్జాకు అనుచరులతో కలిసి ప్రయత్నించారని, భూ యజమానులను బెదిరించి రూ.15 లక్షలు వసూలుచేశారని ఆరోపణలు వచ్చాయి. మరో రూ.5 లక్షల కోసం వేధింపులకు దిగడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. గుంటూరు జిల్లా నర్సరావుపేటలోని రామిరెడ్డిపేటకు చెందిన అర్వపల్లి పద్మావతికి కేసానుపల్లి వద్ద ఎకరం పొలం ఉంది. ఆ భూమిని 2002లో రావిపాడుకు చెందిన పూదోట మారయ్య వద్ద కొనుగోలు చేసింది. టీడీపీ అధికారంలోకి వచ్చాక అమాయకుల భూములపై కోడెల కుమారుడు శివరాం, కుమార్తె విజయలక్ష్మి కన్నేసి.. లేని వివాదాలను సృష్టించి డబ్బులు వసూలుచేశారు. ఇప్పటికే ఇచ్చిన 15 లక్షలకుతోడుగా మరో 5 లక్షలు ఇవ్వాలని ఒత్తిడిచేయడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు విజయలక్ష్మిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

చట్టం నుంచి తప్పించుకోలేదు: విజయసాయిరెడ్డి

ప్రజలు, వ్యాపారులను బెదిరించి డబ్బు వసూలుచేసిన ఏపీ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు కుటుంబసభ్యులెవరూ చట్టం నుంచి తప్పించుకోలేరని వైఎస్సార్సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి స్పష్టంచేశారు. ఆదివారం ఆయన ట్విట్టర్ వేదికగా కోడెలపై ధ్వజమెత్తారు. కోడెల కుటుంబం 'కే' ట్యాక్స్ పేరుతో వందల కోట్లు దోచుకున్నదని ఆరోపించారు. సహకరించిన అధికారులు కూడా దోషులేనని, నిర్బంధ వసూళ్ల మాఫియా అరాచకాలపై దర్యాప్తు జరుగుతున్నదని పేర్కొన్నారు. బాధితులు నిర్భయంగా ఫిర్యాదుచేయాలని పిలుపునిచ్చారు.

నేడే ఏపీ క్యాబినెట్ తొలి భేటీ

- 12 నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ తొలి సమావేశం సచివాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరుగనున్నది. రైతులు, మహిళలు, ఉద్యోగుల అంశాలే ప్రధాన అజెండాగా సమావేశం చర్చించనున్నది. ఆశావర్కర్ల వేతనాల పెంపు ఆమోదం, ఉద్యోగులకు మధ్యంతర భృతి 27 శాతం మంజూరు తదితర కీలక అంశాలపై నిర్ణయం తీసుకోనున్నారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దుచేస్తామని, హోంగార్డుల వేతనాలు పెంపుపై ఇచ్చిన హామీ మేరకు చర్చించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. రైతుభరోసా, ఇతర సమస్యలపై చర్చించనున్నారు. ఏపీ నూతన శాసనసభ తొలి సమావేశాలు ఈ నెల 12 నుంచి ప్రారంభంకానున్నాయి. 12న కొత్త సభ్యులతో ప్రమాణం, 13న స్పీకర్ ఎన్నిక, 14న గవర్నర్ ప్రసంగం ఉంటుంది. ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు తొలిసారిగా అసెంబ్లీకి హాజరుకానున్నారు.

ఇకపై నా రాజకీయం చూస్తారు: పవన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇప్పటివరకు తన ఆశయాలను చూశారని, ఇకపై తన రాజకీయం చూస్తారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఆదివారం ఏపీలోని గుంటూరు జిల్లా మంగళగిరిలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. 'ఆశయాలతో వస్తే నిన్నే ఓడించారు' అని కొందరు నాతో అన్నారు. భీమవరంలో నన్ను ఓడించడానికి రూ.150 కోట్లు ఖర్చు చేశారట. ఒక్క వీరవాసరం మండలానికి రూ.30 కోట్లు ఇచ్చినట్టు చెప్తున్నారు. నిజమైన రాజకీయం, వ్యూహాలు, ఎత్తుగడలు వేయలేక కాదు. చేతకాక కాదు. ఈసారి నా వ్యూహాలు చాలాబలంగా ఉంటాయి. ఆశయాలతో ఉండే పవన్‌కల్యాణ్‌ను మీకు చూపించానంతే. ఇకనుంచి మార్పు వచ్చే వరకూ ఎత్తులు, పై ఎత్తులు వేస్తూ ఉంటా. జర్మనీ నుంచి నా కోసం 500 మంది వచ్చారు. అలాంటి వాళ్ల కోసం నేను రాజకీయాల్లో ఉండిపోతా. ఇప్పటివరకు నా ఆశయాలు చూశారు. ఇకపై నా రాజకీయాలు చూస్తారు'అని పవన్ పేర్కొన్నారు. మాజీ సభాపతి, జనసేన కీలక నేత నాదెండ్ల మనోహర్ ఆ పార్టీని వీడతారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవంలేదని, అమెరికా పర్యటనలో ఉన్నందువల్లే సమావేశానికి హాజరు కాలేకపోయారనితెలిపారు.

టీఎస్ స్టడీసర్కిల్‌లో శిక్షణకు ప్రవేశపరీక్ష

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: తెలంగాణ స్టడీసర్కిల్‌లో నీశాట్-2020 ఉచిత శిక్షణ తీసుకునే అభ్యర్థులను ఎంపికచేసేందుకు ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష సజావుగా జరిగినట్టు స్టడీసర్కిల్ డైరెక్టర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్షను నిర్వహించగా, 3,032 మంది అభ్యర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్ష ఫలితాలను త్వరలోనే వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని తెలిపారు.

రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (RGUKT) బాసర

బోధనలో ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ICT) క్రియాశీలకంగా వినియోగిస్తున్న విశిష్టమైన విశ్వవిద్యాలయం RGUKT, బాసర. తెలంగాణ రాష్ట్రం, నిర్మల్ జిల్లాలోని జ్ఞానసరస్వతి నిలయమైన బాసరలో ఈ విశ్వవిద్యాలయం నెలకొని ఉంది. గోదావరి నదీ తీరం నుండి కొద్ది దూరంలో ప్రశాంత వాతావరణంలో సుమారు 272.21 ఎకరాలలో క్యాంపస్ ఉంది.

RGUKT నెలకొల్పుటలో గ్రామీణ నైపుణ్యం గల యువతకు అంతర్జాతీయ ప్రామాణికత గల ఇంజినీరింగ్ విద్య, వృత్తి సంబంధ నాయకత్వ నైపుణ్యాలు అందించడమే మా ప్రధాన ఉద్దేశ్యం. ఎంపిక ప్రక్రియ అమలులో ఉన్న నియమ నిబంధనల ప్రకారం తీవ్రమైన పోటీతో ఉంటుంది. 10వ తరగతి తరువాత ఉత్తమ ప్రతిభ చూపిన గ్రామీణ విద్యార్థులకు మాత్రమే RGUKTలో విద్యనభ్యసించడానికి అవకాశం లభిస్తుంది.

విశ్వవిద్యాలయంలో సుమారు 6500 మంది విద్యార్థులు 230 మంది ఫ్యాకల్టీ సభ్యులు, 110 మంది సహాయక సిబ్బంది మరియు 420 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు.

ఆఫరు చేస్తున్న కోర్సులు:

విశ్వవిద్యాలయం ఏడు ఇంజినీరింగ్ విభాగాలలో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ మరియు మూడు ఇంజినీరింగ్ విభాగాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీని ప్రస్తుతం అందిస్తోంది.

RGUKTలో అధ్యయన ప్రోగ్రామ్‌లు:

ఏ) ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సు:

ప్రీ యూనివర్శిటీ కోర్సు (ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లో మొదటి రెండు సంవత్సరాలు విద్యార్థులు అందరికీ ఒకే విధంగా ఉంటుంది)

B.Tech:

PUC పూర్తయిన తరువాత విశ్వవిద్యాలయంలో 1) కెమికల్ ఇంజినీరింగ్, 2) సివిల్ ఇంజినీరింగ్, 3) కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, 4) ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, 5) ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ అండ్ ఇంజినీరింగ్, 6) మెకానికల్ ఇంజినీరింగ్, 7) మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్‌లో B.Tech ప్రోగ్రామ్‌లు ఆఫరు చేస్తున్నారు.

M.Tech

1) కంప్యూటేషనల్ ఇంజినీరింగ్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్

2) కంప్యూటేషనల్ ఇంజినీరింగ్ ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ అండ్ ఇంజినీరింగ్

3) కంప్యూటేషనల్ మెకానిక్స్ ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో M.Tech ప్రోగ్రామ్‌లు ఆఫరు చేస్తున్నారు.

మౌలిక సదుపాయాలు:

విశ్వ విద్యాలయంలో మూడు అకడమిక్ బ్లాక్‌లు, 120 కంటే ఎక్కువ ICT ఎక్విప్‌మెంట్‌గల తరగతి గదులు, ప్రతీ విద్యార్థికి ల్యాప్‌టాప్‌తో అత్యున్నతస్థాయి లేబొరేటరీలు, ఆరు బాలురు మరియు బాలికల హాస్టల్ భవనాలు మరియు 2000 మంది విద్యార్థులకు సరిపోయే విధంగా మూడు మెస్ బ్లాక్‌లు ఉన్నాయి. క్యాంపస్‌లో ల్యాండ్రోమ్యాట్, బ్యాంక్, ఎటిఎం, షాపింగ్ కాంప్లెక్స్, పోస్ట్ ఆఫీస్, 30 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొదలగునవి ఉన్నాయి. అంతేకాకుండా ఇండోర్ మరియు ఔట్‌డోర్ రిక్రియేషనల్ సదుపాయాలు, జిమ్నాజియం, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ మరియు క్రికెట్ మరియు ఇతర క్రీడా ప్రాంగణాలు ఉన్నాయి.

● వినూత్నమైన విధానాలు, సాధించిన విజయాలు:

భారతప్రభుత్వం ఉన్నత విద్యకోసం వివిధ డిజిటల్ కార్యాచరణలను ప్రవేశపెట్టింది. MHRD డిజిటల్ విధానం ద్వారా వందలాది హై క్వాలిటీ కోర్సుల ద్వారా దేశమంతటా లక్షలాదిమందికి MOOC (మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులు) అందించేందుకు SWAYAM (స్టడీ వెబ్స్ ఆఫ్ యాక్టివ్ లెర్నింగ్ ఫర్ యంగ్ యాస్పైరింగ్ మైండ్స్) వంటి వినూత్నమైన చర్యలను చేపట్టింది.

నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్ (NPTEL) ఇంజినీరింగ్ మరియు ప్రాథమిక సైన్స్ కోర్సుల కొరకు ప్రతిష్టాకరమైన చర్యగా ఏర్పడింది. NPTEL ఇంజినీరింగ్ విభాగానికి అధికారిక SWAYAM జాతీయ కోఆర్డినేటర్. RGUKT బాసర MHRD యొక్క SWAYAM కార్యాచరణలో భాగమై NPTEL యొక్క లోకల్ చాప్టర్‌గా ఏర్పడింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా NPTELకు 1000 లోకల్ చాప్టర్స్ ఉన్నాయి.

NPTEL ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులలో మా యూనివర్సిటీ విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. ఈ కోర్సులలో మా విద్యార్థులు ముగ్గురు టాప్‌లో నిలవడం మా యూనివర్సిటీకి గర్వకారణం. NPTEL RGUKT బాసర, తెలంగాణలో గుర్తింపుపొంది, భారతదేశంలోని టాప్ 100 లోకల్ ఛాప్టర్స్‌లో ఒకటిగా నిలిచింది మరియు మే 2017లో జరిగిన పరీక్షలో NPTEL కోర్సులలో మా విద్యార్థులు 7 మంది టాప్‌లో నిలిచి, తెలంగాణ రాష్ట్రంలోనే మా యూనివర్సిటీని మొదటి స్థానం పొందేలా చేశారు. అంతేకాకుండా భారత దేశంలోని టాప్ 50 లోకల్ ఛాప్టర్స్''లో ఒకటిగా నిలిచింది.

NASA స్పేస్ సెటిల్‌మెంట్ కంటెస్ట్ ప్రతి సంవత్సరం NASA నిర్వహించే స్పేస్ సెటిల్‌మెంట్ కంటెస్ట్ ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులకు ప్రారంభించారు విద్యార్థులచే ఏర్పాటు చేయబడిన స్పేస్ కాలనీలు లేదా స్పేస్ సెటిల్‌మెంట్స్ డిజైన్లు మరియు ప్రాజెక్ట్‌లు అన్ని అంశాలచే పూర్తిచేయబడినవి. మరొకసారి RGUKT బాసర విద్యార్థులు NASA స్పేస్ సెటిల్‌మెంట్ కంటెస్ట్‌లో రెండు బహుమతులు గెలుచుకోవడం ద్వారా అంతర్జాతీయ స్థాయికి వారి సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు.

● సృజనాత్మక విలువలు ప్రోత్సహించుట, ●ఇంక్యూబేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం. ● ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడం, ● ఉద్యోగం అడిగేవారిగా కాకుండా ఇచ్చేవారిగా విద్యార్థులను తీర్చిదిద్దడం

అంతరిక్షంలో కొత్త శకం సృష్టించుటకు కొత్త స్పేస్ సెటిల్‌మెంట్ డిజైన్ VIHAANను మేము పరిచయం చేశాము.

ARM యూనివర్శిటీ ప్రోగ్రాం : ARM అనేది ప్రపంచ విశిష్టమైన స్మార్ట్ చిప్ ఆర్కిటెక్చర్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలలో ఒకటి.

విద్యార్థుల విజయాలు:

– గేట్ 2017లో టాప్ ర్యాంకులు పొందారు.

– చాలామంది

నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 10 జూన్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

శరీరానికి రక్ష.. ద్రాక్ష

సీజన్‌తో సంబంధం లేకుండా దొరికే పండ్లలో ద్రాక్ష ఒకటి. రోజూ గుప్పెడు ద్రాక్షా పండ్లు తినడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. కేశ సంరక్షణకు, చర్మ సౌందర్యానికి కూడా ద్రాక్ష మేలు చేస్తుంది. ద్రాక్ష చేకూర్చే ప్రయోజనాలేంటంటే..

- నల్లద్రాక్ష శరీరంలోని వ్యర్థ పదార్థాలను బయటికి పంపిస్తుంది. చర్మానికి జీవకళను తెచ్చిపెడుతుంది. అలాగే జుట్టుకు కూడా మంచి ఔషధంలా పనిచేస్తుంది. ద్రాక్షలో ఉండే ఫ్యాటీ ఆమ్లాలు వెంట్రుకలకు మంచి పోషణ నిస్తాయి.
- ద్రాక్ష పండ్లను తినడం వల్ల వృద్ధాప్య ఛాయలు త్వరగా దరిచేరవు. ద్రాక్షలో ఉండే పాలిఫినాల్స్ శరీరంలోని కొల్లాజిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది చర్మాన్ని వాడిపోకుండా రక్షించడంలో ముఖపాత్ర వహిస్తుంది.
- బరువు తగ్గాలనుకునే వారికి ద్రాక్ష పండు చాలా మంచిది. ఈ పండ్లు శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపిస్తాయి. కొవ్వు పట్టకుండా చూస్తాయి. లావుగా ఉన్న వారు వీటిని ఎన్ని తిన్నా లాభమే కానీ, నష్టం ఉండదు.
- ద్రాక్ష పండ్లలో ఫైటో కెమికల్స్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. గుండెకు మేలు చేస్తుంది. ఇందులో ఉండే కొన్ని పోషకాలు క్యాన్సర్ కారకాలతో పోరాడతాయి. నల్లద్రాక్ష ఆరోగ్యానికి అన్నివిధాలా సహకరిస్తుంది. రక్తంలోని చక్కెర స్థాయిల్ని అదుపులో ఉంచుతుంది.
- రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. పిల్లలకు తినిపించడం వల్ల వారిలో ఏకాగ్రత పెరుగుతుంది. రక్తలేమి, బలహీనత, విటమిన్ల లోపం సమస్యలు తొలిగిపోతాయి. నల్లద్రాక్ష రసం తాగితే తక్షణ ఎనర్జీ వస్తుంది.

సక్సెస్ మంత్ర

డేటింగ్ వ్యాపారంలో డేరింగ్ లేడీ

టీనాఛూలే

ఒకప్పుడు పెండ్లి చేయాలనుకుంటే అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు చూడాలనే వారు. అంతేకాదు, పెండ్లిచూపుల్లో అమ్మాయిని చూస్తే మళ్లీ పెండ్లి వరకు కలిసే అవకాశమే ఉండేది కాదు. కానీ, ఇప్పుడు కాలం మారింది. ఇప్పుడు పెండ్లిలన్నీ డేటింగ్‌లే. అందుకే డేటింగ్ బిజినెస్‌లు కూడా పెరిగాయి. తన సోదరి, కజిన్, ఆమె భర్త కజిన్.. ఇలా కుటుంబంలోని వారికి డేటింగ్‌యాప్ ద్వారా సంబంధాలు కుదరడం చూసిన టీనా దాన్నే వ్యాపారంగా ఎంచుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా డేటింగ్ సైట్స్‌కు ఉన్న ఆదరణ, పెరుగుతున్న మొబైల్ ఫోన్ల మార్కెట్, జనాభాలో యువత సంఖ్య పెరుగడం లాంటి ఇతర అంశాలు కూడా టీనా డేటింగ్ యాప్ వైపు మొగ్గడానికి దోహదపడ్డాయి. ఫలితంగా 'వాల్ట్జ్' రూపుదిద్దుకుంది. స్త్రీ పురుషులకు ఆన్‌లైన్ డేటింగ్ కోసం వాల్ట్జ్ మొబైల్ డేటింగ్ యాప్‌ను రూపొందించి విజయం సాధించింది టీనా. తన యాప్ ద్వారా సీరియస్ రిలేషన్‌షిప్స్ జతపడాలని కోరుకుంటున్న వాల్ట్జ్ (Waltzz) కంపెనీ సీఈవో టీనాఛూలే సక్సెస్ మంత్ర.

టీనాది ప్రస్తుతం బెంగళూరు. వాస్తవానికి టీనా తండ్రి నాలుగు దశాబ్దాల క్రితమే రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ నుంచి చికాగో వెళ్లి స్థిరపడ్డారు. టీనా, ఆమె అక్క చికాగోలోనే పెరిగి పెద్దయ్యారు. 18 యేండ్లకు వార్టన్ స్కూల్లో జాయిన్ అవడానికి ఇంటి నుంచి బయటకొచ్చిన టీనా.. 22 యేండ్లకే మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా మారారు. ఆ వయసులో చాలామంది అమ్మాయిలు కలలు కనే స్టేజ్‌లో ఉంటారు. కానీ, టీనా చాలా తేలికగా అక్కడికి చేరుకున్నారు. నిజానికి చిన్నప్పటి నుంచే సందడిగా, ఉత్సాహంగా ఉండే ఆమెకు క్రియేటివిటీ కూడా ఎక్కువే. అయితే, ఇలా కుదురుగా ఉండడం ఆమెకు నచ్చలేదు. రిస్క్ లేకపోతే, లైఫ్‌లో మజా లేదనుకున్నారు. అంతే, తనకున్నదంతా అమ్మేసి 2008లో న్యూఢిల్లీలోని ఓ అంతర్జాతీయ సంస్థ ఎండీవర్‌లో ఉద్యోగం సంపాదించారు. ఈ సంస్థ యువ పారిశ్రామికవేత్తలకు సలహా, సహాయాలను అందిస్తుంది. ఆ తర్వాత ఆమె సుమింటర్ ఇండియా ఆర్గానిక్స్, సిట్రస్ సిటీ లాంటి సంస్థల్లో పనిచేశారు.

సొంత సంస్థ పెట్టాలని..

2012లో కెలాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ చేయడానికి వెళ్లిపోయారు టీనా. ఈ డిగ్రీ పూర్తయిన వారానికే మళ్లీ ఇండియా ఫ్లయిట్ ఎక్కేశారు. తిరిగొచ్చిన వెంటనే సొంత సంస్థను ఏర్పాటు చేసే పనిలో పడ్డారు. తను భర్తతో కలిసి దాదాపు రెండేండ్ల పాటు చాలా వ్యాపారాల గురించి ఆలోచించారు. ఉబర్ లాంటి ట్రాన్స్‌పోర్ట్ మేనేజెమంట్ సంస్థల దగ్గర నుంచి మొబైల్ గేమింగ్ వరకు చాలా ఆలోచనలొచ్చాయి. చివరికి మొబైల్ డేటింగ్ దగ్గర ఆగారు. ఇందుకు ఆమె కుటుంబంలోని ఘటనలే స్ఫూర్తిగా నిలిచాయి. తన సోదరి, కజిన్, ఆమె భర్త కజిన్.. ఇలా కుటుంబంలోని వారికే ఈ డేటింగ్ యాప్స్ ద్వారా సంబంధాలు కుదరడం కూడా దీనికి కారణం.

అన్నీ ఉండేలా...

తన యాప్ ద్వారా సీరియస్ రిలేషన్‌షిప్స్ జత పడాలని కోరుకున్నారు టీనా. అందుకే ఏదో ఒక్క క్లిక్‌తో ఫేస్‌బుక్‌లో ఉన్న ప్రొఫైల్‌నే ఈ యాప్‌లో అప్‌లోడ్ చేసే సంప్రదాయానికి ఆమె ఫుల్ స్టాప్ పెట్టారు. మతం, పుట్టిన రాష్ట్రం లాంటి కొన్ని కచ్చితమైన వివరాలు ఉండేలా ఈ యాప్‌ను తీర్చిదిద్దారు. అలాగే, ఎలాంటి డేటింగ్ కావాలనుకుంటున్నారో (క్యాజువల్, సీరియస్, సెమీ సీరియస్) ఈ యాప్ ద్వారా ముందే తెలుసుకునే ఏర్పాటు కూడా ఉంది. మహిళా యూజర్లను ఆకట్టుకోవడానికి కొన్ని ప్రత్యేకమైన ఫీచర్లను కూడా పెట్టారు. ఫోర్ వే ప్రొఫైల్ వెరిఫికేషన్, పర్సనల్ కాంటాక్ట్ ఇన్ఫర్మేషన్ తెలుసుకోవడానికి ప్రయత్నించే వాళ్ళను బ్లాక్ చేసే వెసులుబాటు.. ఇలాంటి ప్రత్యేక ఫీచర్లు ఈ యాప్‌లో జత చేశారు. గతంలో డేటింగ్ యాప్‌లలో ఇవేవి ఉండేవి కావు.

మార్కెట్ పోటీని తట్టుకొని..

నిజానికి మార్కెట్‌లో పోటీ చాలా ఉంది. డేటింగ్ రంగంలో చాలా సంస్థలున్నాయి. మార్కెట్‌లో ఎంత పోటీ ఉన్నా.. టీనా టీమ్ చిన్నదే అయినా వారు ఎలాంటి పోటీనైనా ఎదుర్కోవడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. మార్కెట్‌లో ఎన్ని సంస్థలున్నా ఏది సక్సెస్ అవుతుందో చెప్పడం కష్టం. 'అసలు డేటింగ్ అన్న పదం వాడడానికే ఇబ్బంది పడే స్థాయిలో సమాజం ఉన్నప్పుడు టిండర్ (డేటింగ్ యాప్ సంస్థ) కొంత కష్టపడి.. మార్కెట్ అవగాహన తెచ్చింది. అయితే, వాల్ట్జ్ లాగా టిండర్‌కు స్థానిక మార్కెట్ల మీద పట్టులేదు. పోటీ ఎంత పెరిగితే, మార్కెట్లో అవగాహన కూడా అంత పెరుగుతుంది' అని అంటారు టీనా.

మహిళల కోసమైనా..

మొత్తం మీద వాల్ట్జ్ యాప్ స్త్రీలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిందే అయినా.. మగాళ్ళను కూడా దూరం చేసుకునే ఉద్దేశం లేదు. తమకు భద్రత ఉంటుందనుకునే యాప్‌ను సహజంగానే ఎక్కువ మంది మహిళలు ఆదరిస్తారు. ఆ రకంగా మగాళ్లకు కూడా ఈ యాప్‌లోఎక్కువ మంది స్త్రీల నుంచి తమ భాగస్వామిని ఎంచుకునే అవకాశం ఉంటుంది అని వివరించారు టీనా. అంతేకాదు మహిళా వ్యాపారవేత్తను కావడమే నా బలం అని కూడా అంటారు టీనా. స్త్రీని కావడం వల్ల తనకు లాభమే జరిగింది తప్ప నష్టం లేదంటారామె. 'డేటింగ్ ప్లాట్‌ఫాం విషయాని కొచ్చేసరికి మహిళలు మరో మహిళను నమ్మినట్టుగా మగాళ్లను నమ్మరు. మా పోటీ సంస్థను పురుషులు నిర్వహిస్తున్నారు. స్త్రీ పురుష మనస్తత్వాలకు సంబంధించిన ఈ వ్యాపారంలో మహిళను కావడం నాకు చాలా ఉపయోగపడింది. అందువల్లే తక్కువ సమయంలోనే మార్కెట్‌లో నిలబడగలిగానని టీనా అంటారు.

మహిళల కోసం వెతుకుతున్నా..

మహిళల్లో ఐడియాలకు లోటు లేకపోయినా.. టెక్నాలజీ రంగంలో మహిళల సంఖ్య ఎందుకు తక్కువగా ఉంటుందో అర్థం కాదంటారు టీనా. 'నా బిజినెస్ ఎక్కువగా మహిళలతోనే ముడిపడిఉంది. అర్థమయ్యాక విమెన్ డెవలపర్స్ కోసం చాలా వెతికాను. నౌక్రి డాట్ కామ్ వెబ్‌సైట్‌లో సీ.వీ.లు అప్‌లోడ్ చేసిన చాలామందితో స్వయంగా మాట్లాడాను. అయితే, వాళ్ళెవరూ రావడానికి ఇష్టపడలేదు. చాలామంది అప్పటికే పెద్ద పెద్ద కంపెనీల్లో ఏవో ఉద్యోగాల్లో స్థిరపడిపోయారు. దాన్ని వదులుకొని ఒక కొత్త సవాలు స్వీకరించడానికి సిద్ధంగా లేరు. ఇప్పటికీ తాను విమెన్ డెవలపర్స్ కోసం అన్వేషిస్తూనే ఉన్నానని.. తన అనుభవాల్ని చెప్పారు టీనా.

భర్త ప్రోత్సాహం

టీనా భర్త.. క్విక్‌ర్ వ్యవస్థాపకుల్లో ఒకరు. ఆ సంస్థ సీఈవో ప్రణయ్ ఛూలే. ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించి దాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న వ్యక్తి. తాను జీవిత భాగస్వామి కావడం వల్ల టీనా మానసిక స్థైర్యానికి లోటులేదు. ప్రణయ్ ఆమెకు స్ఫూర్తి, ప్రతి కష్టంలోనూ ఆమెకు తోడూనీడగా ఉంటున్నారు. టీనా, ప్రణయ్ ఒకరి వ్యాపారంలో మరొకరు జోక్యం చేసుకోరు. అయితే, ఒకరి సహకారం మాత్రం మరొకరికి ఎప్పుడూ ఉంటుంది. మార్కెటింగ్, ఫండ్ రైజింగ్, ఉద్యోగులను చేర్చుకోవడం వంటి అంశాల్లో ప్రణయ్ అనుభవం టీనాకు ఎప్పుడూ బలమే. అలాగే బిజినెస్ మైండ్ సెట్ ఉన్న టీనా అభిప్రాయాలు ప్రణయ్ వ్యాపారానికి మరింత సహకరిస్తాయి.

పేదపిల్లలకు 'బకెట్ లిస్ట్'

పేదరికం చదువుకి అడ్డంకి కాదు అనుకుంటారు. కానీ, ఇప్పటికీ చాలా మంది ఆ పేదరికంలో మగ్గి.. చదువులకు దూరమవుతున్నారు. అలాంటి వారిని నేనున్నానంటూ బాసటగా నిలుస్తున్నదో అమ్మాయి.

ఆమెకు చదువంటే ప్రాణం. బాగా చదువుకొని నలుగురికి సహాయపడాలనుకుంది. ఇంతలోనే అనారోగ్యం. ఐదురోజులు హాస్పిటల్‌లో కళ్లు తెరువలేదు. ఆమె కళ్లు తెరిచాక కూడా మరో ఐదు రోజులు అయితే కానీ డాక్టర్లు ఇంటికి పంపించమన్నారు. ఆ హాస్పిటల్‌లో ఉన్న అమ్మాయి పేరు సాక్షి శ్రీవాస్తవ. ఢిల్లీకి చెందిన 19 యేండ్ల ఈ అమ్మాయి ఢిల్లీ యూనివర్సిటీలో మొదటి సంవత్సరం చదువుతున్నది. హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చిన తర్వాత పరీక్షలు ఉన్న సంగతి గుర్తుకొచ్చింది. ఆమె అనుకున్న విధంగానే పరీక్షలు రాసింది. మంచి మార్కులు సంపాదించింది. కానీ, అదే బయటకు రాకుంటే పరిస్థితి ఏంటి? ప్రాణంగా భావించే చదువుకు దూరమయ్యేదాన్ని అనుకుంది. ఎవరైనా ఇలా అనారోగ్యంతో చదువుకు దూరమైతే వారి పరిస్థితేంటి? అని గుర్తుకొచ్చేసరికి బాధేసింది. ఎవరూ విద్యకు దూరం కాకూడదనే భావంతో ఓ సంస్థను స్థాపించాలనుకుంది. చదువుకు దూరమైన పేదపిల్లలను అక్కున చేర్చుకున్నది. ఈ సంస్థకు 'బకెట్ లిస్ట్' అని పేరు పెట్టింది. సాక్షికి తోడుగా రైడా అలీ అండగా నిలిచాడు. చుట్టుపక్కల ఉండే పేదపిల్లలను ఒక చోటుకి చేర్చారు. సాక్షి సోదరుడు, వదినలు వారికున్న టెక్నాలజీ నాలెడ్జ్‌తో చదువుకు సరికొత్త మార్గాలు చూపించారు. మాదన్‌పూర్ ఖాదర్, సరితా విహార్, ఓఖ్ల, నిజాముద్దిన్ బస్తీలో ఉండే పిల్లలందరికీ ఇదే విద్యాలయం. వీరికి చదువుతో పాటు ఆటలు, పాటలు, గిటార్, కుండలు తయారు చేయడం, జీవిత పాఠాలు నేర్పిస్తున్నది. ఇలా మూడేండ్ల నుంచి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నది. ఇప్పటివరకు రెండు వేల మంది పిల్లలకు చేరదీసింది.

కుడి చేయి ఎందుకు వణుకుతున్నది?

నా వయసు 60 సంవత్సరాలు. కొంతకాలంగా నన్ను ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. బీపీ, షుగర్ లాంటి సమస్యలేమీ లేవు. కానీ ఏ పనీ చేయలేకపోతున్నా. ఏదైనా చేస్తే చాలా సమయం తీసుకొని నెమ్మదిగా చేస్తున్నా. నడకలో కూడా వేగం తగ్గింది. కుడి చెయ్యి ఎప్పుడూ వణుకుతుంది. ఇది దేనికి సంకేతం? సంవత్సర కాలంగా న్యూరోబైన్ మాత్రలు వేసుకుంటున్నా. అయినా ఫలితం లేదు. నేనేం చేయాలి? దయచేసి తెలుపగలరు.

- సుజాత, హైదరాబాద్

అడుగండి చెబుతా



డాక్టర్ మురళీధర్ రెడ్డి
కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్
బంజారాహిల్స్

మీరు పార్కిన్‌సన్స్ వ్యాధితో బాధపడుతున్నట్లు అనిపిస్తున్నది. ఈ జబ్బు అరవై సంవత్సరాలు నిండినవారిలో ఎక్కువగా కనిపిస్తుంటుంది. కూర్చుని ఉన్నప్పుడు చెయ్యి వణకడం.. తొందరగా నడవలేకపోవడం.. గబుక్కున ఒక దిమ్మ మాదిరి కూర్చోవడం.. వెనక్కి తిరగలేకపోవడం.. నోటి నుంచి ఉమ్మి కారడం వంటివి ఈ వ్యాధి లక్షణాలు. ఇవన్నీ మీలో ఉన్నట్లు కనిపిస్తున్నది. మెదడులో డొపామెన్ అనే కెమికల్ తగ్గిపోవడం వల్ల మనిషిలోని కదలికలు తగ్గిపోతాయి. దీనిని మాత్రల రూపంలో ఇవ్వడం వల్ల నడవొచ్చు. సిండోసా, రోపాల్క్ వంటి మందులతో ట్రీట్‌మెంట్ చేయవచ్చు. ఖాళీ మందుల ద్వారానే 10-15 సంవత్సరాలు నిమ్మళంగా ఉండవచ్చు. మెడిసిన్స్ పనిచేయనప్పుడు డీబీఎస్ సర్జరీ చేయాల్సి ఉంటుంది. మీరు ఒక సంవత్సరం నుంచి మాత్రమే ఈ సమస్యతో బాధపడుతున్నట్లు చెప్పారు. కాబట్టి.. సర్జరీ అవసరం లేకుండానే పార్కిన్‌సన్స్ వ్యాధిని నయం చేసుకునే అవకాశాలు ఉన్నాయి. స్పెషలిస్ట్‌ను సంప్రదించి పరీక్ష చేయించుకోండి.

ఆరెంజే బ్యూటీ బ్లష్

బ్లష్.. రోటిన్ మేకప్‌లో దీనికి ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ మధ్య ఆరెంజ్ కలర్ షేడ్ బ్లష్ బ్యూటీ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. అన్ని రకాల స్కిన్ టోన్స్‌కు నప్పే షేడ్‌గా దీన్ని పేర్కొంటున్నారు.

- **మీ స్కిన్ టోన్ లైట్‌గా ఉంటే..** దాన్ని మరింత బ్రైట్‌గా కనిపించేలా చేసే బ్లష్ ఎంచుకోవాల్సి ఉంటుంది. పీచ్, పగడం, టాంజెరిన్ షేడ్స్ బ్లష్ మిమ్మల్ని ప్రకాశవంతంగా కనిపించేలా చేస్తుంది.
- **స్కిన్ టోన్ మధ్యస్థంగా ఉంటే..** మీ చర్మం చామనఛాయలో ఉంటే ఆరెంజ్ బ్లష్ చాలా బాగుంటుంది. అయితే కోరల్, పీచ్ షేడ్ బ్లష్ అప్లై చేసుకుంటే మీ లుక్ చాలా సహజంగా కనిపిస్తుంది.
- **మీది డస్కీ స్కిన్ అయితే..** ఆరెంజ్ రంగులో కాస్త రెడ్‌కు దగ్గరగా ఉండే షేడ్ మీ అందాన్ని పెంచుతుంది. అయితే బ్లష్ అప్లై చేసుకొనేటప్పుడు మీ నేచురల్ లుక్ దెబ్బ తినకుండా అప్లై చేసుకోవాలి.

కారవాన్ కల్చర్‌పై అవగాహన కల్పిస్తున్నారు!

ప్రదేశాలు, వింతలు, విశేషాలు, చరిత్ర సంపద, సంస్కృతి, సంప్రదాయాలు ఇవన్నీ ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా ఉంటాయి. కొత్త ప్రాంతాలను సందర్శించినప్పుడు మనసు ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా అనిపిస్తుంది. అందుకోసమే అప్పుడప్పుడు విహార యాత్రలు చేయాలని, అదే విషయాన్ని అనుభవపూర్వకంగా చెబుతున్నారు ఇద్దరు మిత్రులు.

భారతదేశంతో పోలిస్తే విదేశాల్లో విహారయాత్రలు చేసేవారి సంఖ్య ఎక్కువ. ఎందుకంటే విహారయాత్రల ద్వారా నూతన ఉత్తేజం పెరుగుతుందట. కొత్త కొత్త ప్రదేశాలను చుట్టి రావడం వల్ల వింతలు, విశేషాలు తెలుస్తాయి. అలా తెలుసుకోవడంతోపాటు కొత్త అనుభూతులు, మధురస్మృతులు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి. అందుకే ఇతర దేశాల వారు చాలామంది సంవత్సరంలో ఒక్కసారైనా కొత్త పర్యాటక స్థలాలను సందర్శిస్తుంటారు. వీటినే 'కారవాన్ క్రానికల్స్' అంటారు. వాహనంలో నివసించేందుకు అనువైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకొని విహార యాత్రచేయడాన్ని 'కారవాన్ క్రానికల్స్' అంటారు. ఇటువంటి కల్చర్‌ను భారతదేశంలో పెంచేందుకు బెంగళూరుకు చెందిన అంకిత , శరణ్య అయ్యర్ శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఓ వాహనం ద్వారా సిక్కింలోని ప్రకృతి అందాలను తిలకించడంతోపాటు, పల్లె, పట్టణాల్లో కారవాన్ యాత్రలపై అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా తమ అనుభవాలను వెబ్‌సిరీస్ రూపంలో యూట్యూబ్‌లో విడుదల చేశారు. ఒక్కో పర్యాటక ప్రాంతంలో ఎదురైన అనేక అంశాలను వివరిస్తున్నారు. వారు ప్రయాణించే వాహనానికి 'లూనా' అని పేరు పెట్టారు. అందులోనే నిద్రించే విధంగా ఓ బెడ్‌ను కూడా ఏర్పాటు చేసుకొని, సిక్కిం సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆ వాహనాన్ని తీర్చిదిద్దారు. మొదటి విడతలో 100రోజుల పాటు విహార యాత్ర చేసి, 14 రాష్ట్రాలను సందర్శించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థుల్లో, గ్రామీణ మహిళల్లోనూ 'కారవాన్ కల్చర్'ను గురించి అంకిత, శరణ్య అయ్యర్‌లు అవగాహన కల్పిస్తున్నారు.

నమస్తే తెలంగాణ
నిపుణ
[కరీంనగర్]
సోమవారం 10 జూన్ 2019

సీపీగెట్-2019

విద్యార్థులకు విశేష ప్రయోజనాలు!

రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యావ్యవస్థలో మూస పద్ధతులకు స్వస్తి పలికి విద్యార్థులకు ఉపయోగకరంగానే కాకుండా పారదర్శకంగా ఉండే వ్యవస్థలను క్రమక్రమంగా ఏర్పాటుచేస్తున్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలోని ఏడు విశ్వవిద్యాలయాల్లో పీజీ ప్రవేశాల కోసం మొదటిసారి కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ సీపీగెట్-2019 నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువు జూన్ 12న ముగియనున్న సందర్భంలో పరీక్ష, ప్రవేశాలకు సంబంధించిన విషయాలపై నిపుణతో ఓయూ వీసీ, సీపీగెట్ చైర్మన్ ప్రొఫెసర్. ఎస్. రామచంద్రం ఇంటర్వ్యూ విశేషాలు...

- **నిపుణ:** కామన్ పోస్టు గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్టులను నిర్వహించడానికి ప్రధాన కారణం ఏమిటి?
- **వీసీ:** రాష్ట్రంలోని కాకతీయ, ఉస్మానియా, జేఎన్‌టీయూ యూనివర్సిటీలు వాటి పరిధిలోని కాలేజీల్లో ప్రవేశాల కోసం ప్రతి ఏటా పీజీతోపాటు ఇతర కోర్సులకు వేర్వేరుగా పరీక్షలు నిర్వహించేవి. దీనివల్ల విద్యార్థులకు అనేక ఇబ్బందులు ఉండేవి. ప్రధానంగా ఆయా విశ్వవిద్యాలయాల ఎంట్రన్స్‌లకు వేర్వేరుగా ఫీజులు కట్టాలి. అదేవిధంగా ఒకే కోర్సులో ప్రవేశానికి ఆయా విశ్వవిద్యాలయాలు నిర్వహించే పరీక్షలకు హాజరుకావాలి. దీనివల్ల ప్రయాణభారం, ఆర్థికం భారం పడేది. వీటన్నింటి నుంచి విముక్తి కలిగించి రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పీజీ ప్రవేశాల కోసం మొదటిసారి సీపీగెట్‌ను నిర్వహిస్తున్నాం. ఒక కోర్సులో చేరడానికి ఒక పరీక్ష రాస్తే సరిపోతుంది. అదికూడా వారికి దగ్గర్లోని పరీక్ష కేంద్రంలో రాయవచ్చు. ఈ పద్ధతి వల్ల సమయం, ధనం, ప్రయాణ భారాలు తగ్గుతాయి. పరీక్ష కోసం ఎక్కువ సమయాన్ని కేటాయించి మంచి ఫలితాలను విద్యార్థులు పొందుతారు.
- **నిపుణ:** సీపీగెట్‌ను ఏ పద్ధతిలో నిర్వహిస్తున్నారు? పరీక్ష కేంద్రాలు ఎక్కడ ఉన్నాయి?
- **వీసీ:** గతేడాది ఉస్మానియా విశ్వవిద్యాలయ పీజీ ప్రవేశాల కోసం ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష నిర్వహించారు. ఈసారి మొదటిసారి అన్ని విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాల కోసం సీపీగెట్‌ను ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్నాం. పరీక్ష కేంద్రాల విషయానికి వస్తే రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యార్థులకు ఇబ్బంది లేకుండా 12 జోన్లను ఏర్పాటు చేశాం. వీటిలో హైదరాబాద్‌ను తూర్పు, పడమర, దక్షిణ, ఉత్తర జోన్లుగా విభజించాం. వీటితోపాటు ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్, నిజామాబాద్‌లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నాం.
- **నిపుణ:** ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్ష నిర్వహణ కోసం ఏం చేస్తున్నారు?
- **వీసీ:** ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించడం కోసం ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ టీసీఎస్, టీఎస్ ఆన్‌లైన్‌లతో ఒప్పందం చేసుకున్నాం. పరీక్ష నిర్వహణ బాధ్యత వారు చూస్తారు.
- **నిపుణ:** ఏయే కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు?
- **వీసీ:** ప్రధానంగా ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీతోపాటు పీజీ డిప్లొమా, ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు ఉన్నాయి. సుమారు 60 రకాల కోర్సులను ఏడు యూనివర్సిటీల పరిధిలోని ప్రభుత్వ, అఫిలియేటెడ్ కాలేజీలతోపాటు కొన్ని అటానమస్ కాలేజీల్లో సుమారు 25వేలకు పైగా సీట్లలో ప్రవేశాలను కల్పిస్తాం.
- **నిపుణ:** సీపీగెట్ ద్వారా ఏయే విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు?
- **వీసీ:** రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు, జేఎన్‌టీయూహెచ్ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాల కోసం కామన్ పోస్టు గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీపీగెట్)ను నిర్వహిస్తున్నాం.
- **నిపుణ:** పీజీల్లో చాలావరకు సంప్రదాయక కోర్సులు ఉన్నాయి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో జాబ్ ఓరియంటెడ్ కోర్సులు అవసరం. వాటికోసం ఏం చేస్తున్నారు?
- **వీసీ:** సంప్రదాయ కోర్సులు అంటే ఎంఏలో దశాబ్దాలుగా వస్తున్న కోర్సులు ఉన్నాయి. వాటితో తక్షణ ఉపాధి దొరకకున్నా ఉన్నత విద్య, పరిశోధన ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వీటితోపాటు కొన్ని ప్రత్యేక కోర్సులను ఆఫర్ చేస్తున్నాం. వీటిలో జండర్ స్టడీస్, సైకాలజీ, న్యూట్రిషన్& డైటీషియన్, ఫోరెన్సిక్‌సైన్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ వంటివి. ఇవేకాకుండా పీజీ డిప్లొమాలో పలు ప్రత్యేక కోర్సులను అందిస్తున్నాం. ముఖ్యంగా పీజీ డిప్లొమా ఇన్ రేడియాలజికల్ ఫిజిక్స్ కోసం హైదరాబాద్‌లోని ప్రముఖ ఆస్పత్రులతో ఎంవోయూ చేసుకున్నాం. దీనివల్ల కోర్సు పూర్తికాగానే ఉద్యోగ పొందడానికి అస్కారముంది.
- **నిపుణ:** పీజీ డిప్లొమాల్లో ప్రత్యేకతలు వివరిస్తారా?
- **వీసీ:** డిగ్రీ తర్వాత ఉద్యోగాలు రావాలంటే ఆయా విభాగాల్లో ప్రత్యేక నైపుణ్యాలు అవసరం. ప్రస్తుతం బాగా డిమాండ్ ఉన్న పలు పీజీ డిప్లొమా కోర్సులను రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు అందిస్తున్నాయి. వాటిలో ప్రధానంగా రేడియాలజికల్ ఫిజిక్స్, అప్లయిడ్ లింగ్విస్టిక్స్, చైల్డ్ సైకాలజీ, డిజిటల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్, ఫంక్షనల్ హిందీ ట్రాన్స్‌లేషన్, సైకలాజికల్ కౌన్సెలింగ్, సెరికల్చర్ వంటివి ఉన్నాయి.
- **నిపుణ:** సీపీగెట్ ద్వారా ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారా?
- **వీసీ:** నాలుగు రకాల ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులను అందిస్తున్నాం. అవి.. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ (కేయూ అందిస్తుంది)ని ఎమ్మెస్సీ బయోటెక్నాలజీగా పరీక్ష నిర్వహిస్తున్నాం. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ/ఎమ్మెస్సీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ (ఓయూ, కేయూ, టీయూ, ఎంజీయూ, పీయూ ఆఫర్ చేస్తున్నాయి) దీన్ని ఎమ్మెస్సీ కెమిస్ట్రీగా, ఎంఏ (అప్లయిడ్ ఎకనామిక్స్)(టీయూ అందిస్తుంది) దీన్ని ఎంఏ ఎకానమీగా, ఎంబీఏ (ఐదేండ్లు ఇంటిగ్రేటెడ్–ఎంజీయూ, తెలంగాణ విశ్వవిద్యాలయాలు అందిస్తున్నాయి) దీన్ని ఎంబీఏ ఇంటిగ్రేటెడ్‌గా పరీక్షలు నిర్వహిస్తున్నాం.
- **నిపుణ:** ఈ ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులకు అర్హతలేంటి?
- **వీసీ:** ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులవల్ల విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. డిగ్రీతోపాటే అక్కడే పీజీ పూర్తి చేయడం. ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులు కావడానికి ఆస్కారం ఉంది. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్‌లో కనీసం 50 శాతం మార్కులతో పాస్ కావాలి. ఎస్సీ, ఎస్టీలు అయితే కేవల పాసైతే సరిపోతుంది. సీపీగెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- **నిపుణ:** పరీక్ష ఏ విధానంలో నిర్వహిస్తారు?
- **వీసీ:** ఎంట్రెన్స్‌లో అన్ని పీజీ కోర్సులకు ఆన్‌లైన్ విధానంలో 100 మార్కులకు ఉంటుంది. దీనిలో బహుళైచ్ఛిక ప్రశ్నలు ఇస్తారు. కాలవ్యవధి 90 నిమిషాలు. ఒక్క ఎంపీఈడీ మాత్రం భిన్నంగా ఉంటుంది. దీనిలో 75 మార్కులకు మల్టిపుల్ చాయిస్ ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. మిగిలిన 25 మార్కులు ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆయా నిర్దేశిత నిబంధనల ప్రకారం మార్కులను ఇస్తుంది. మరో విషయం అభ్యర్థులు గుర్తుంచుకోవాలి. పరీక్షలో మూడు నాలుగు రకాల ప్రశ్నలు అంటే అనాలజీస్, క్లాసిఫికేషన్, మ్యాచింగ్, కాంప్రహెన్షన్ పద్ధతిలో ఉంటాయి. ఎమ్మెస్సీ బయోకెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ తదితర సబ్జెక్టులకు సంబంధించి పరీక్షలో కొంత మార్పులు ఉంటాయి. వివరాలు సీపీగెట్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **నిపుణ:** పరీక్ష తర్వాత ప్రవేశాలు ఏ పద్ధతిలో నిర్వహించనున్నారు?
- **వీసీ:** సీపీగెట్ పూర్తయిన తర్వాత వారంలో ఫలితాలు వెల్లడిస్తాం. తర్వాత వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా ఆయా కాలేజీల్లో ప్రవేశాలు చేపడుతాం. మొదట వెబ్ ఆప్షన్స్ ద్వారా కాలేజీల ప్రాధాన్యం తర్వాత దగ్గర్లోని కేంద్రాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటాయి. సులభంగా అర్థం కావడానికి ఎంసెట్‌లో ర్యాంకు వచ్చినవారికి ఏ విధంగా వెబ్ ఆప్షన్స్, కాలేజీల సీట్ల కేటాయింపు ఉంటుందో అదేవిధంగా పీజీలో ప్రవేశాలు చేస్తాం. నిర్దేశిత ఫీజు కూడా ఆన్‌లైన్‌లో చెల్లించాలి.
- **నిపుణ:** సీపీగెట్ నిర్వహణ ద్వారా విద్యార్థులకు మీరు చెప్పే అంశం?
- **వీసీ:** ఒక్క కోర్సుకు ఒకే పరీక్ష, ఆన్‌లైన్‌లో విద్యార్థికి భారం కాకుండా ప్రవేశపరీక్షలను నిర్వహిస్తున్నాం. మరీ ముఖ్యంగా మారుతున్న ప్రపంచంతోపాటు ఆధునిక సాంకేతికతో పారదర్శకంగా, వేగంగా ప్రక్రియను పూర్తి చేయనున్నాం. దీనివల్ల విద్యార్థులకు విశేష ప్రయోజనాలు లభిస్తాయి. ఎటువంటి సందేహాలున్నా కింది చిరునామాలో మెయిల్, ఫోన్, సెల్ లేదా నేరుగా సంప్రదించవచ్చు.

CPGET – 2019 OFFICE
Convener,
Directorate of Admissions,
Osmania University,
Hyderabad – 500 007.
Telangana State
Landline: 040-27090136
Phone: +91 7569947990
Email: cpget19@gmail.com

...✍ కేశవపంతుల వేంకటేశ్వరశర్మ

UPSC MAINS PREPARATION

The Civil Services Examination (CSE) is a nationwide competitive examination in India conducted by the Union Public Service Commission for recruitment to various Civil Services of the Government of India, including the Indian Administrative Service (IAS), Indian Foreign Service (IFS), Indian Police Service (IPS) among others. Also simply referred to as UPSC examination.

- Although regarded as one of the toughest exams in the country, with the right approach and strategy, an aspirant can crack the examination. It is essential for aspirants to know and understand the requirements of the examination such as the syllabus and pattern, to get started.

The Notification for the 2019 examination has been issued on 19 feb 2019.

- This exam is conducted every year in three stages and they are:
  1. Stage I: Preliminary Examination (Prelims)
  2. Stage II: Mains Examination
  3. Stage III: Personality Test/Interview Round

  Stage 1 and 2 are conducted in pen-paper mode.
- This year Prelims was conducted on June 2, 2019 and Mains will be held from September 20, 2019.

PRELIMS

- This examination is meant to serve as a screening test only; the marks obtained in the Preliminary Examination by the candidates who are declared qualified for admission to the Main Examination will not be counted for determining their final order of merit.

Paper	Nature of paper	Duration	Questions	Marks
I	Merit	2 hours	100	200
II	Qualifying	2 hours	80	200

MAINS

- The Main Examination will consist of written examination and an interview test. The written examination will consist of 9 papers of conventional essay type, out of which two papers will be of qualifying in nature. Marks obtained for all the compulsory papers and Marks obtained in Interview for Personality Test will be counted for ranking.

S. No	Paper	Nature of paper	Time	Marks
1	Paper A - Compulsory Indian Language	Qualifying	3 hours	300
2	Paper B – English	Qualifying	3 hours	300
3	Paper 1 – Essay	Merit	3 hours	250
4	Paper 2 – General studies 1	Merit	3 hours	250
5	Paper 3 – General studies 2	Merit	3 hours	250
6	Paper 4 – General studies 3	Merit	3 hours	250
7	Paper 5 – General studies 4	Merit	3 hours	250
8	Paper 6 - Optional Paper I	Merit	3 hours	250
9	Paper 7 - Optional Paper 2	Merit	3 hours	250
	Total			1750
	Interview/ Personality Test			275
	Grand total			2025

- The main Examination is intended to assess the overall intellectual traits and depth of understanding of candidates rather than merely the range of their information and memory. The nature and standard of questions in the General Studies papers will be such that a well- educated person will be able to answer them.
- The questions will be such as to test a candidate's general awareness of a variety of subjects, which will have relevance for a career in Civil Services. The questions are likely to test the candidate's basic understanding of all relevant issues, and ability to analyse, and take a view on conflicting socio-economic goals, objectives and demands. The candidates must give relevant, meaningful and succinct answers.
- Candidates who obtain such minimum qualifying marks in the written part of the Main Examination as may be fixed by the Commission at their discretion, shall be summoned by them for an interview known as the Personality Test.The number of candidates to be summoned for interview will be about twice the number of vacancies to be filled.
- Marks thus obtained by the candidates in the Main Examination (written part as well as interview) would determine their final ranking. Candidates will be allotted to the various Services keeping in view their ranks in the examination and the preferences expressed by them for the various Services and posts.

HOW TO PREPARE FOR MAINS

- Do I have to prepare for mains even if i am not clearing prelims, this time?
- Most of the students get this doubt. The answer is YES, because when you start preparing now for mains, you are laying a sound and solid foundation for the mains when you clear prelims next year with your determined effort. If a student has a doubt that he is not clearing prelims this time, he thinks that he needs to concentrate wholly on prelims so that at least next year he can clear prelims. That's half planned strategy, because after you clear your prelims next year, you will hardly have enough time to do answer writing practice and then the student might get panicky. To avoid such situations you need to study and do answer writing practice as if you are attempting mains this time itself. If we don't feel that way, things wont work out and years pass by.
- How much time do I spend daily in preparing for mains?
- Preparing for mains requires atleast 12-14 hrs of intensive and exhaustive study. The time needs to apportioned judicially between, 4 GS papers, Essay paper, Optional papers and finally language papers. Weightage needs to be given according to the importance of the subject.
- Is prelims and mains the same?
- Another common doubt among students is this. Mains is a different ball game compared to prelims. In prelims the questions are based on accuracy of knowledge, while in mains the questions are asked to test your analytical capabilities, your understanding of the overall picture and the logical way in which you present your answer.
- For ex. A prelims question might be: When did Gandhiji launch the Dandi march? The answer for which has to be very precise and accurate date of the launch of the famous Dandi march(12th March, 1930). But on the same topic question in mains might be: What is the spirit behind Gandhiji launching the Dandi march? to answer this question in mains we need to understand what is the core of the question. The core aspect is the Spirit of launching the Dandi march, and not about the dates or timelines. There are 3 aspects to what a student needs to write to gain maximum marks for this.
  1. Primarily, the Dandi march was launched to oppose the British and throw them out of the country by breaking their laws.
  2. It could be done by mass movement across the country.
  3. This mass movement can only happen when an issue of commonality for all the sections of the Indian society cutting across region, religion, caste, community, strata lines is crossed , and therefore salt was chosen to unite the whole country.
- So, to write mains answers we need a lot of analytical capabilities and understanding of the overall scenario.
- How many questions do I need to attempt in mains paper to get good marks?
- Usually a GS mains paper has 20 questions, which we need to complete in 3 hours. Over the time it has been observed that, the success mantra for a student to get a good rank has been to complete all the questions in each paper without fail. Attempting and writing all the questions logically and conclusively gives a lot of edge.
- If you have to finish all the questions you need to do a lot of practice and make yourself mentally and physically strong for such a grueling task.
- Is it necessary to attend a test series?
- Since this exam has a very broad scope of things to be covered, it is better to take guidance at a professional place. It should also be kept in mind that candidates have varied backgrounds and educational qualifications. So to bring all these variations to a common point of dealing with the requirements of this exam, it is advisable to look for some authentic professional guidance.
- Is command over English absolutely necessary for clearing this exam?
- Basic English is necessary to clear this exam and not flowery language which many people think is necessary. Moreover, you can write this exam and give the interview in your mother-tongue. If you work on improving the basics like listening to English news on TV and radio and trying to write something in English, everyday, there will be no problem at all.
- **How to get good marks in Essay paper?**
- One of the toughest papers among all the mains papers is the Essay paper. You need to write at least 2 essays in the Essay paper and the topics covered can be anything under the Sun, from abstract to specific to scientific to economics to development to welfare etc..
- To get good marks in the Essay a varied selection of topics needs to be pooled and information needs to be collected from at least 18 months before the exam date. Official magazines and sources need to be used for collecting this information.
- **How many words should I write in the Essay paper?**
- Quality is more important than number of words. The articulation, analytical assessment, observation skills, logical connectivity and expression is very important to score well in this paper.
- It has been observed over a period of time that, each of the 2 answers in the essay paper needs to be written to the tune of 1500-1800 words to get a good score.
- What is the importance of different areas in GS papers?

GS Paper	Sub areas	2016	2017	2018
Paper 1	History	75	85	60
	Social Science	62.5	50	105
	Geography	112.5	115	85
Paper 2	Polity	105	105	115
	Welfare and governance	95	95	85
	International relations	50	50	50
Paper 3	Economy	75	75	65
	Agriculture	50	50	60
	Science and Environment	75	75	75
	Internal security	50	50	50
Paper 4	Theory of ethics	120	130	130
	Case studies	130	120	120

- **How to prepare for the Optional papers?**
- Optional is one of the areas in mains that need to be done. It is not the most important area as most of the students tend to believe. While GS carries 1000 marks, optional carries 500 marks. We need to apportion our time to any subject based on its importance in the total marks.
- Daily 3 hours of preparation backed up with answer writing practice from a professional is absolutely necessary for getting good marks.
- **How important is the preparation for Language papers?**
- There are two language papers, 1. Compulsory Indian Language and 2. English, each with 300 marks but they are qualifying in nature and they are not counted for the total marks. It means that you have to qualify in these papers to get the other papers evaluated.
- Lot of students neglect the language papers and there have been some instances where some students failed to qualify in these papers. To avoid that we need to practice writing these 2 papers daily for about not more than 30 minutes, so that we can answer the questions in the exam without too much of difficulty.
- **I don't have good handwriting, is it going to give me less marks?**
- For getting good marks in mains, 2 aspects are important, 1. Legibility and 2. Speed.
- If you write legibly, the person correcting the paper will understand what you have written. This is more important than beautiful hand writing skills. If you don't write legibly, the person correcting will think that, either this candidate does not know the answer and that's why he is writing illegibly or he is too careless and reckless. Either ways marks won't be awarded in full.
- Speed is also absolutely necessary, because you need to attempt all the 20 questions. It means that you need to write 20 questions in 3 hours, that is 7 questions per hour. So you need to write an answer of about 200 words in every 8 minutes, which is a very herculean task and a back breaking exercise.
- **Is going to Delhi a must to crack this exam?**
- It is a very popular misconception that to clear this exam a candidate has to prepare in Delhi. Lot of candidates clear this exam from places where they hail from, for ex Hyderabad. All you need is proper professional guidance and answer writing practice.

VIJAY CH
D.S.PExcise
AMULYA B
Civil Services Faculty, M.Sc Finance
(Gold Medalist)
For any help in preparation or answer writing or test series
call/whataspp: 9912094992

III.
నమస్తే తెలంగాణ
నిపుణ
[కరీంనగర్]
సోమవారం 10 జూన్ 2019

సీఏ-సీపీటీ జూన్ 2019

సాధనతోనే సక్సెస్

చార్టర్డ్ అకౌంటెన్సీ జాతీయస్థాయి కోర్సు. సీపీటీ (కామన్ ప్రొఫిషియన్సీ టెస్ట్) అనేది సీఏ కోర్సుకు ఎంట్రెన్స్. ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు సీపీటీ పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించిన తర్వాత సీఏ కోర్సు ప్రారంభించవచ్చు. సీపీటీ పరీక్ష జూన్ 16న జరుగనున్నది. సీపీటీ విధానం ప్రకారం జరిగే చివరి పరీక్ష ఇదే. కాబట్టి సీపీటీ చదువుతున్న విద్యార్థులు వీలైనంత కష్టపడి ఈ పరీక్షకు సిద్ధమవ్వాలి. ఒక నిర్దిష్ట ప్రణాళికతో సీపీటీ పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు తుది పరీక్ష రాయబోతున్నారు. సీపీటీ పరీక్షలో రెండు భాగాలు ఉంటాయి. ఒకటి ఉదయం, రెండోది మధ్యాహ్నం.

సీపీటీ పరీక్ష విధానం

సమయం	సబ్జెక్టులు
ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు	అకౌంట్స్ (60 మార్కులు) ఎం.లా (40 మార్కులు)
మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు	ఎకనామిక్స్ (50 మార్కులు) క్యూ.టి. (50 మార్కులు)

తుది దశలో ఏ సబ్జెక్టును ఎలా చదవాలి?

అకౌంట్స్ (60 మార్కులు):

- అకౌంట్స్ సబ్జెక్టు సీపీటీలోనే కాక, సీఏ ఇంటర్, సీఏ ఫైనల్‌లో కూడా చాలా ముఖ్యమైనది.
- అకౌంట్స్ సబ్జెక్టు సీఏ ఫైనల్ వరకు ఉంటుంది. కాబట్టి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అభ్యసించాలి.
- సీపీటీలో ఎక్కువ స్కోర్‌చేయడానికి అవకాశం ఉన్న సబ్జెక్టు అకౌంట్స్.
- అకౌంట్స్‌ను ఎప్పుడూ ఇతర సబ్జెక్టులాగా చదవకూడదు. అలా చదివితే అన్ని ప్రశ్నలు, సమస్యలకు సమాధానాలు వచ్చినట్లే ఉంటాయి. కానీ సబ్జెక్టుపై పట్టురాదు. అకౌంట్స్ సబ్జెక్టులోని సమస్యలను ఎంత సాధనచేస్తే అంత మంచిది.
- ఈ సబ్జెక్టులో జర్నల్ ఎంట్రీలు చాలా ముఖ్యమైనవి. ప్రతి చాప్టర్‌లో జర్నల్ ఎంట్రీలు ఉంటాయి.
- ఎంట్రీస్ విషయంలో విద్యార్థులు తప్పు జవాబులు గుర్తించే అవకాశం ఉంది. పరీక్షలో ప్రతి ప్రశ్నను ఒకటికి రెండుసార్లు చదివిన తర్వాతే సమాధానాన్ని గుర్తించాలి.
- జర్నల్ ఎంట్రీస్ అన్నీ పుస్తకంలో ఒకేచోట కనుక రాసుకోగలిగితే పరీక్షలకు సన్నద్ధమవుతున్నప్పుడు రివిజన్ తేలికవుతుంది.
- అకౌంట్స్‌లోని ఏ అంశాన్ని బట్టీ పట్టవద్దు. ప్రతి అంశం పట్ల తార్కిక ఆలోచన దృక్పథాన్ని అలవర్చుకోవాలి.
- ఎక్కువగా థియరీ పార్ట్‌మీద దృష్టి పెట్టాలి. థియరీ, సమస్యలపై బహుళైచ్ఛిక ప్రశ్నల (ఎంసీక్యూ)లను ఎక్కువగా సాధన చేయాలి.
- ఈ సబ్జెక్టులో ముఖ్యమైన చాప్టర్లు పార్ట్‌నర్‌షిప్ అకౌంట్స్, కంపెనీ అకౌంట్స్ అండ్ అకౌంటింగ్ యాన్ ఇంట్రడక్షన్, ఫైనల్ అకౌంట్స్, కన్‌సైన్‌మెంట్ అకౌంట్స్.

ఎం.లా (40 మార్కులు)

- ఈ సబ్జెక్టు ఇంటర్ చదివిన అన్ని గ్రూపులవారికి కొత్త సబ్జెక్టే. పరీక్షలలో ప్రతి ప్రశ్ననూ ఎటువంటి డొంకతిరుగుడు లేకుండా నేరుగానే అడగటం జరుగుతుంది.
- సబ్జెక్టు పరంగా వివాదాస్పద అంశాలు ఎక్కువ కాబట్టి మీరు చదువుతున్న పుస్తకం తప్ప వేరే మెటీరియల్‌గానీ, పుస్తకంగానీ పరీక్షల ముందు చదవద్దు.
- ఈ సబ్జెక్టు కోసం ఎక్కువ పుస్తకాలను చదవవద్దు. (రిఫర్ చేయవద్దు)
- ఈ సబ్జెక్టు కాంట్రవర్సీలతో కూడుకున్నది కాబట్టి ప్రతి మల్టిపుల్ చాయిస్ ప్రశ్నను లోతుగా విశ్లేషించుకోవాల్సిన అవసరం లేదు.
- ఎం.లా సీఏ ఇంటర్‌లోనూ ఉంటుంది. కాబట్టి ప్రతీ అంశానికి ప్రాధాన్యం ఇవ్వాలి.
- ఎంలాలో ప్రతి అంశంలోనూ విద్యార్థి అర్థవివరణ నైపుణ్యాన్ని పెంచుకోవాలి.
- సీపీటీ పాసా లేక ఫెయిలా అనేది నిర్ణయించే సబ్జెక్టు ఎంలా అని చెప్పవచ్చు.
- సీపీటీ పరిధిలోని సెక్షన్ నంబర్లు, కేస్ స్టడీస్, రచయితలు, నిర్వచనాలు గుర్తుపెట్టుకోవాల్సిన పనిలేదు. గుర్తుపెట్టుకుంటే మంచిదే కానీ తప్పనిసరి కాదు.
- అన్ని చాప్టర్లలోనూ identify the correct / incorrect / all of the above / none of the above questions ఉంటాయి. వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఒకటికి రెండుసార్లు చదివి సమాధానం పెట్టండి.
- ఈ సబ్జెక్టులో ముఖ్యమైన చాప్టర్లు Indian Partnership Act and Sale of Goods Act.

ఎకనామిక్స్ (50 మార్కులు)

- ఎకనామిక్స్ సబ్జెక్టును రెండుగా విభజించవచ్చు. 1. మైక్రో ఎకనామిక్స్ 2. మ్యాక్రో ఎకనామిక్స్
- పాత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే పరీక్షల్లో అడుగుతున్న ప్రశ్నల్లో 15 నుంచి 20 ప్రశ్నలు తేలికగాను, నేరుగా అడిగేవి ఉన్నాయి.
- ఎకనామిక్స్‌లోని అన్ని చాప్టర్లకీ సమప్రాధాన్యం ఇస్తూ చదవాలి.
- ఎకనామిక్స్‌లోని ప్రతీ అంశంలోనూ సంభావిత స్పష్టత ఉండాలి.
- డయాగ్రమ్స్, నిర్వచనాలు, ఆథర్ (రచయిత)ల పేర్లు గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం లేదు.
- మైక్రో ఎకనామిక్స్‌లో సమస్యలు ఇస్తే తికమక పడకుండా ఒకటికి రెండుసార్లు ప్రశ్నను చదివి సమాధానం గుర్తించాలి.
- మైక్రో ఎకనామిక్స్‌లో డయాగ్రమ్స్‌ను అనాలసిస్ చెయ్యగలగాలి.
- మైక్రో ఎకనామిక్స్‌లో ఫ్యాక్ట్స్ &ఫిగర్స్ (ఇయర్స్, పర్సంటేజ్‌లకు సంబంధించిన డాటా) చాలా ముఖ్యమైనవి.
- పరీక్షకు సన్నద్ధమయ్యేటప్పుడు పాత ప్రశ్నపత్రాలతో అడిగిన ప్రశ్నలను పునశ్చరణ చేస్తే మంచిది.
- సీపీటీలో ఉన్న మ్యాక్రో ఎకనామిక్స్ సీఏ ఇంటర్‌లో, ఎకనామిక్స్ ఫర్ ఫైనాన్స్‌లో తిరిగి పునరావృతం అవుతుంది. కాబట్టి బాగా చదవాలి.
- మైక్రో ఎకనామిక్స్‌లో ముఖ్యమైన చాప్టర్లు థియరీ ఆఫ్ కన్స్యూమర్ బిహేవియర్, కాస్ట్ అనాలసిస్, ప్రొడక్షన్ అనాలసిస్, ప్రైస్ అండ్ అవుట్‌పుట్ డిటర్మినేషన్.

క్యూటీ మ్యాథమెటిక్స్ & స్టాటిస్టిక్స్ (50 మార్కులు)

మ్యాథమెటిక్స్:

- ఈ సబ్జెక్టులో సూత్రాలు చాలా ముఖ్యమైనవి
- సీఈసీ విద్యార్థులు తప్పక ఎంసీక్యూలను ఎక్కువగా ప్రాక్టీస్ చేసుకోవాలి
- ఈ సబ్జెక్టులో చాలా ఎంసీక్యూలు లెంథీగా ఉంటాయి. అందుకని రివిజన్ చేసే టైంలో ఎక్కువసార్లు ఈ తరహా ఎంసీక్యూని ప్రాక్టీస్ చేయాలి.
- అన్ని చాప్టర్లకు సమ ప్రాధాన్యం ఇవ్వాలి
- అన్ని చాప్టర్లకి సంబంధించిన ఫార్ములాస్ అని ఒకచోట రాసుకుంటే రివిజన్ తేలికవుతుంది.
- ప్రతీ చాప్టర్‌లోని సమస్యలను సాధన చేసిన తర్వాత ఆ సమస్యలకు సంబంధించిన సూత్రాలను ఒకటికి రెండుసార్లు చూడకుండా రాస్తే మంచిది.
- క్యాలిక్యులేటర్‌ను వేగంగా ఉపయోగించేలా సాధన చేయాలి.
- అత్యధిక వెయిటేజీ ఉన్న చాప్టర్లలో పట్టు సాధించాలి.
- అన్ని చాప్టర్ల నుంచి ప్రశ్నలు ఇస్తున్నారు. నిడివి ఎక్కువగా ఉన్న చాప్టర్ల కంటే సులభంగా, తక్కువ పరిమాణంలో ఉన్న చాప్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తే తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు సాధించవచ్చు.
- రివిజన్ చేసుకునే అంశాలను/సంబంధిత ఫార్ములాలను వేరొక పేపర్‌లో రాసుకుంటూ ప్రతిరోజు వాటిని ఒకసారి పునశ్చరణ చేసుకోవాలి. అప్పుడే తుది పరీక్ష బాగా రాయగల్గుతారు. పోటీ పరీక్షల్లో నిడివి ఎక్కువ ఉన్న లెక్కలను మొదట చేయవద్దు. తెలిసినప్పటికీ ఆ ప్రశ్నలు మూడు సబ్జెక్టులు పూర్తి చేసుకున్న తర్వాతనే ఆలోచించాలి.
- ఈ సబ్జెక్టులో ముఖ్యమైన చాప్టర్లు Limits, Derivaties, Ingrations, Permutations and Combinations, Ratio and Proportions, Mathematics of Finance.

స్టాటిస్టిక్స్:

- ఈ సబ్జెక్టులో ఫార్ములాలు చాలా ముఖ్యమైనవి.
- ప్రతిరోజు ఫార్ములాలను తప్పనిసరిగా రివైజ్ చేసుకోవాలి. దీని కోసం కొంత సమయాన్ని కేటాయించండి.
- ఈ సబ్జెక్టులోని ఫార్ములాస్ అన్నీ దగ్గరగా పోలీ ఉంటాయి. ఎన్నోసార్లు రివిజన్ చేస్తే తప్ప మీరు బేధాన్ని కనిపెట్టలేరు.
- చాలామంది విద్యార్థులు పరీక్షలో కరెక్ట్ ఫార్ములాలు గుర్తుకు రాక మార్కులు పోగొట్టుకుంటున్నారు.
- ఈ సబ్జెక్టులో ప్రాబ్లమ్స్‌కే కాక థియరీకి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి.
- ఇంటర్‌లో మ్యాథ్స్ సబ్జెక్టు చదవని విద్యార్థులకు సీపీటీలో స్టాటిస్టిక్స్ సబ్జెక్టు చాలా కీలకం.
- పరీక్షల్లో 35 నుంచి 40 శాతం ఎంసీక్యూలను థియరీ మీదనే అడిగే అవకాశముంది. కాబట్టి థియరీ మీద కూడా దృష్టి కేంద్రీకరించాలి.
- ప్రతీ చాప్టర్ ప్రిపేర్ అయ్యేటప్పుడు ప్రాధాన్యం కలిగిన అంశాలనూ, సూత్రాలను హైలైట్ చేసుకోవాలి.
- ఈ సబ్జెక్టులో ముఖ్యమైన చాప్టర్లు Probability, Theoritical Distributions, Sampling, Statistical Distribution of Data.

పునశ్చరణ మెళకువలు

1. తెలియని అంశాలను వదిలివేసి తెలిసిన పునశ్చరణ చేయాలి.
2. గుర్తుంచుకోవాల్సిన అంశాలను కాగితంపై రాసుకుంటూ ప్రతి రోజూ ఆ కాగితాన్ని చదవాలి.
3. పరీక్షకు ఇంకా కొద్దిరోజుల కాలవ్యవధి మాత్రమే ఉంది. నేర్చుకోవాల్సిన అంశాలను ప్రాధాన్య క్రమంలో చదవాలి.
4. కాగితం, కలంతో రాసే పరీక్షే కాబట్టి తుది పరీక్ష ఏ సమయంలో జరుగుతుందో అదే సమయంలో నమూనా పరీక్షలు అలవాటు చేసుకోవాలి.
5. నమూనా పరీక్షలు రాసేటప్పుడు ఏ ప్రశ్నకు ఆ ప్రశ్న పూర్తిచేసిన వెంటనే బబ్లింగ్ చేసే విధానాన్ని అలవాటు చేసుకోవాలి. ఎక్కువమంది విద్యార్థులు అన్నింటికీ జవాబులను గుర్తించిన తర్వాత ఒకేసారి ఓఎంఆర్ షీట్లో గుర్తిస్తున్నారు. ఇలా చేయడం మంచిదికాదు. ఒకవేళ ఒక ప్రశ్న వరుస క్రమం తప్పితే అన్నింటికీ మార్కులుపోయే ప్రమాదం ఉంది. కలంతో జవాబులను గుర్తిస్తున్నందున ఒకసారి గుర్తించిన జవాబును మార్చుకునే అవకాశమే లేదు.
6. ఇప్పటినుంచి కనీసం 10 నమూనా పరీక్షలు తుది పరీక్ష తరహాలో రాయాలి.
7. నమూనా పరీక్ష రాసిన తర్వాత, తొలిగా తెలిసిన ప్రశ్నలు ఎన్నింటికి తప్పు సమాధానాలు గుర్తించారో గమనించాలి. ఆ తప్పులు తర్వాతి పరీక్షలో పునరావృతం కాకుండా జాగ్రత్త తీసుకోవాలి.
8. తెలియని ప్రశ్నల్లో కూడా సులువుగా నేర్చుకోగల ప్రశ్నలు ఏమున్నాయో తెలుసుకోవాలి. వాటిని అభ్యాసం చేయడానికి ప్రయత్నించాలి.
9. మైండ్ మ్యాప్స్ తయారుచేసుకుని ఉపయోగించాలి.
10. వివాదాస్పదమైన ప్రశ్నలకు ప్రాధాన్యం ఇవ్వద్దు. ఇలాంటి ప్రశ్నలకు అధ్యాపకులు ఏ సమాధానాన్ని బలపర్చారో దాన్ని అదేవిధంగా తీసుకోవడం మేలు. ప్రశ్నలోని నాలుగు సమాధానాలను సరిగా చదవడం అలవాటు చేసుకోవాలి.
11. గత ప్రశ్నపత్రాలను లోతుగా, తార్కికంగా, భావనపరంగా, అన్వయపరంగా, వ్యూహాత్మకంగా పరిశీలిస్తే ప్రశ్నల ఓరియంటేషన్ అర్థమవుతుంది. అలాంటి ప్రశ్నలను వీలైనన్ని ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తే మంచిది. అలాగే అలాంటి ప్రశ్నలు ఉన్న మాక్‌టెస్ట్‌లను రాయాలి.
12. ప్రాబ్లమ్ సాల్వింగ్ మెరుగుపర్చుకోవాలి. అందులో వేగం పెంచుకోవాలి. అది కేవలం నిరంతర ప్రాక్టీస్‌తోనే సాధ్యం.
13. ప్రశ్నలతో కుస్తీపట్టడం ద్వారా పర్ఫామెన్స్ స్థాయిని విద్యార్థి తనకుతాను తెలుసుకోగలుగుతాడు. తన స్థాయి ఏంటో కూడా అర్థమవుతుంది.
14. గత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయండి.
15. ప్రతి ప్రశ్న సాల్వ్ చేసేందుకు కాలపరిమితిని విధించుకోవాలి. అలా ప్రాక్టీస్ చేస్తూ వేగం పెంచుకోవాలి.
16. కష్టంగా ఉన్న ఏరియాతో ప్రారంభించాలి. కష్టమనిపించిన విభాగాలకు నోట్స్ రూపొందించుకోవాలి. ఎలా సులువుగా ఉంటుందో చూసుకుని ఆ క్రమంలో కష్టపడాలి.
17. ప్రాక్టీస్ చేస్తున్న క్రమంలో తప్పులను విశ్లేషించుకోవాలి. కష్టంగా అనిపిస్తున్న, వేగాన్ని నియంత్రిస్తున్న విషయాలను గ్రహించి, ఎప్పటికప్పుడు సరిదిద్దుకోవాలి.
18. తార్కికంగా ఆలోచించడం నేర్చుకోవాలి. స్టెప్ అనంతరం స్టెప్ మాదిరిగా సొల్యూషన్ ఉండేలా ప్రాక్టీస్ చేయాలి. ఆ రకంగా ఆలోచన కూడా ఉండాలి. అనవసరమైన ఆలోచనను వెంటనే తుంచేయండి.
19. ఎగ్జామ్ పూర్తయ్యేవరకు విశ్రమించడం అంటూ ఉండకూడదు. అందుకు రొటీన్ క్రమాన్ని నిర్దేశించుకుని పాటించండి.

సీపీటీ పరీక్ష - తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఈ కొద్ది రోజులకు సరిపడా టైంటేబుల్ తయారు చేసుకోండి. అంటే ఏ సమయంలో ఏ సబ్జెక్టు, ఏ చాప్టర్ చదవాలి అనే విషయాలు. అంతేకాని ఎప్పుడుపడితే అప్పుడు, ఏది పడితే అది చదవవద్దు. ఒక సిస్టమాటిక్ వేలో చదివితే సీపీటీ పరీక్ష పాసవ్వడం కష్టమేమీ కాదు.
- మీరు ఇప్పటి వరకు సీపీటీ కోసం ఏ మెటీరియల్/బుక్స్ చదివారో వాటినే చదవండి. కొత్త బుక్స్, మెటీరియల్‌ను ఎట్టి పరిస్థితుల్లో చదవవద్దు. అలా చదివితే తికమక పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఉదాహరణకు ఎం.లా సబ్జెక్టులోని కొన్ని కేస్ స్టడీస్ ఒక టెక్స్ట్‌బుక్‌లో ఒకలా మరో టెక్స్ట్ బుక్‌లో మరోలా ఉంటుంది. మీరు ఐసీఏఐ వారి స్టడీ మెటీరియల్‌నే ప్రామాణికంగా తీసుకోండి. సీపీటీలో అకౌంట్&ఎం.లా సబ్జెక్టులు చాలా ముఖ్యమైనవి. మీరు సీపీటీ మొదటి ప్రయత్నంలోనే పాస్ అవ్వాలంటే ఈ రెండు సబ్జెక్టుల మీద పట్టు ఉండాలి. మీ ప్రిపరేషన్ సమయంలో ఈ సబ్జెక్టులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వండి.
- రోజుకు 10 నుంచి 12 గంటలపాటు సమయాన్ని ప్రిపరేషన్‌కు కేటాయించండి. ఈ వారం రోజుల్లో మీరు చేయాల్సింది మీకు బాగా వచ్చిన ఎంసీక్యూ (బహుళైచ్ఛిక ప్రశ్నలు)లను స్కిప్ చేసుకుంటూ రండి. ఈ విధంగా మీరు చేయడం వల్ల మీరు స్కిప్ చేసినవాటిని తిరిగి చదవాల్సిన అవసరం లేదు. మీపై మీకు ఆత్మస్థైర్యం పెరుగుతుంది.

వీటిని పాటించండి

1. మీరు రివిజన్ చేసేటప్పుడు భయానికి లేదా మానసిక ఒత్తిడికి లోనవ్వద్దు. దీనికిగాను మీరు రోజుకు ఒక 15 నిమిషాల పాటు మెడిటేషన్ చేయండి. మానసిక ఉల్లాసానికి ఇది ఎంతగానో తోడ్పడుతుంది.
2. ఈ సమయంలో సినిమాలు, సెల్‌ఫోన్‌ను వినియోగించడం, స్నేహితులతో పిచ్చాపాటి మాట్లాడటం చేయకండి. ఈ నెల రోజులు సీపీటీ పరీక్ష పాస్ కావడానికి చాలా విలువైనది. కాబట్టి వృథా చేసుకోవద్దు.
3. ఆహార విషయంలో కూడా చాలా జాగ్రత్త వహించండి. సాధ్యమైనంతవరకు సాత్విక ఆహారం తీసుకోండి. జంక్ ఫుడ్స్, వీధి బండ్ల వద్ద ఉన్న తినుబండారాలు తినవద్దు. పరీక్షల సమయంలో మీ ఆరోగ్యం పాడైతే ఆ ప్రభావం రివిజన్‌మీద పడుతుంది. ఆ ప్రభావం సీపీటీ పరీక్ష మీద కూడా పడుతుంది. తాగే మంచినీళ్ల విషయంలో కూడా జాగ్రత్త వహించండి. అనేక అనారోగ్యాలు తాగేనీళ్లవల్లే వస్తాయి. సాధ్యమైనంతవరకు కాచిన నీళ్లు లేదా ప్యూరిఫైడ్ వాటర్ తాగడం మంచిది.
4. పరీక్షకు భయపడి నైటవుట్ స్టడీస్ చేయవద్దు. నైటవుట్ స్టడీస్ వల్ల మీకు హార్మోనల్ ఇన్‌బ్యాలెన్స్ అవ్వొచ్చు. అది నేరుగా మీ మెదడుపై, మీ శరీరంపై ప్రభావం చూపవచ్చు. కాబట్టి రాత్రి వీలైనంత త్వరగా పడుకోండి.
5. ప్రతి రోజూ 6 నుంచి 8 గంటల వరకు నిద్రపోండి. ఈ నెలలో విశ్రాంతి చాలా అవసరం. మంచి నిద్ర ఉంటే మీరు చదువుపై ఎక్కువ శ్రద్ధ పెట్టవచ్చు. మెదడు కూడా చురుగ్గా పనిచేస్తుంది.
6. మీరు చదివేటప్పుడు ప్రతి గంటకు 2 నుంచి 3 నిమిషాలు కళ్లు మూసుకుని ధ్యానం చేయండి. ఇలా చేయడం ద్వారా మీ కళ్లపై ఒత్తిడి ఉండదు. టెన్షన్‌తో చదవద్దు. విశ్రాంతి కోసం ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ లేదా భక్తి పాటలు వినండి. కానీ టీవీ, సెల్‌ఫోన్, ఇంటర్నెట్ జోలికి వెళ్లవద్దు. టీవీ చూస్తున్నంతసేపు మనకు తెలియకుండానే చాలా సమయం వృథా అవుతుంది.
7. ఎటువంటి పరిస్థితుల్లో కూడా కంబైన్డ్ స్టడీస్ చేయవద్దు. ఎందుకంటే ఎక్కువ మందితో కూర్చుని చదివితే మాటలే వస్తాయి. కానీ చదవడం జరగదు. కంబైన్డ్ స్టడీస్ తప్పనిసరిగా చేయాల్సి వస్తే ఒకరు లేదా ఇద్దరితో మాత్రమే చేయండి.
8. ఐసీఏఐ వారు నిర్వహించే మాక్‌టెస్ట్‌లకు తప్పనిసరిగా హాజరు కావాలి. మెయిన్ పరీక్ష రాసేముందు ఒక మాక్‌టెస్ట్ రాయడంవల్ల పరీక్షలో మీకు టైమ్ మేనేజ్‌మెంట్ అలవాటవుతుంది. మీకు దగ్గరిలోని ఐసీఏఐ చాప్టర్ ఆఫీస్‌లో సంప్రదిస్తే మాక్‌టెస్ట్ తేదీ తెలుస్తుంది. మాక్‌టెస్ట్ రాయడంవల్ల మీరు మీ పర్ఫామెన్స్‌ను ముందుగానే ఎవాల్యుయేట్ చేసుకుని మెయిన్ పరీక్షకు మరింత జాగ్రత్తగా ప్రిపేర్ అవ్వచ్చు. మీ తప్పులను కూడా సరిచేసుకోవచ్చు.
9. ఏదైనా సబ్జెక్టు లేదా చాప్టర్ అర్థం కానప్పుడు డిప్రెషన్‌లోకి వెళ్లవద్దు. సమస్యలోనే మీకు పరిష్కారం ఉంటుంది. విజయానికి దగ్గరిదారులు ఉండవు. కష్టమే ఫలిస్తుంది.

తుది పరీక్షకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

1. పరీక్ష తేదీనాటికి చాలా రోజులు ముందుగా మీకు హాల్ టికెట్ వస్తుంది. అలా రాని పక్షంలో మీ హాల్ టికెట్‌ని మీరు ఐసీఏఐ వెబ్‌సైట్ www.icai.nic.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
2. పరీక్ష రోజు 15 నిమిషాల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.
3. మీరు పరీక్ష రాసేటప్పుడు ఓఎంఆర్ షీట్‌పై బబ్లింగ్ చేయాలి. సరిగా బబ్లింగ్, డార్క్‌గా చేయకపోయినా వాల్యుయేషన్ టైమ్‌లో కంప్యూటర్ మీరు చేసిన బబ్లింగ్‌ను సరిగా గుర్తించకపోవచ్చు. తద్వారా ఆన్సర్ కరెక్ట్‌గా చేసినా మార్కులు పడవు. బ్లాక్ పెన్‌తో బబ్లింగ్ చేస్తే ఇటువంటి సమస్యలు రావు.
4. సీపీటీ పరీక్ష ఉదయం రెండు గంటలు, మధ్యాహ్నం రెండు గంటలు 100 మార్కుల చొప్పున జరుగుతుంది. అంటే ప్రతి ప్రశ్నకు మీకు ఒక నిమిషం వ్యవధి దొరుకుతుంది. ఒకే ప్రశ్నకు ఎక్కువ సమయం కేటాయించకుండా తదుపరి ప్రశ్నకు వెళ్లండి. పరీక్ష చివరలో సమయం ఉంటే అప్పుడు మీరు ఆ ప్రశ్నకు సమాధానం ఆలోచించండి.
5. ప్రతి తప్పుడు సమాధానానికి 0.25 నెగెటివ్ మార్కింగ్ ఉంది. కాబట్టి సమాధానం తెలియని ప్రశ్నలజోలికి వెళ్లవద్దు.
6. ఒకవేళ హాల్ టికెట్ పోతే మీ హాల్ టికెట్‌ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు లేదా ఎవరైనా ఒక చార్టర్డ్ అకౌంటెంట్ దగ్గర లెటర్ హెడ్‌పై మీ ఫొటో అంటించి మీరు వారికి పరిచయమేనని చార్టర్డ్ అకౌంటెంట్ సంతకం పెట్టాలి. అది చూపెడితే పరీక్షకు అనుమతిస్తారు.

మట్టుపల్లి ప్రకాశ్
మాస్టర్ మైండ్స్
హైదరాబాద్
9248733323

3. MCQsని ఎలా ప్రిపేర్ కావాలి?
   ఎ) పొరపాటునైనా MCQsని mugup చేయొద్దు. మైండ్‌ను ఫైన్ ట్యూన్ చేసుకుని ఏకాగ్రతతో చదవాలి.
   బి) MCQ కాన్సెప్ట్‌ను అర్థం చేసుకుని చదవాలి.
   సి) సీపీటీలో MCQని mugup చేసి చదివితే ఐపీసీసీలో ఇబ్బంది పడే అవకాశం ఉంది.
   డి) సీపీటీ మెయిన్ ఎగ్జామ్‌లో తెలిసిన MCQsనే చిన్న చిన్న మార్పులు చేసి కొత్త పద్ధతిలో క్వశ్చన్ వచ్చే అవకాశం ఉంది. MCQsని mugup చేసి చదివితే అలాంటి MCQsని హ్యాండిల్ చేయలేరు. పేపర్‌లో ఎలా వచ్చినా ఆన్సర్ చేయడానికి సన్నద్ధంగా ఉండాలి. అందుకే కాన్సెప్చువల్ ప్రిపరేషన్ తప్పనిసరి.
4. మొదటి రివిజన్‌లో స్కిప్ అవ్ చేయని MCQsని రివైజ్ చేయండి. రివైజ్ చేసిన MCQsలో మీకు వచ్చిన, మీరు ఇంపార్టెంట్‌వి కావనుకుంటున్నటువంటి MCQsని స్కిప్ అవ్ చేయండి. రెండో రివిజన్‌లో మరికొన్ని MCQsని స్కిప్ అవ్ చేసుకుంటూ వెళ్లండి. అలా మూడు లేదా నాలుగు రివిజన్స్ చేసే సమయానికి దాదాపు 80 నుంచి 90 శాతం MCQsని స్కిప్ అవ్ చేసుకోగలిగితే పరీక్షకు ఒకటి లేదా రెండు రోజుల ముందు మీరు మిగిలిన ఆ 10 శాతం MCQs మీద కాన్సన్‌ట్రేట్ చేస్తే సరిపోతుంది.
5. మీలో ఎవరైనా మంచి మార్కులు (టాప్ మార్కులు) తెచ్చుకోవాలంటే రకరకాల పుస్తకాలు చదివితే మంచి మార్కులు రావు. మీరు ఏదైతే మెటీరియల్ చదివారో దాన్నే పదే పదే చదవండి. మంచి మార్కులు తప్పక వస్తాయి. మీకు MCQsని మార్చి అడిగినా ఆన్సర్ చేయగలగాలి. అప్పుడే మీకు మంచి మార్కులు తప్పనిసరిగా రావడానికి అవకాశం ఉంది. మీరు తప్పక ఐసీఏఐ స్టడీ మెటీరియల్‌ను రిఫర్ చేయాల్సిందే.
6. ప్రాబ్లమేటిక్ పేపర్స్‌లో మీకు ఏదైనా ముఖ్యమైనవి అనిపిస్తే మీ మెటీరియల్‌లో/నోటుబుక్స్‌లో హైలైట్ చేసుకోండి. అలాగే దాని సొల్యూషన్‌లో ఆ ఇంపాక్ట్ ఎక్కడ వస్తుందో హైలైటర్‌తో హైలైట్ చేయండి. ప్రతి సబ్జెక్టు నుంచి ఐడెంటిఫై కరెక్ట్ స్టేట్‌మెంట్ లేదా ఐడెంటిఫై ఇన్‌కరెక్ట్ స్టేట్‌మెంట్ అనే MCQs ఇవ్వడం జరుగుతుంది. అటువంటి MCQsని ముఖ్యమైన MCQsగా పరిగణించాలి. అలాంటి MCQsని ఆన్సర్ చేయబోయే ముందు ఒకటికి రెండుసార్లు క్వశ్చన్‌ను చదవి ఆన్సర్ చేయాలి.
7. ఒక డౌట్స్ బుక్ పెట్టుకోండి. మీకు వచ్చిన డౌట్స్ అన్నీ ఆ పుస్తకంలో రాయండి. మీరు ఏదైనా ఇన్‌స్టిట్యూట్‌లో చదువుతూ ఉంటే అక్కడి ఫ్యాకల్టీని అడిగి ఆ డౌట్స్‌ని అడిగి క్లారిఫై చేసుకోండి లేదా సొంతంగా ప్రిపేరవుతుంటే మీరు చదివిన టెక్స్ట్‌బుక్స్ లేదా స్టడీ మెటీరియల్ చూసుకుని మీ డౌట్స్‌ని క్లారిఫై చేసుకోండి.
8. మీరు ఏ సబ్జెక్టు అయితే కష్టమనుకుంటారో ఆ సబ్జెక్టుని ఎక్కువసేపు చదవండి. అంతేగాని వచ్చిన సబ్జెక్టునే చదువుతూపోతే రాని సబ్జెక్టుని చదవడానికి మీకు సమయం సరిపోదు. ఒకటి గుర్తు పెట్టుకోండి. మీరు మెయిన్ పరీక్షలో పాస్ కావాలంటే పూర్తిగా 100 మార్కులే కాకుండా సబ్జెక్టు వైజ్‌గా కూడా 30 శాతం మార్కులు సాధించాలి. అప్పుడే మీరు పాసైనట్టు పరిగణిస్తారు. కాబట్టి అన్ని సబ్జెక్టులకు ప్రాతినిధ్యం ఇవ్వాలి.
9. టెక్స్ట్‌బుక్స్‌లో గాని లేదా ఐసీఏఐ వారి మోడల్ టెస్ట్‌పేపర్లలో ఉన్న MCQs పక్కన ఆన్సర్లు రాయకండి. అలా చేస్తే మీరు రివిజన్ చేసుకునే సమయంలో ఆ MCQsకి సంబంధించిన ఆన్సర్ పక్కనే ఉండటంవల్ల మీరు ఆ MCQs జవాబు విశ్లేషించడానికి వీలుండదు. మీరు ఆ MCQపై మళ్లీ కాన్సన్‌ట్రేట్ చేయలేరు.
10. మీరు క్యాలిక్యులేటర్ స్పీడ్‌గా ఉపయోగించేలా క్యాలిక్యులేటర్ టైపింగ్ ప్రాక్టీస్ చేయండి. ఒక మంచి కంపెనీకి సంబంధించిన క్యాలిక్యులేటర్ ముందే కొనండి. కనీసం రోజుకు అరగంట అయినా క్యాలిక్యులేటర్‌పై స్పీడు టైపింగ్ ప్రాక్టీస్ చేయండి. మీరు ఏ క్యాలిక్యులేటర్‌పైన ప్రాక్టీస్ చేశారో దానినే పరీక్షలో తప్పనిసరిగా ఉపయోగించండి. ఎట్టి పరిస్థితుల్లో చిన్నసైజు క్యాలిక్యులేటర్‌ను వాడవద్దు. చిన్న క్యాలిక్యులేటర్‌ని వాడవద్దు. చిన్న క్యాలిక్యులేటర్ అయితే ఫింగరింగ్ సరిగారాదు. చిన్న క్యాలిక్యులేటర్ వాడటంవల్ల పరీక్షలో ఇన్‌కన్వీయన్స్‌తోపాటు, సమయం కూడా వృథా అవుతుంది. సీపీటీ పరీక్షలో ఎలక్ట్రానిక్ క్యాలిక్యులేటర్ వాడరాదు.
11. మీరు చదివే పుస్తకాలను జాగ్రత్తగా భద్రపర్చుకోండి. కారణం ఏమిటంటే మీరు చదివేటప్పుడు మీరు కొంత రన్నింగ్ నోట్స్ తయారుచేసుకుని ఉంటారు. పొరపాటున ఆ విధంగా రాసుకున్న పుస్తకాలు మిస్ ప్లేస్ అయితే మీరు మళ్లీ రన్నింగ్ నోట్స్ రాసుకోవడం కష్టం. ప్రిపరేషన్‌కు వాడాల్సిన సమయమంతా కొత్తగా నోట్స్ రాసుకోవడానికి సరిపోతుంది. చివరి నిమిషంలో ఇబ్బందిపడుతారు. అంతేకాకుండా కొత్త పుస్తకాలు చదవడంవల్ల కాన్సెప్ట్‌ను కూడా మర్చిపోయే అవకాశం ఉంది.
12. మీరు చదువుకునే ప్రదేశాన్ని మార్చకండి. ఆల్రెడీ మీకు అలవాటైన ప్రదేశం అయితే మీరు నిశ

మా అందరికి స్ఫూర్తిప్రదాత ఎస్వీఆర్

సంజయ్ కిషోర్, చిరంజీవి, బ్రహ్మానందం

'ఎస్వీ రంగారావు నా ఆరాధ్య నటుడు. మా నాన్న ద్వారా ఎస్వీఆర్ గొప్పతనాన్ని గురించి తెలుసుకున్న తర్వాతే నాకు నటుడిని కావాలనే కోరిక మొదలైంది' అని అన్నారు ప్రముఖ నటుడు చిరంజీవి. ఫొటోల రూపంలో ఎస్వీ రంగారావు జీవితాన్ని ఆవిష్కరిస్తూ సంజయ్ కిషోర్ రూపొందించిన 'మహానటుడు' పుస్తకాన్ని శనివారం హైదరాబాద్‌లో చిరంజీవి విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ఎస్వీఆర్ లాంటి గొప్ప వ్యక్తిపై వచ్చిన పుస్తకాన్ని విడుదల చేయడం భగవంతుడు ఇచ్చిన మహాద్భాగ్యంగా భావిస్తున్నాను. నటనలో ఆయనో ఎన్‌సైక్లోపీడియా. ఎస్వీఆర్ నటించిన 'జగత్ కిలాడీలు' 'జగత్ జంత్రీలు' సినిమాల్లో మా నాన్న చిన్న పాత్రలను పోషించారు. ఆ సినిమా చిత్రీకరణల విశేషాల్ని నాన్న మాతో పంచుకునేవారు. అలా ఎస్వీఆర్‌పై అభిమానం మొదలైంది. చరణ్ సినిమాల్లోకి వస్తాననగానే ఎస్వీ రంగారావు గారి సినిమాలు చూపించాను. ఆయన సహజ నటన నుంచి చరణ్ స్ఫూర్తి పొందాడు. మా అందరికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. ఎస్వీఆర్ ఈ నేలపై పుట్టడం తెలుగువారి అదృష్టం. ఆయన్ని నేరుగా ఒక్కసారి కలవలేకపోయాను. ఫొటో కూడా తీయించుకోలేకపోయాననే బాధ జీవితాంతం వెంటాడుతూనే ఉంటుంది' అని తెలిపారు. నటనకు రూపమిస్తే అది ఎస్వీ రంగారావు అని బ్రహ్మానందం పేర్కొన్నారు. బాల్యం నుంచి ఎస్వీఆర్ జీవిత ప్రయాణాన్ని ఛాయాచిత్రాల రూపంలో ఈ పుస్తకంలో పొందుపరిచామని రచయిత సంజయ్ కిషోర్ అన్నారు. ఈ కార్యక్రమంలో తమ్మారెడ్డి భరద్వాజ, రావికొండలరావు. రోజారమణి, జయలలిత తదితరులు పాల్గొన్నారు.

కల్కి పరిశోధన

ప్రశాంత్‌వర్మ, సి.కల్యాణ్,జీవిత

రాజశేఖర్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'కల్కీ'. ప్రశాంత్‌వర్మ దర్శకుడు. హ్యాపీ మూవీస్ పతాకంపై సి.కల్యాణ్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల 28న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'వినూత్న కథా చిత్రమిది. టీజర్, ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. శ్రవణ్ భరద్వాజ్ చక్కటి బాణీలను అందించాడు. త్వరలో ఆడియో విడుదలతో పాటు ప్రీరిలీజ్ వేడుకను నిర్వహిస్తాం' అన్నారు. 'ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఇది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. కల్కీ రహస్యం మేమిటన్నది ఆసక్తికరంగా ఉంటుంది. త్వరలో థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేస్తాం' అని దర్శకుడు తెలిపారు. నవ్యత మేళవించిన మాస్ ఎంటర్‌టైనర్ ఇదని, ట్రైలర్ సోషల్‌మీడియాలో ట్రెండింగ్‌లో ఉందని జీవిత రాజశేఖర్ చెప్పారు. ఆదాశర్మ, నందితా శ్వేత, పూజితా పొన్నాడ, స్కార్లెట్ విల్సన్, రాహుల్ రామకృష్ణ, నాజర్, అశుతోష్‌రాణా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: దాశరథి శివేంద్ర, సంగీతం: శ్రవణ్‌భరద్వాజ్, స్క్రీన్‌ప్లే: స్క్రిప్ట్‌విల్, దర్శకత్వం: ప్రశాంత్‌వర్మ.

నియమాలు స్త్రీలకేనా?

ప్రియాంకచోప్రా

బాలీవుడ్ అగ్ర నాయికల్లో ఒకరైన ప్రియాంక చోప్రా, పాప్‌సింగర్, హాలీవుడ్ నటుడు నిక్‌జోనస్ ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. వీరిద్దరి మధ్య పదేళ్ల వయోభేదం ఉంది. ప్రియాంక కంటే నిక్‌జోనస్ పదేళ్లు చిన్నవాడు కావడంతో సోషల్‌మీడియాలో ఈ జంటపై కొందరు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. భార్య కంటే భర్త చిన్నవయస్కుడు కావడం సంప్రదాయానికి విరుద్ధమని విమర్శిస్తున్నారు. ఈ విషయంపై ప్రియాంకచోప్రా ఘాటుగా స్పందించింది. స్వచ్ఛమైన ప్రేమకు కులమతాలు, వయోభేదాలు అడ్డురావని స్పష్టం చేసింది. తమకంటే చాలా చిన్న వయసున్న యువతుల్ని పెళ్లి చేసుకున్న మగవారిని ప్రశ్నించని ఈ సమాజం ఆడవాళ్లను లక్ష్యంగా చేసుకోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేసింది. 'పెళ్లయి ఇన్ని రోజులవుతున్నా మా ఇద్దరి మధ్య వయసు తేడా గురించి చర్చించుకోవడం ఆశ్చర్యంగా అనిపిస్తున్నది. ఒకవేళ నిక్ నాకంటే పదేళ్లు పెద్దవాడయ్యుంటే అసలు ఈ అంశం చర్చకు వచ్చేది కాదు. నియమాలు కేవలం ఆడవాళ్లకే వర్తిస్తాయా? పురుషులు వాటికి అతీతులా? స్త్రీలపై ఆంక్షలు ఇంకెన్నాళ్లు' అని ప్రశ్నించింది ప్రియాంక. ఇద్దరు పరస్పరం గౌరవించుకుంటూ సౌకర్యవంతంగా జీవించడమే పెళ్లి ఉద్దేశ్యమని, వయోభేదాల గురించి చర్చే అనవసరమని పేర్కొంది.

శ్రియ

చంద్రశేఖర్ ఏలేటి చిత్రంలో..

పెళ్లి తరువాత సమంత సినిమాల ఎంపికలో తన పంథా మార్చుకుంది. వరుసగా విభిన్నమైన పాత్రలతో ఆకట్టుకుంటోంది. తాజాగా సమంత తరహాలోనే కొత్త తరహా చిత్రాలకు శ్రియ సిద్ధమవుతోంది. గత ఏడాది రష్యాకు చెందిన ఆండ్రూ కోస్చీవ్‌ని పెళ్లాడిన శ్రియ తెలుగులో మరే చిత్రాన్ని అంగీకరించలేదు. తాజాగా చంద్రశేఖర్ ఏలేటి చిత్రాన్ని అంగీకరించినట్లు తెలిసింది. కొత్త తరహా చిత్రాల్ని అందించే దర్శకుడిగా గుర్తింపును సొంతం చేసుకున్న చంద్రశేఖర్ ఏలేటి ఇటీవలే శ్రియకు మహిళా ప్రధాన ఇతివృత్తంతో సాగే స్టోరీ వినిపించారని, ఆయన చెప్పిన కథ విభిన్నంగా వుండటంతో ఇందులో నటించడానికి శ్రియ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. సినిమాలో శ్రియ 10 ఏళ్ల పిల్లాడికి తల్లిగా కనిపించనుందని, సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న ఓ మహిళగా ఆమె పాత్ర చాలా శక్తివంతంగా సాగుతుందని తెలిసింది. నితిన్ హీరోగా తొలుత ఓ చిత్రాన్ని తెరకెక్కించాలని చంద్రశేఖర్ ఏలేటి ప్లాన్ చేసుకున్నారు. అయితే నితిన్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఇవి పూర్తయిన తరువాతే చంద్రశేఖర్ ఏలేటి సినిమా చేయాలనుకున్నారట. దీంతో అంత సమయం ఎదురుచూడలేక మహిళా ప్రధాన చిత్రాన్ని తెరకెక్కించడానికి చంద్రశేఖర్ ఏలేటి సిద్ధమైనట్లు తెలిసింది.

మధుబాల

శివలింగాపురం కథ

ఆర్.కె. సురేష్, మధుబాల నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'శివలింగాపురం'. తోట కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. రావూరి వెంకటస్వామి నిర్మాత. ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర గీతాలు విడుదల య్యాయి. ఆడియో సీడీలను నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు ఆవిష్కరించగా, ప్రచార చిత్రాన్ని హీరో ఆర్.కె. సురేష్ విడుదలచేశారు. చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ 'చిన్న సినిమాలు ఎక్కువగా వచ్చినప్పుడే పరిశ్రమను నమ్ముకున్న వారందరికి ఉపాధి దొరుకుతుంది. ట్రైలర్, టీజర్ బాగున్నాయి' అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'గతంలో మా సంస్థపై లిటిల్ హార్ట్స్, మా తల్లి గంగమ్మ, కొక్కొరోకోతో పాటు మరి కొన్ని సినిమాల్ని నిర్మించాను. నిర్మాత ఆరవ చిత్రమిది. ఈ నెలాఖరులో విడుదల చేస్తాం' అని తెలిపారు. 'గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ ఫాంటసీ ఎంటర్‌టైనర్ ఇది. అన్నా చెల్లెళ్ల సెంటిమెంట్ ప్రధానంగా సాగుతుంది. తెలుగు ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని పంచుతుంది' అని దర్శకుడు చెప్పారు.

ప్రతి ఒక్కరు ప్రేమలో పడతారు!

కిరణ్, సోనుగౌడ, ఉపేంద్ర, చంద్రు

ఉపేంద్ర కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఐ లవ్ యు'. 'నన్నే ప్రేమించు' ఉపశీర్షిక. రచితారామ్ కథానాయిక. స్వీయనిర్మాణ దర్శకత్వంలో ఆర్.చంద్రు రూపొందిస్తున్నారు. ఈ నెల 14న ప్రేక్షకులముందుకురానుంది. శనివారం ఏపీలోని విశాఖపట్నంలో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ 'అసలు ప్రేమ అంటే ఏమిటి? నిజమైన ప్రేమను ఎలా నిర్వచించాలి? అనే అంశాల్ని సందేశాత్మక కోణంలో చర్చించే చిత్రమిది. స్వార్థంలేని ప్రేమ గొప్పతనాన్ని తెలియజేస్తుంది. క్లైమాక్స్ ఘట్టాలు భావోద్వేగభరితంగా సాగుతాయి. వాణిజ్య అంశాలతో పాటు యాక్షన్ హంగులు కూడా ఉంటాయి' అన్నారు. 'తెలుగులో నా రెండో చిత్రమిది. టీనేజ్‌లో ప్రేమ మీద సరైన అవగాహన లేకుండా చాలామంది జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారు. అలాంటి వారికి సందేశాన్ని అందించే చిత్రమిది. ఈ కథతో ప్రతి ఒక్కరూ ప్రేమలో పడతారు. క్లైమాక్స్‌లో చప్పట్లు కొడుతూ అభినందిస్తారు. ఉపేంద్ర పాత్ర చిత్రణలో భావోద్వేగాలతో పాటు వినోదం ఉంటుంది. తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందించే చిత్రమవుతుంది. రెండేళ్లకోసారి ఉపేంద్రతో సినిమాలు చేయాలనుకుంటున్నాను' అని దర్శకుడు తెలిపారు. సోనుగౌడ, బ్రహ్మానందం, హోనవల్లి, కృష్ణ, జై జగదీష్, పీడీ సతీష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సుజ్ఞాన్, సంగీతం: డా॥ కిరణ్ తోటంబైల్, రచన, నిర్మాణం, దర్శకత్వం: ఆర్.చంద్రు.